

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 51

శనివారం 13-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATI | VISAKHAPATNAM | WARANGAL

రేపు మదర్స్ డే

ప్రపంచ విజేత అయినా... 'ఆమె' బందీ అయ్యేది మాతృత్వానికి మాత్రమే.
అది అందమైన బంధం... అనురాగాల సుమగంధం.
ఉద్యోగంలో ఎదిగిన స్థానమా... అమ్మతనమా?
ఈ తరం మహిళ ముందున్న సవాల్ ఇది.
మదర్స్ డే సందర్భంగా నవతరం తల్లుల మనోగతం ఇలా ఉంది.

నేను 'అమ్మ'ని...

ఇది 21వ శతాబ్దం. 'మా అమ్మ అబల కాదు సబల' అనే నినాదం ఈ తరానిది. మార్పు ఒక తరం నుంచి మరో తరానికి మధ్య బేరీజువేసే రోజులు కావివి. పదేళ్లకో రకంగా ఆలోచనలు మారిపోతున్న వేగమైన కాలం. మహిళ ఆలోచన కూడా విస్తృతం అయింది. ఆమె గెలుస్తున్న ప్రపంచం పెద్దదైంది. ఆమెను విజేతగా నిలుపుతున్న అవకాశాలు పెరిగాయి. వాటిని అందిపుచ్చుకోవడంలో మహిళ ముందడుగు వేసింది కూడా. ఈ నేపథ్యంలో గడచిన దశాబ్ద కాలంగా మహిళకు మాతృత్వం పెద్ద ప్రశ్నార్థకంగా మారుతోంది. కెరీర్‌లో ఎదిగిన మెట్లన్నీ ఒక్కసారిగా ఇసుకమేడలా కూలిపోతున్న భావనకు లోనవుతోంది. ఒక మహిళ తనతోపాటు ఉద్యోగంలో చేరిన మేల్ కొలీగ్‌తో పోలిస్తే కొంత వెనుకబడడానికి కారణం మాతృత్వం కోసం తీసుకున్న విరామమే అయి ఉంటోంది. దాంతో నవతరం మహిళ కెరీర్ కోసం మాతృత్వాన్ని వాయిదా వేసుకుంటోంది. ఈ విషయాన్ని అంతర్జాతీయస్థాయిలో 'ద నాట్ మామ్, టీటీ కమ్యూనిటీ, ద బంప్' చేసిన అధ్యయనాల్లో ఈ విషయం నిర్ధారణ అయింది. ఉద్యోగం చేసే సంస్థలు, కుటుంబం మహిళకు మద్దతుగా నిలిస్తే ఆమె మాతృత్వాన్ని వాయిదా వేసుకోదు... అనే అభిప్రాయం వ్యక్తం అయింది. మనదేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉండడంతో మన నవతరం మహిళ సరైన వయసులో మాతృత్వాన్ని స్వాగతిస్తోంది. కొత్తగా తల్లులైన ఈ యువతులు వెలిబుచ్చిన అభిప్రాయాలే ఇందుకు నిదర్శనం.



అమ్మగా నన్ను ఎంచుకుంది!

మాతృత్వం అత్యంత విలువైనది... అని ఎన్నోసార్లు విన్నాను. ఆ మాటకు అర్థం పాప పుట్టాక తెలిసింది. ఎంతో విలువైన బహుమతిని అందుకున్న అనుభూతి కలిగింది. ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే పెళ్లి, ఆ తర్వాత రెండున్నరేళ్లకు తల్లినయ్యాను. ఈ రోజుల్లో పాతికేళ్ల లోపు తల్లికావడం అంటే ఎర్లీ అంటారేమో, కానీ నాకు సంతోషంగా ఉంది. సిజేరియన్ కావడం, డెలివరీ తర్వాత ఎక్కువ సేపు మత్తుగా ఉండడంతో పాపను ఓ సారి చూపించారు కానీ చేతికిచ్చింది పన్నెండు గంటల తర్వాత. ఆ క్షణాలను ఎలా వివరించాలో మాటలు తెలియడం లేదు. కానీ నన్ను 'అమ్మ'గా ఎంచుకుని, తన మనసు నిండా ఉన్న ప్రేమను నాకు పంచుతోంది నా పాప. నన్ను గుర్తు పట్టడం, నేను ఎటు వెళ్తుంటే కళ్లు తిప్పి అటు వైపే చూస్తూ ఉండడం, నేను కనిపించకపోతే కళ్లను అటూ ఇటూ తిప్పుతూ నన్ను వెతకడం, నేను కనిపించగానే సంతోషంగా ముఖాన్ని విప్పార్చి నవ్వడం... ఇలా ఎన్ని సంతోషాలో చెప్పలేను.

జీవితంలో ఒకటి- రెండుసార్లు మాత్రమే లభించే ఈ అదృష్టాన్ని ఏ మహిళా వదులుకోకూడదు. పాపకు పేరు పెట్టుకోవడం దగ్గర్నుంచి అన్నీ నా ఎంపికే.

– కూతురు హనికతో కీర్తి

మహాలక్ష్మికి స్వాగతం పలికారు!



కెరీర్‌పరంగా ఎన్నో మైలురాళ్లను చేరుకున్నాను. చదువు, ఉద్యోగం, ప్రమోషన్ ప్రతిదీ సంతోషాన్నిచ్చిన విషయాలే. కానీ తల్లి కావడంలో ఉన్న సంతోషంతో పోలిస్తే అవన్నీ చాలా చిన్నవని నేను తల్లిని అయిన తర్వాత తెలిసింది. నిజానికి తల్లి కావడానికి తొలి దశ నుంచి ప్రతి మూమెంట్‌నీ ఆస్వాదించాను. పీరియడ్ మిస్ కాగానే ప్రెగ్నెన్సీ కిట్‌లో టెస్ట్ చేసుకున్నప్పుడు బ్లూ నుంచి పింక్ కలర్‌కి మారుతున్న క్షణం నా మాతృత్వంలో తొలి ఉద్వేగ క్షణం. అప్పటి నుంచి పాపాయిని చూడడం, పాలివ్వడం, చేతుల్లోకి తీసుకోవడం... ఒక్కొక్కటీ ఒక్కో మధురానుభూతి. నేను బెడ్ మీద ఉండగానే సిస్టర్ పాపాయిని నా దగ్గరకు తెచ్చి పాలు పట్టించింది. లేచి కూర్చుని పాపను చేతుల్లోకి తీసుకోవాలని ఎంతగా అనిపించిందో. రెండు గంటల తర్వాత చేతికిచ్చారు.

ఉద్యోగంలో నైట్ షిఫ్ట్ డ్యూటీ కారణంగా నిద్ర మేల్కోవడంలో జీతం ఒక్కటే మన లక్ష్యం. పాప కోసం ఇంట్లో అందరం ఒకరి తర్వాత ఒకరు నిద్ర మేల్కొనేవాళ్లం. మొదటి నెల కొంచెం కష్టమైంది, కానీ తరవాత అలవాటయిపోయింది. మా అత్తగారికి ఇద్దరూ అబ్బాయిలు కావడంతో మా పాపాయి పుట్టగానే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని ఆనందంలో మునిగిపోయారంతా. బిడ్డ ఆరోగ్యంగా పుట్టాలంటే ముప్పైలోపే తల్లి కావడం మంచిదనే డాక్టర్ల సూచన మేరకు 27 ఏళ్లకు తల్లినయ్యాను.

పాపాయి నా గొంతు విని రెస్పాండ్ కావడం, గుర్తు పట్టి నవ్వడం, బోర్లాపడడం, పాకడానికి ప్రయత్నిస్తూ ముందుకు వెళ్లలేక ఏడుస్తూ దిగులుగా ముఖం పెట్టి నా కోసం వెతకడం... ప్రతి సంతోషాన్ని ఆస్వాదిస్తున్నాను. కెరీర్‌లో గ్యాప్ వచ్చిన మాట నిజమే. కానీ రెండేళ్లపాటు పాపతోనే ఉండాలనుకుంటున్నాను. ఆ తర్వాత పాపాయిని అత్తయ్యగారి చేతిలో పెట్టి మళ్లీ ఉద్యోగంలో చేరతాను.

– కూతురు ఈశానితో వైష్ణవి

జీవితకాలపు సంతోషం



నేను తల్లి కావాలనే నిర్ణయానికి రావడానికి ముందు మదర్‌హుడ్ గురించి ఎంతో చదివాను. తల్లి కావడానికి ముందు మానసికంగా సిద్ధం కావాలి. బేబీ కోసం ఎదురు చూపులోనే ఆనందం ఉంటుంది. మరే ఎదురు చూపులోనూ ఆనందం ఉండదు, ఆందోళన మాత్రమే ఉంటుంది. బిడ్డ కోసం ఎదురు చూపు ఇంట్లో అందరినీ దగ్గర చేస్తుంది. కుటుంబం అంటే ఏమిటో తెలుస్తుంది.

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అనే మాట ఎన్నింటికి వర్తిస్తుందో నాకు తెలియదు, కానీ మాతృత్వానికి మాత్రం వర్తించదు. సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్‌గా ఎన్నో ఒత్తిడుల మధ్య పని చేశాను. జీవితం ఆర్థికంగా సౌకర్యవంతంగా ఉండడం కోసమే ఆ కష్టాన్ని భరిస్తాం. బిడ్డ కోసం పడే కష్టం ఇంకా తీవ్రంగా ఉంటుంది. కానీ బిడ్డను చూసుకున్న తర్వాత కలిగే ఆనందం కష్టాన్ని మరిపిస్తుంది. ఉద్యోగంలో బెస్ట్ ఎంప్లాయ్‌గా ప్రశంసలందుకున్నాను. అప్పట్లో అదే పెద్ద సంతోషం అనుకున్నాను. కానీ తల్లిని కావడంలో జీవితకాలపు సంతోషాన్ని ఒక్కసారే పొందినట్లయింది. ప్రసవం కోసం పద్దెనిమిది గంటల పాటు నొప్పులు పడ్డాను. చివరి రోజు వరకు రోజూ గంటల కొద్దీ వాకింగ్, ఎక్సర్‌సైజ్, యోగ చేశాను. అంత కష్టం ఎందుకు అంటూ, భవిష్యత్తులో ఇతర కారణాలేవో చూపిస్తూ కొంతమంది నార్మల్ డెలివరీని అవాయిడ్ చేస్తుంటారు. కానీ నార్మల్ డెలివరీ కావాలనే కోరుకున్నాను. కానీ నాకు ఇతర కారణాల వల్ల సిజేరియన్ తప్పలేదు.

– కొడుకు త్రివిక్రమ్‌తో మృణాళిని శ్రీవాత్సవ్

సమన్వయం చేసుకోవాలి!



నేను బీఎస్సీ న్యూట్రిషన్ చేశాను. గత ఏడాది పెళ్లయింది. నాకిప్పుడు నెలల బాబు. గృహిణిని, కాబట్టి కెరీర్‌లో విరామం తీసుకోవడం అనే ప్రశ్నే తలెత్తలేదు. కానీ ఉద్యోగం చేసే వాళ్లు కూడా రెండింటినీ సమన్వయం చేసుకుంటూ సరైన వయసులో మాతృత్వాన్ని స్వాగతించాలి.

– కొడుకు మహమ్మద్ హమ్‌దాన్ ఖాన్‌తో సానియా

బిడ్డ కోసం ఉద్యోగం మానేశాను



నేను బీకామ్ చేసి కొంత కాలం ఉద్యోగం చేశాను. బిడ్డ పుట్టిన తర్వాత తనకు 'అమ్మ'గా నా అవసరం ఉందనిపించి ఉద్యోగం మానేశాను. పిల్లల కంటే మరేదీ ముఖ్యం కాదు, మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నాను. మా వారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఒక జీతమే అయినా ఇబ్బందేమీ లేదు, పిల్లలు పెద్దయిన తర్వాత మళ్లీ ఉద్యోగంలో చేరడం అనే ఆప్షన్ మన చేతిలోనే ఉంటుంది కాబట్టి ఏదో కోల్పోయాననే బెంగ లేదు. నేను కేరళలో పుట్టి పెరిగాను, డిగ్రీ హైదరాబాద్‌లో చదివాను. తెలుగబ్బాయినే పెళ్లి చేసుకున్నాను. జీవితంలో ప్రతి దశనూ ఎంజాయ్ చేస్తున్నాను. బాబుకి మా తాత కృష్ణ గుర్తుగా కృషిత్ అని పెట్టుకున్నాను. నేను తాత దగ్గరే పెరిగాను. ఇప్పుడు తాత నా చేతిలో పెరుగుతున్నాడని మురిసిపోతున్నాను.

– కొడుకు కృషిత్‌తో లావణ్య

కాలం వెనక్కి రాదు!



జీవితంలో ప్రతిదీ ముఖ్యమే. ఒకదాని కోసం మరొకటి వదులుకోకూడదు. కాలం మళ్లీ తిరిగి వచ్చేది కాదు. నేను బీటెక్ చేసి కొంతకాలం ఉద్యోగం చేశాను. సివిల్స్ ప్రిపరేషన్ కోసం ఉద్యోగం నుంచి విరామం తీసుకున్నాను. తొలి ప్రయత్నంలో సాధించలేకపోయాను. ఏ వయసులో జరగాల్సినది ఆ వయసులో జరగాలని పెళ్లి వయసు దాటకూడదని అమ్మానాన్నలు పట్టుపట్టడంతో కెరీర్‌లో గ్యాప్ వచ్చింది. పెళ్లి తర్వాత మాతృత్వాన్ని వాయిదా వేయడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. మా ఫ్యామిలీ డాక్టర్ మాతృత్వం గురించి అందరికీ కౌన్సెలింగ్ ఇస్తుంటారు. కనీసం ముప్పైలోపు డెలివరీ ప్లాన్ చేసుకోకపోతే ఎలాగ? అని కోప్పడుతుంటారు కూడా.

రీ ఇగ్నైట్ అనేది కూడా ఆలోచించుకుని ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవడం మంచిదే. ఏదైనా సరే ఆలోచన క్లియర్‌గా ఉండాలి. ఆ తరవాత రిగ్రెట్స్ ఉండకూడదు. నా మటుకు నేను బిజినెస్ ప్లాన్ చేసుకోవాలనుకుంటున్నాను. మాతృత్వం కోసం తీసుకున్న ఈ గ్యాప్‌లో బాబుతో చక్కగా ఎంజాయ్ చేస్తున్నాను.

– కొడుకు దర్శిష్‌తో ప్రజ్వల

– వాకా మంజులారెడ్డి

ఆలోచింప చేసే అమ్మ కథ

'అమ్మను మసిగుడ్డలా చూస్తున్నామా?'
అని ప్రశ్నిస్తుందో తెలుగు కథ.
'ఇంట్లో నుంచి బయటకు పో అని
అమ్మను నాన్న ఎందుకు అంటుంటాడు'
అని నిలదీస్తుంది మరో కథ.
'అమ్మ ఒంటి నిండా మందులు చేరడానికి
కారణం ఎవరు?' అని వేదన చెందుతుంది ఇంకో కథ.
'అమ్మకు కంటి నిండా నిద్రన్నా ఉంటుందా?'
అని కన్నీరు కారుస్తుంది కథ.
'మదర్స్ డే' రోజున అమ్మను తలచుకోవడం,
గౌరవించడం అందరూ చేసేదే.
కాని ఆమె గురించి ఆలోచించాలి. సరిగా ఆలోచించాలి.
ఆమె శ్రమను, గౌరవాన్ని, స్థానాన్ని సమస్థాయిలో
ఉంచడం గురించి తెలుగులో వచ్చిన
కొన్ని గొప్ప కథల ప్రస్తావన...

ఆమె పేరు ఏమిటో ఆమెకు గుర్తు లేదు. భర్త 'అది' అంటాడు. ఇంటికి రాగానే 'అదెక్కడా?' అని కొడుకును అడుగుతాడు. కొడుక్కు కూడా 'అది' అనడం అలవాటే. 'పిల్లల బాధ నీకెందుకు? అది చూసుకుంటుంది కదా' అని అంటుంటాడు. ఈ 'అది' ఆ ఇంట్లో ఏనాడూ కూచోవడానికి వీల్లేదు. నిలబడి చేస్తూ ఉండాల్సిందే. భర్త రిటైరైనా పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ సంపాదిస్తూ ఉంటాడు కాబట్టి అతను ఇంట్లో హాయిగా కూచోగలడు. కొడుకు, కోడలు ఉద్యోగాలు చేస్తారు. డబ్బు ఉంది. వాళ్లు కూచుంటారు. ఈ 'అది'కే ఏ సంపాదనా లేదు. 'నేను తల్లిని కదా' అనుకుంటుంది. అయితే? 'నేను అత్తగారిని, నానమ్మని కదా' అనుకుంటుంది. అయితే? ఇంట్లో ఎవరికీ ఏ విలువా లేదు. 'అది.. ఇది' అనడమే. ఒకరోజు ఆమె గేటు దగ్గర నిలబడి ఉంటే ఇద్దరు పనమ్మాయిలు మాట్లాడుకుంటూ వెళుతుంటారు. ఒకమ్మాయి అంటుంటుంది- 'ఆ ఇంట్లో పని మానేశాను. ఆదివారం కూడా చేయిస్తున్నారు' అని. విన్న ఆమె దిగ్భ్రమ చెందుతుంది. ఇన్నేళ్లుగా ఇంత చాకిరీ చేస్తున్నా ప్రతిఫలం లేకపోగా చులకనగా చూడటమా? ఉన్నది ఉన్నట్టుగా ఆ పని మనుషుల వెంట నడుస్తుంది. 'మనలాంటి వాళ్ల కోసం ఒక మేడమ్ మంచి హోమ్ నడుపుతున్నారు. అక్కడ చేర్పిస్తాం. పద' అని వాళ్లు తీసుకెళ్లి చేర్పిస్తారు. ఆ మేడమ్ ఆమెను పేరు అడుగుతుంది. ఏనాడో మర్చిపోయిన పేరును గుర్తు చేసుకోవడం వల్ల ఆ తల్లి కొత్త అస్తిత్వం, ఆత్మగౌరవం పొందుతుంది. కె.రామలక్ష్మి రాసిన 'అదెక్కడ' కథ ఇది. ఇలా ఇంట్లో అమ్మను చూసుకుంటున్నవారు ఉంటే ఈ కథ చెప్పే నీతి ఏమిటో గ్రహించాలి.



ఒక ఇంట్లో ఒక తల్లి మరణిస్తుంది. దుప్పటి తీసి చూసిన భర్త అదిరిపోతాడు. ఎందుకంటే ఆమె శరీరం మొత్తం సుద్దముక్కలా తెల్లగా అయిపోయి ఉంటుంది. ఇలా ఎందుకు జరిగింది? ఇదేం వింత జబ్బు? ఆ కాలనీలో ఉన్న ఒక చురుకైన అమ్మాయి ఆ తల్లి ఒంటి నుంచి చిన్న ముక్క తీసి ల్యాబ్‌కు పరిగెత్తి పరీక్ష చేయిస్తే ఆ ముక్క 'ఆస్ప్రిన్' టాబ్లెట్ అని తేలుతుంది. అంటే ఆమె శరీరం మొత్తం మందు బిళ్లలతో నిండిపోయిందా? అందుకే సుద్దముక్కలా మారిందా? నిజానికి ఆ చనిపోయినామెకు 'సూపర్ మామ్' అని పేరు. పిల్లల్ని బాగా పెంచేది. భర్తను బాగా చూసుకునేది. ఇల్లు బాగా పెట్టుకునేది. పైగా ఉద్యోగం చేస్తూ ఇవన్నీ చేసేది. పిల్లల్ని చదివించి, ప్రయోజకుల్ని చేసి, అమెరికా సంబంధాలు చూసి సెటిల్ చేసి... ఇన్ని చేసి అందరి ప్రశంసలు పొందిన ఆమె కొన్ని విషయాలు దాచింది. ఏమిటవి? ఆఫీసు పని వొత్తిడితో రోజూ ఒక తలనొప్పి మాత్ర వేసుకునేది. ఇంటి పనులకు ఆటంకం రాకుండా ఒళ్లు ఏమాత్రం వెచ్చబడినా ఒక మాత్ర వేసుకునేది. శుభకార్యాలకు అడ్డు రాకుండా నెలసరిని వెనక్కు నెట్టడానికి మాత్రలు వేసుకునేది. గర్భసంచి తీయించేస్తే సప్లిమెంట్లు తెగ మింగింది. హార్మోనల్ ఇంబేలెన్స్ అంటే అందుకు మళ్లీ మందులు. అనారోగ్యం గురించి చెప్పి భర్తను, పిల్లల్ని డిస్టర్బ్ చేయకుండా ఏ ఇబ్బంది వచ్చినా మాత్రలే మాత్రలు. అందుకే మరణించగానే ఒళ్లు అలా తెల్లబడింది. తేలిపోయింది. ఇది అర్థమయ్యాక, ఆమె సూపర్‌మామ్ సింద్రోమ్‌తో మరణించిందని అర్థమయ్యాక ఆ కాలనీ అమ్మాయి తన తల్లి దగ్గరకు పరిగెడుతుంది. 'అమ్మా... నువ్వు గొప్పల కోసం నిన్ను నువ్వు బలిపెట్టుకోకు. కొద్దిగానే పని చెయ్. విశ్రాంతి తీసుకో. ఆరోగ్యం మెరుగు పర్చుకో' అని చెప్పడానికి. కె.సత్యవతి రాసిన 'సూపర్‌మామ్ సింద్రోమ్' ఇస్తున్న సందేశం అర్థమైందిగా.

ఒక భర్త భార్య మీద కోపం వచ్చిన ప్రతిసారీ 'పో నా ఇంటి నుంచి' అంటుంటాడు. అది అతని ఊతపదం. ఏ ఇల్లయినా భర్తదే. భార్యది కాదు. తండ్రిదే. తల్లిది కాదు. అందుకే భర్తలు భార్యల్ని ఇంటి నుంచి గెంటేస్తుంటారు. లేదా గెంటేస్తానని బెదిరిస్తుంటారు. పిల్లల్ని కన్నా, పొదుపు చేసి ఆ డబ్బు భర్త చేతిలో పెట్టినా, ఇల్లు దగ్గరుండి కట్టించినా, అందులో సంసారం చేసినా ఆ ఇల్లు మాత్రం ఆమెది కాదు. అతనిదే. ఒకరోజు ఆమెకు చివుక్కుమంటుంది. ఇంటి నుంచి రెండు మూడు చీరలతో బయటపడి దూరంగా ఒక గది అద్దెకు తీసుకుంటుంది. చిన్న ఉద్యోగం వెతుక్కుంటుంది. స్వవ్వు గివ్వు పెట్టుకుని ఇంకెవరూ తనని బెదిరించలేని తన ఇంట్లో ఉంటుంది. దాంతో ఆ భర్త తెగ కంగారు పడిపోతాడు. కాలనీ కంగారు పడుతుంది. బంధువులు కంగారు పడతారు. కాని ఆమె మాత్రం 'అతడికి విడాకులు ఇవ్వను. కావాలంటే నా దగ్గరకు వచ్చి నా ఇంట్లో ఉండమనండి' అని వర్తమానం పంపుతుంది. ఏం కథ ఇది. ఏ ఇంట్లో అయినా అమ్మ ఈ మూడ్‌లో ఉందేమో ఎవరు గమనించాలి? ఇది కవన శర్మ 'ఆమె ఇల్లు' కథ.

పాటిబండ్ల రజని రాసిన 'జేబు' కథ ఉంటుంది. అందులో ఒకామె అందరూ జేబు రమణమ్మ అని పిలుస్తూ ఉంటారు. దాని కారణం ఆమె తన బాల్యంలో తల్లి ప్రతి రూపాయి కోసం తండ్రి దగ్గర చేయిజాస్తూ ఉండటమే. అలా తాను ఉండకుండా తన రవికకో, చీర కుచ్చిళ్లకో ఒక జేబు ఉండాలని భావిస్తుందామె. అలా జేబులాంటి గుడ్డ సంచిని దోపుకునే బతుకుతుంది. పసుపు కుంకాలుగా కోడలు తెచ్చిన భూమిని భర్త, కొడుకు అమ్మబోతే వారించి 'అది కోడలి ఆర్థిక భద్రత కోసం ఉండాలి' అని గట్టిగా నిలబడుతుంది. అమ్మకు ఉండాల్సిన ఆర్థిక స్వాతంత్ర్యం గురించి ఆర్థిక గౌరవం గురించి ఆలోచిస్తున్నామా మనం.

'మసిగుడ్డ' లేకుండా వంట చేయడం అసాధ్యం. కాని మసిగుడ్డకు ఏ విలువా ఉండదు. పిల్లల్ని తల్లి పెంచుతుంది. కాని ప్రోగ్రెస్ కార్డ్ మీద తండ్రి సంతకం చేస్తాడు. పిల్లలకు తల్లి ఒండి పెడుతుంది. కాని పిల్లలు వెచ్చాలకు డబ్బులిచ్చే తండ్రినే గౌరవిస్తారు. బంధువులు శుభలేఖ ఇస్తూ దానిపై అతని పేరే రాస్తారు. ఆస్తి పన్ను, కరెంటు బిల్లు, ఇంటి గడపకు నేమ్‌ప్లేట్ అన్నీ అతనివే. ఆమె మసిగుడ్డ. కాని అది లేకపోతే ఏ పనీ జరగదు. కుప్పిలి పద్మ రాసిన 'మసిగుడ్డ' కథ ఇది. కిచెన్‌లోకి నేడు వెళ్లి చూసినా అమ్మ పాత జాకెట్టే మసిగుడ్డగా కనిపిస్తుంది. నాన్న పాత చొక్కా కాదు. అమ్మకు గౌరవం ఇవ్వలేమా?

బతికినంత కాలం ఇంటి చాకిరీలో పడి, తెల్లవారు జామునే లేస్తూ, రాత్రి లేటుగా వంట గది సర్దుకుని పడుకుంటూ, చంటి పిల్లల వల్ల, వృద్ధులైన అత్తమామల వల్ల, వేరే సవాలక్ష బాధ్యతల వల్ల కంటి నిండుగా నిద్రపోని ఒక తల్లి తనకు నిద్ర కావాలని, కనీసం ఈ వృద్ధాప్యంలో అయినా హాయిగా నిద్రపోవాలని గుప్పెడు నిద్ర మాత్రలు మింగుతుంది. కంటి నిండా నిద్ర పోయే 'లగ్జరీ' ఇవాళ్టికీ అమ్మకు ఉందా?

అమ్మ గురించి మదర్స్ డే సందర్భంగా ఆలోచిద్దాం. అమ్మను మొదట మనిషిగా చూస్తే, వ్యక్తిగా చూస్తే, పౌరురాలిగా చూస్తే ఆమె హక్కులు అర్థమవుతాయి. ఆ హక్కులు ఆమెకు మిగల్చడమే అందరి విధి.


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 51

శనివారం 13-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




కాంస్యాలతో ముగింపు..

ప్రపంచ పురుషుల బాక్సింగ్‌లో భారత్‌కు 3 కాంస్య పతకాలు - 11లో



62 వేల ఎగువకు సెన్సెక్స్

స్వల్ప లాభాలతో దేశీ స్టాక్ మార్కెట్లు 18 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ - IVలో



నేడే కర్ణాటక తీర్పు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. 36 కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం 8 నుంచి ఓట్లను లెక్కిస్తారు.

వివరాలు 6లో ▸



ఇమ్రాన్ ఖాన్‌కు బెయిల్

భూమి బదలాయింపు కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు ఇస్లామాబాద్ హైకోర్టు 2 వారాలపాటు బెయిల్ మంజూరు చేసింది.

వివరాలు 6లో ▸



కేరళ స్టోరీపై నిషేధం ఎందుకు ?

తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలు ది కేరళ స్టోరీ సినిమాను ఎందుకు నిషేధించాయో చెప్పా లంటూ సుప్రీం నోటీసులు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



ఎన్ఈపీని అమలు పరచాలి

కొత్త జాతీయ విద్యా విధానాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸

ఏది నిజం?

'వరం' పోయిందని కడుపు మంట

- డీపీటీకి అడ్డుకట్ట పడిందనే అక్కసుతోనే రామోజీ తప్పుడు రాతలు
- చంద్రబాబు తప్పులను సరిదిద్దుతూ శరవేగంగా పోలవరం నిర్మాణం
- అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌లు 2021కే పూర్తి
- 2021 జూన్ 11న గోదావరి ప్రవాహం 6.1 కి.మీ మళ్లింపు
- ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికే దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- ఇప్పటికే జలాశయం రూపాన్ని సంతరించుకున్న పోలవరం
- డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాల పూడ్చివేత వేగవంతం
- ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని జూన్ నాటికి యథాస్థితికి తెచ్చే దిశగా అడుగులు
- ఆ తర్వాత గోదావరి వరదల్లోనే గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దిద్దుబాటు పనులు

4 లో

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన సభకు హాజరైన జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం జగన్





లక్ష కుటుంబాలకు ఊరట..

చిక్కులకు విముక్తి

చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం: కావలి సభలో సీఎం జగన్

- 2,06,171 ఎకరాలపై రైతన్నలకు సంపూర్ణ హక్కు
- మార్కెట్ విలువ రూ.20 వేల కోట్లపైనే
- నా ప్రతి అడుగులోనూ రైతు సంక్షేమమే ధ్యేయం
- వందేళ్ల తర్వాత భూముల రీ సర్వే
- వ్యవసాయం దండగన్న వారు రైతు వేషాలేస్తున్నారు
- పొరపాటున టీడీపీకి అవకాశమిస్తే సంక్షేమ పథకాలకు మంగళమే
- డీపీటీ కోసం చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియా పన్నాగం.. డీబారైన దానయ్యలను ఆర్థిక శాస్త్రవేత్తలుగా చూపిస్తూ రోత రాతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ''రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం మనది. నా ప్రతి అడుగులోనూ రైతు సంక్షేమం ఉంటుంది. భూమితో వారికున్న అనుబంధం తెలిసిన వ్యక్తిగా రైతన్నలకు మేలు చేసే కార్యక్రమాలను చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 97 వేలకుపైగా రైతు కుటుంబాలకు మంచి చేస్తూ చుక్కల భూములపై సర్వ హక్కులు కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం'' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో చుక్కల భూములపై రైతులకు హక్కుపత్రాల పంపిణీ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ఆ వివరాలివీ..

సర్వ హక్కులు కల్పిస్తూ..

రాష్ట్రంలో దాదాపు లక్ష కుటుంబాలకు మేలు చేస్తూ దేవుడి దయతో ఇవాళ మరో మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. 2,06,171 ఎకరాల చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో తగిన మార్పులు చేసి రైతులకు సర్వ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22–ఏ నుంచి వాటిని తొలగిస్తూ మంచి చేస్తున్నాం. ఇన్నాళ్లూ 22–ఏలో ఉన్న ఈ భూముల రిజిస్ట్రేషన్ విలువ దాదాపు రూ.8 వేల కోట్లు. బయట వీటి మార్కెట్ విలువ

మిగతా 8వ పేజీలో ▸

'మహాయజ్ఞం'లో ముఖ్యమంత్రి

- సంకల్పం తీసుకొని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- అమ్మవారికి పంచామృతాలతో స్వయంగా అభిషేకం
- యజ్ఞశాలలో గోమాతకు పూజలు..
- యాగశాల చుట్టూ ప్రదక్షిణలు
- ఆశీర్వచనం అందజేసిన శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతి

8 లో



యజ్ఞశాలలోని మండపంలో అమ్మవారికి హారతిస్తున్న సీఎం జగన్

న్యూస్‌రీల్

ఉద్యానపంటలకు హబ్‌గా ఏపీ



ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల ఉద్యాన పంటలకు ఏపీ హబ్‌గా మారిందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఐదో స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

వివరాలు 7లో ▸

టెన్త్ టాపర్లకు కలెక్టర్ విందు



విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షల్లో 570 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సన్మానించారు.

వివరాలు 9లో ▸

రైతు భరోసాకు 18 వరకు

దరఖాస్తుల స్వీకరణ

- అర్హతలున్నవారు ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి
- వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్



సాక్షి, అమరావతి: 2023–24 సీజన్‌కు సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా పథకానికి కొత్తగా అర్హత పొందినవారు, గతంలో అర్హత కలిగి లబ్ధి పొందని భూ యజమాన రైతులు, అటవీ భూసాగుదారులు ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నాలుగేళ్లుగా ఈ పథకం ద్వారా మే నెలలో తొలి విడత పెట్టుబడి సాయం విడుదలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇందుకోసం అర్హత పొందినవారు సమీప ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. తమ దరఖాస్తులను రైతు భరోసా పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకునేందుకు ఈ నెల 3 వరకు గడువునివ్వగా 90,856 మంది భూ యజమానులు, 6,632 మంది అటవీ భూసాగుదారులు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరితో పాటు 2022–23లో రైతు భరోసా కింద లబ్ధి పొందేందుకు అర్హత కలిగిన రైతుల జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ నెల 12 నుంచి ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నామని చెప్పారు. అర్హుల జాబితాలో

మిగతా 9వ పేజీలో ▸



సకాలంలోనే నైరుతి రుతుపవనాలు

- జూన్ మొదటి వారంలోనే కేరళలోకి ప్రవేశించే అవకాశం
- రాష్ట్రంలో కొనసాగుతున్న సూర్యుడి భగభగలు
- కర్నూలు జిల్లా మంత్రాలయంలో అత్యధికంగా 43.5 డిగ్రీల నమోదు

10 లో

చట్టప్రకారం జీఓ–1పై మార్గదర్శకాలు

రూపొందించుకోవచ్చు

- ఈ జీఓ విషయంలో ప్రభుత్వానిది మంచి ఉద్దేశమే
- పబ్లిక్ రోడ్లు, వీధులపై ఆటంకాలు సృష్టిస్తే, వాటిని అడ్డుకునే అధికారం సంబంధిత అధికారికి ఉంది
- అదే సమయంలో సమావేశాలు, ఊరేగింపులకు మన రాజకీయ జీవితంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది కాబట్టి ఆ జీఓ రద్దు
- హైకోర్టు ధర్మాసనం తీర్పు



సాక్షి, అమరావతి: నెల్లూరు జిల్లా, కందుకూరులో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాట కారణంగా పలువురు మరణించిన నేపథ్యంలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, మున్సిపల్, పంచాయతీ రోడ్లు, రోడ్ మార్జిన్‌లలో బహిరంగ సభల ఏర్పాటును నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 10వ పేజీలో ▸

ఇంకొంచెం



టీడీపీతో పొత్తు ఖరారయ్యిందంటేనే మీరు సీఎం రేసులో లేరని అర్థమైంది!

జనసేన, టీడీపీ, బీజేపీ

పొత్తు ఖాయం

- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పునరుద్ఘాటన
- నేను మాట్లాడిన చర్చల ప్రకారమే ఈ మాట చెబుతున్నా
- ఇప్పుడు జనసేనకు ఉంది పోటీ చేసే బలమే గానీ, అధికారం తెచ్చుకునే బలం కాదు
- త్రిముఖ పోటీ జరిగి ఇంకోసారి బలికావడానికి నేను సిద్ధంగా లేను.. వైఎస్సార్‌సీపీని గద్దె దించడమే జనసేన ప్రథమ ఆలోచన
- సీఎం అభ్యర్థి ఎవరన్నది ఎన్నికలయ్యాక చూసుకుంటాం.. రాష్ట్రంలో మార్పు రావాల్సింది నేతల్లో కాదు, ప్రజల్లోనే..



సాక్షి, అమరావతి: ఇప్పుడు పొత్తుల్లో సీఎం అభ్యర్థిగా ఎవరుండాలన్నది ప్రధానం కానే కాదు.. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీలు ఖచ్చితంగా పొత్తులో కలిసిపోటీ చేస్తాయని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పునరుద్ఘాటించారు. మంగళగిరిలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ నేతల సమావేశంలో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. పొత్తు ఉండి తీరుతుంది. బీజేపీనో లేదంటే టీడీపీనో ఈ పొత్తు వద్దనుకుంటే నాకు తెలియదు. నేను మాట్లాడిన చర్చల ప్రకారం ఈ మాట చెబుతున్నా. నేను పొత్తుకు సిద్ధమని ప్రకటించాను తప్ప పొత్తుల చర్చలు ఆ స్థాయిలో జరగలేదు. ఒకవేళ పొత్తులు ఒకే అయితే ఓ కామన్ మినిమం ప్రోగ్రాంను

మిగతా 2వ పేజీలో ▸

చంద్రబాబు కోసమే

పవన్ రాజకీయం

- రైతుల గురించి కాకుండా రాజకీయంపైనే ఎక్కువ మాటలు
- పార్టీ పెట్టిన నాటి నుంచి బాబుతోనే లాలూచీ
- జనసేన టెంట్ హౌస్ పార్టీ
- దానికి బలమే లేదు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని

2 లో



బాబు శపథం నెరవేర్చడమే

పవన్ లక్ష్యం

- పవన్‌కళ్యాణ్ జనసేనను ప్రారంభించింది ప్రజల కోసం కాదు.. చంద్రబాబు కోసం
- జనసేన కార్యకర్తలు, కాపులను బాబుకు పవన్ తాకట్టు పెట్టారు
- టీడీపీ కాపుల వ్యతిరేక పార్టీ
- కాపులకు అండగా నిలుస్తున్నది సీఎం వైఎస్ జగనే..
- ఇప్పటికైనా జనసేన కార్యకర్తలు, కాపులు ఆలోచించుకోవాలి
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



2 లో

క్లుప్తంగా...

రాష్ట్రంలో అల్లర్లకు టీడీపీ కుట్ర
మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మందస: రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికి తెలుగుదేశం పార్టీ కుట్రలు చేస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని సొండిపూడిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అప్పుల శాతం పెరగలేదని, సంక్షేమంలో మాత్రం ఎదుగుదల కనిపిస్తోందన్నారు. ఆర్థిక నిపుణుడి పేరిట మోసపూరిత కథనాలను 'ఈనాడు' ప్రచురించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి బాగానే ఉన్నా, పని కట్టుకుని బురద జల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. కుట్రదారులను నమ్మవద్దని, రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కొట్టే దెబ్బ.. చంద్రబాబు ఇంటికే పరిమితమయ్యేలా ఉండాలన్నారు. ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి అందిస్తున్న పథకాలను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు.

సాక్షి టీవీ రిపోర్టర్‌పై టీడీపీ కార్యకర్తల దాడి
తణుకు చంద్రబాబు సభలో దాష్టీకం

తణుకు: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శుక్రవారం రాత్రి 'సాక్షి' టీవీ రిపోర్టర్ శ్రీకాకుళపు దుర్గానాగవెంకట సత్యప్రసాద్‌పై పలువురు తెలుగుదేశం కార్యకర్తలు దాడిచేశారు. జాతీయ రహదారి పక్కనున్న ఎంబీఏ కళాశాల ప్రాంగణంలో రైతుపోరుబాట పేరుతో ఏర్పాటుచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సభ కవరేజీ కోసం సాక్షి టీవీ రిపోర్టర్ వెళ్లారు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా ఉన్న గ్రౌండ్‌ను సత్యప్రసాద్ సెల్‌ఫోన్‌తో వీడియో తీస్తుండగా ఏలూరుకు చెందిన పుజారీ నిరంజన్‌తోపాటు సుమారు పదిమంది దుర్భాషలాడుతూ దాడి చేశారు. అతడి వద్ద సెల్‌ఫోన్ లాక్కుని ఫార్మేట్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ సీఐ సీహెచ్.ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ చేతులెత్తేశాడు
- జనసేనకు ఎజెండా లేదు.. సిద్ధాంతం లేదు
- ఒంటరిగా పార్టీని నడపలేనని ప్రకటించాడు
- పవర్‌స్టార్ కాదు.. ప్యాకేజీ స్టార్ అని ఎప్పుడో చెప్పాం
- జనసైనికులను జెండా కూలీలుగా చేసేశాడు
- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: జెండా.. ఎజెండా.. సిద్ధాంతాలు.. స్థిరత్వం లేని పవన్ కళ్యాణ్ నిర్ణయాలతో జనసేన పార్టీని జెండాసేనగా.. జనసైనికులను జెండా కూలీలుగా మార్చేశాడని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. పవన్ కల్యాణ్‌ను సీఎంగా చూడాలని కోరుకునే ప్రతీ జనసైనికుడు ఇప్పుడు టీడీపీ జెండా మోయాల్సిందేనన్నారు. గతంలో చంద్రబాబు కోసమే జనసేన పార్టీ పెట్టారంటే.. చెప్పు చూపించారని, మరిప్పుడు జనసేన కార్యకర్తలు పవన్‌కు చెప్పులు చూపించే సమయం ఆసన్నమైందన్నారు. ఇక్కడి సర్క్యూట్ హౌస్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

రెండ్రోజులుగా ఏపీలో పవన్‌కల్యాణ్ అనే పొలిటికల్ టూరిస్ట్ వచ్చాడు. ఆయన మాటల తీరు చూస్తుంటే రాజకీయంగా చేతులెత్తేశారని స్పష్టంగా అర్థమవుతోంది. 2024 ఎన్నికల్లో తాను ఒంటరిగా పోటీచేయనని ఆయనే స్వయంగా చెప్పారు. అసలు రాష్ట్రంలో 26 జిల్లాలకు పార్టీ అధ్యక్షులే లేరు.. ఇప్పుడు మండలాలకు అధ్యక్షులు ఎలా వచ్చారు? ఏడాది నుంచి మేం పవర్ స్టార్ కాదు.. ప్యాకేజీ స్టార్ అని చెబుతూనే ఉన్నాం. చంద్రబాబుకు అమ్ముడు పోయారని గతంలోనే చెప్పాం. ఇప్పుడదే నిజమైంది.

ఆ ఓట్లతో జగన్‌ను ఓడించగలరా?

నిజానికి.. గత ఎన్నికల్లో జనసేనకి 6.5 శాతం ఓట్లు మాత్రమే పడ్డాయి. ఈ ఓట్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించగలరా? మీ అన్నయ్య 35 శాతం ఓట్లు ఉన్నాయంటాడు.. నువ్వు 18 శాతం ఓట్లు అంటావు. అసలు ఒంటరిగా పోటీచేస్తేనేగా మీ పార్టీకి ఎంత బలం ఉందో తెలిసేది. చంద్రబాబు ఇంటికి వెళ్లినప్పటి నుంచి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధపడుతున్నారు. ఇక వారాహి వాహనం ఎక్కడుందో ఎవరికీ తెలీదు. ఒకరోజు సినిమా చేస్తే రూ.2 కోట్లు ఇస్తారంటున్న పవన్‌కల్యాణ్‌కు చంద్రబాబు చెప్పినట్లు వింటే ఎంత ప్యాకేజీ ఇస్తున్నారో చెప్పాలి. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుంది. 2019 ఎన్నికల ఫలితాలే రిపీట్ అవుతాయి.. ఇది తథ్యం. గుంపుగా వచ్చే దొంగల ముఠాకు గుణపాఠం చెప్పడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు.

వికటించిన టీడీపీ పచ్చ డ్రామా

- తణుకులో చంద్రబాబు రైతు పోరుబాట
- ఆయనకు తడిసిన ధాన్యం చూపాలని నేతల కథ, స్క్రీన్ ప్లే
- బాబు పర్యటించే మార్గంలో నలుగురు చొప్పున పెట్టి వారికి తడిసిన ధాన్యం అప్పగింత
- తణుకు ప్రాంతంలో తడిసిన ధాన్యం లేకపోయినా ఇతర ప్రాంతాల నుంచి తరలింపు.. అడ్డుకున్న పోలీసులు
- బాబు పర్యటనను పట్టించుకోని రైతులు
- మరో ఫ్లాప్ షోగా యాత్ర



తణుకు శివారులో కోత కోసిన పొలంలో ఫొటోలు, వీడియోల కోసం నడుస్తున్న బాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రజల సంక్షేమం పట్టకుండా.. దేన్నైనా రాజకీయం చేయడమే అలవాటుగా మార్చుకున్న టీడీపీ నేతలు మరోసారి పచ్చ డ్రామాకు తెరతీశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, ఇరగవరంల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటనను పురస్కరించుకుని తడిసిన ధాన్యంతో హడావుడి చేయాలని ప్రయత్నించి అభాసుపాలయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాలతో చేపట్టిన ఈ పచ్చ డ్రామాను పోలీసులు భగ్నం చేశారు. చంద్రబాబు పర్యటించే తణుకు, ఇరగవరం మండలాల్లో ప్రతి 30 అడుగుల దూరంలో నలుగురు రైతులను టీడీపీ నేతలు ఉంచారు. వారందరికీ తలొక ఐదు కిలోలు తడిసిన ధాన్యాన్ని ఇచ్చారు. చంద్రబాబు వచ్చినప్పుడు ఆ ధాన్యం చూపించి పూర్తిగా నష్టపోయామని కన్నీరు పెట్టుకుని చెప్పాలని వారికి కథ, స్క్రీన్ ప్లే అందించారు.

తడిసిన ధాన్యంపై ఎండుగడ్డి కప్పి..

చంద్రబాబు పర్యటించిన తణుకు, ఇరగవరంల్లో తడిసిన ధాన్యం లేకపోవడంతో పాలకొల్లు, దువ్వ మండలాల్లో సేకరించడానికి టీడీపీ గుర్తుతో ఉన్న ఒక ట్రాక్టర్‌ను ఆ పార్టీ నేతలు నాలుగు గ్రామాల్లో తిప్పారు. అక్కడ కొంత తడిసిన ధాన్యాన్ని పోగుచేశారు. ఎవరికీ అనుమానం రాకుండా దానిపై ఎండుగండి కప్పి తణుకు మీదుగా ఇరగవరానికి ట్రాక్టర్‌ను తరలించారు. చంద్రబాబు శుక్రవారం ఇరగవరం నుంచి తణుకు వరకు 12 కిలోమీటర్లు పర్యటించి తణుకు బహిరంగ సభలో ప్రసంగించేలా టూర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్త మైగాపుల నాగేశ్వరరావు అలియాస్ నాగయ్యకు చెందిన ట్రాక్టర్‌లో తడిసిన ధాన్యాన్ని తీసుకువచ్చారు. ఇరగవరం మండలం నుంచి తణుకులో చంద్రబాబు ప్రవేశించే రోడ్డుపై ముందస్తుగా కుప్పపోసి పెట్టారు. తణుకు పోలీసులు చంద్రబాబు భద్రతలో భాగంగా ఆ రోడ్డును తనిఖీ చేశారు. ఈ క్రమంలో 'తణుకు రూరల్ మండలంలో తడిసిన ధాన్యం లేదు కదా ఇదంతా ఏంటి' అని ట్రాక్టర్ యజమానిని పోలీసులు ప్రశ్నించారు. టీడీపీ నేత రాధాకృష్ణ సూచనల మేరకు దువ్వ, ఇతర ప్రాంతాల నుంచి తడిసిన ధాన్యాన్ని తెచ్చామని ట్రాక్టర్ యజమాని చెప్పాడు. తణుకు, ఇరగవరం మండలాలకు చెందిన ధాన్యం కాకపోవడంతో పోలీసులు, అక్కడే ఉన్న రైతులు ఇది సరికాదని ట్రాక్టర్ యజమానిని హెచ్చరించారు. దీంతో రోడ్డుపై పోసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి టీడీపీ నేతలు లోడ్ చేశారు. ట్రాక్టర్‌కు పర్మిట్, లైసెన్స్ లేకపోవడంతో పోలీసులు వాహనాన్ని రవాణా శాఖాధికారులకు అప్పగించారు.

టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల సరికొత్త డ్రామా..

పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకున్నప్పుడు అదే సమయంలో అటుగా వెళ్తున్న టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రైతులపై దౌర్జన్యం చేస్తారా అంటూ పోలీసులపై చిందులు తొక్కారు. ఇది ఇక్కడి ధాన్యం కాదని, ఎక్కడి నుంచో తెచ్చి ఇక్కడ కుప్పలు పోయడం సరికాదని పోలీసులు రామానాయుడికి గట్టిగా చెప్పారు. దీంతో నిమ్మల అక్కడ నుంచి జారుకున్నారు.

రైతుల నుంచి స్పందన కరువు

బాబు యాత్రకు రైతుల నుంచి స్పందన కరువైంది. జనాలను తరలించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నా ఫ్లాప్ షోగానే మిగిలింది. కనీసం పదుల సంఖ్యలో కూడా రైతులు కనిపించలేదు. గోటేరులో ఇద్దరు టీడీపీ సానుభూతిపరులతో మాట్లాడించారు. వారిలో కూడా ఒక రైతు 'ఎవరొచ్చినా మాకేం ఉపయోగంలేదు.. అని చెప్పి వెళ్లిపోయారు.

ధనవంతులకు ఉపయోగపడేలా ఎయిర్‌పోర్టులు కట్టాను



జనం, రైతులు లేక వెలవెలబోతున్న సభా ప్రాంగణం

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/తణుకు రూరల్: సమస్యలు చెప్పుకోవడానికి రైతులు తన వద్దకు వస్తుంటే రాకుండా అడ్డుకుని భయపెడుతున్నారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మండిపడ్డారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను పరామర్శించడానికి తాను వస్తుంటే.. రైతులను రానీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో శుక్రవారం జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎయిర్‌పోర్టులు, పోర్టులు అభివృద్ధి చేసి ధనవంతులకు బాగా ఉపయోగపడ్డానని గుర్తు చేశారు. మళ్లీ ముఖ్యమంత్రి అయితే కోస్తాలో ఆక్వా కల్చర్, రాయలసీమలో హార్టికల్చర్‌ను అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఆక్వా జోన్ పరిమితి లేకుండా ఆక్వా సాగుదారులందరికీ రూ.1.50కే కరెంట్ ఇస్తానని తెలిపారు. రాష్ట్రంలో రైస్ మిల్లర్లు దళారులుగా మారారని ధ్వజమెత్తారు. రైతాంగం తీవ్రంగా నష్టపోతుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. పరిహారం ఇవ్వాలని అడిగినా అసమర్థ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. సంక్షోభంలో ఉన్న రైతులను పరామర్శించే తీరిక సీఎంకు లేదా అని ప్రశ్నించారు. ప్రతి ఎకరాకూ రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వస్తుందని చెబుతుంటే తన మీద విమర్శలు, ప్రతిదాడి చేసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి తాను 72 గంటల సమయం ఇచ్చినా రైతుల సమస్య పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం కల్లాల్లోని ధాన్యం కొనే వరకు రైతుల తరఫున పోరాడతానని చెప్పారు. హైదరాబాద్‌ను తానే నిర్మించానని వెల్లడించారు.

బాబు కోసమే పవన్ రాజకీయం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని

చిలకలపూడి (మచిలీపట్నం): గోదావరి జిల్లాల్లో పవన్ కళ్యాణ్ పర్యటించింది రైతుల కోసమా.. రాజకీయం కోసమా అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని నిలదీశారు. ఆ పర్యటనలో పవన్ రైతుల గురించి మాట్లాడింది తక్కువ.. రాజకీయం గురించి మాట్లాడింది ఎక్కువ అని మండిపడ్డారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్‌లో పేర్ని నాని శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను పరామర్శించేందుకు వచ్చిన పవన్ రైతుల గురించి కాకుండా రాజకీయం కోసమే ఎక్కువ వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. పార్టీ స్థాపించిన నాటి నుంచే జనసేన పార్టీకి బలం లేదన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను వైఎస్ జగన్‌కు వెళ్లకుండా చేయడానికి అన్ని స్థానాల్లో జనసేన పోటీ చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా చంద్రబాబుతో లాలూచీ పడి ఆయన కోసమే పవన్ రాజకీయాలు చేస్తున్నారని నిప్పులు చెరిగారు. టెంట్‌హౌస్‌లో ఏ విధంగా సామాన్లు అద్దెకిస్తారో ఆ విధంగా పవన్ తన పార్టీని టెంట్‌హౌస్ పార్టీగా నడుపుతున్నారన్నారు. మంచి భవిష్యత్తు ఉన్నవారు వారి ఉద్యోగాలను సైతం వదిలిపెట్టి మరీ జనసేన పార్టీ కోసం పనిచేస్తున్నారని పేర్ని నాని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ ముఖ్యమంత్రి కావాలనే ఆశతో వారు పార్టీలో ఉంటున్నారని.. ఆయన మాత్రం చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగస్తులు పవన్ మాయలో పడొద్దన్నారు. వారి జీవితాలను బాగు చేసుకుని.. తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజలు ఎప్పటికైనా ఆదరిస్తారన్నారు. అయితే పవన్ రూ.100 కోట్లు వచ్చే వ్యాపారాన్ని వదులుకుని ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్నానని చెప్పి మళ్లీ సినిమాలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. ఆర్భాటంగా వారాహి వాహనాన్ని తీసుకువచ్చి ప్రచారం చేస్తానని మాయమాటలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజల్లోకి వస్తానని పవన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

చంద్రబాబు శపథం నెరవేర్చడమే పవన్ లక్ష్యం

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: మళ్లీ సీఎంగానే అసెంబ్లీలోకి అడుగు పెడతానంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన శపథాన్ని నెరవేర్చడమే ధ్యేయమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చాటి చెప్పుకున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జనసేన కార్యకర్తలు, కాపులను చంద్రబాబుకు పవన్ తాకట్టు పెడుతున్నారని చెప్పారు. పవన్ జనసేనను ప్రారంభించింది ప్రజల కోసం కాదని, చంద్రబాబు కోసమేనన్నారు. 2014లో ఎక్కడా పోటీ చేయకుండా టీడీపీకి మద్దతిచ్చారని, 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా బాబును అధికారంలోకి తేవడం కోసం కేవలం 137 స్థానాల్లో పోటీచేశారని చెప్పారు. 2024 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూడటం ద్వారా బాబును సీఎంగా చేయడం కోసం పొత్తుల డ్రామా ఆడుతున్నారన్నారు. చంద్రబాబు కంటే మోసగాడు, తార్పుడుగాడు, పవన్‌కంటే కంటే అబద్ధాలకోరు, అమ్ముడు పోయేవారు దేశంలోనే ఎవరూ ఉండరన్నారు. సీఎం రేసులో లేనని గురువారం అన్న పవన్.. ఫలితాలు వెల్లడయ్యాక సీఎం ఎవరనేది తేలుతుందని శుక్రవారం అనడం అందుకు నిదర్శనమని తెలిపారు. ఆయన అన్నలాగా పార్టీ నడిపే శక్తి లేకపోతే జనసేనను టీడీపీలో విలీనం చెయ్యాలని అన్నారు. టీడీపీ కాపుల వ్యతిరేక పార్టీ అని చెప్పారు. వంగవీటి రంగాను హత్య చేసి, వేలాది మంది కాపులపై కేసులు బనాయించింది టీడీపీ సర్కారేనని చెప్పారు. కాపు రిజర్వేషన్ల ఉద్యమంలో ముద్రగడతో సహా వేలాది కాపు యువకులపై అక్రమ కేసులు పెట్టిందీ టీడీపీ సర్కారేనన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆ కేసులను ఎత్తేసి.. కాపు నేస్తం, కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ రాజకీయ ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా పవన్ వెంట ఉన్న జన సైనికులు, వీర మహిళలు, కాపులు ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు. కాపులకు అండగా ఉన్న సీఎం వైఎస్ జగన్ వెంట నడుస్తారా లేక అణిచివేసిన చంద్రబాబు వెంట నడుస్తారా అన్నది కాపులు ఆలోచించుకోవాలని చెప్పారు. టీడీపీ, జనసేన కలిసొచ్చినా ప్రజల ఆశీస్సులు, ఆదరణ ఉన్న సీఎం వైఎస్ జగన్ చేతిలో చిత్తుగా ఓడిపోవడం ఖాయమని స్పష్టం చేశారు.

పోలవరం కాంట్రాక్టర్‌గా వియ్యంకుడిని తప్పించారనే రామోజీ బాధ

పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్సులో రామోజీరావు కుమారుడి వియ్యంకుడికి చెందిన నవయుగకు చంద్రబాబు నామినేషన్‌పై కట్టబెట్టిన రూ. 2,917.78 కోట్ల విలువైన పనులను సీఎం వైఎస్ జగన్ రద్దు చేశారనే అక్కసుతోనే 'ఈనాడు'లో తప్పుడు కథనాలు అచ్చేస్తున్నారని మంత్రి అంబటి మండిపడ్డారు. కేంద్రమే కట్టాల్సిన పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కక్కుర్తితో నాటి సీఎం చంద్రబాబు రాష్ట్రానికి ఇవ్వాలని కోరారని చెప్పారు. కేంద్రం షరతులకు తలొగ్గిన చంద్రబాబు ప్రాజెక్టును సంక్షోభంలోకి నెట్టారని చెప్పారు.

బాబు మాటలకు రైతులు నవ్వుకుంటున్నారు

- అన్నదాతలకు మేలుచేస్తున్నది జగనన్నే
- రాష్ట్ర మంత్రి రజిని



చిలకలూరిపేట: అన్నదాతల కోసం తన పాలనాకాలంలో ఏమీచేయని చంద్రబాబు ఇప్పుడు అవగాహన లేకుండా మాట్లాడుతుండటాన్ని చూసి ఆ రైతన్నలే నవ్వుకుంటున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. తాను వచ్చాను కాబట్టే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందంటూ చంద్రబాబు మాట్లాడటం ఆయన కుటిలనీతికి నిదర్శనమని విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో తమ ప్రభుత్వం ముందునుంచి ఎంతో చొరవతో ఉందన్నారు. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది రైతులు ధాన్యానికి మంచి ధరను పొందారని చెప్పారు. రైతుల కోసం జగనన్న ప్రభుత్వం తొలిరోజు నుంచి ఎంతో చేస్తోందని చెప్పారు. ఏ ఒక్క రైతునూ నష్టపోనివ్వని ప్రభుత్వం తమదని తెలిపారు. చంద్రబాబు ఏనాడైనా రైతుల గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. సీఏ అసోసియేషన్ నుంచి బహిష్కరణకు గురైన ఓ ప్రభుద్ధుడితో ఆర్థిక అంశాలను పచ్చమీడియా మాట్లాడించటం సిగ్గుచేటన్నారు. రాజకీయ స్వార్థంతోనే చంద్రబాబు అనుకూల మీడియా ఈ పనిచేస్తోందని దుయ్యబట్టారు. పచ్చమీడియాలో వచ్చే కథనాలన్నీ చంద్రబాబు అంతర్గత భావనలేనని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు వద్దని, వాటివల్ల అప్పులు చేయాల్సి వస్తోందని పచ్చమీడియాలో రాస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడికి ప్రజలు ఆనందంగా ఉండటం ఇష్టం లేదని చెప్పారు. బడుగు, బలహీనవర్గాల వారి ఆనందాన్ని ఆయన చూడలేక పోతున్నారని విమర్శించా రు. గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, రైతుభరోసా కేంద్రాలు.. ఇవన్నీ జగనన్న తీసుకొచ్చిన గొప్ప సంస్కరణలని చెప్పారు. ప్రజలు ఎప్పటికీ జగనన్నకు అండగా ఉంటారని ఆమె పేర్కొన్నారు.

పవన్‌కళ్యాణ్.. చంద్రబాబుకు పాలేరు

మంత్రి జోగి రమేష్ ఫైర్



సాక్షి, అమరావతి: పవన్‌కళ్యాణ్ తాను చంద్రబాబుకు పాలేరునని ఒప్పుకొన్నారని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఎద్దేవా చేశారు. పవన్ని నమ్ముకుంటే నట్టేట ముంచారని కార్యకర్తలు బాధపడుతున్నారని చెప్పారు. విజయవాడలో శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా జెండాలు మోసిన జనసైనికులు ఆత్మరక్షణలో పడ్డారని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. 'పవన్ ప్యాకేజీ స్టార్ తప్ప పాలకుడు కాదని మేం చెబుతూనే ఉన్నాం. పవన్ పూజకు పనికిరాని పువ్వులాంటి వ్యక్తి. జనసైనికులు కూడా పాలేరులుగా మారకుండా నిర్ణయం తీసుకోవాలి. పార్టీ పెట్టి పదేళ్లయినా పవన్ ఏమీ సాధించలేకపోయారు. చంద్రబాబు కుతంత్రాలు ఇలాగే ఉంటాయి. ప్రజా మద్దతుంటే వీళ్లెందుకు పొత్తులు కోసం పాకులాడుతారు. ధైర్యంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని అని చెప్పలేని చవట దద్దమ్మ పవన్ తన అభిమానులను హిప్నటైజ్ చేసి.. చంద్రబాబుకు బానిసలుగా చేయాలని చూస్తున్నారు. పవన్ నటుడా.. రాజకీయ నాయకుడా.. హిప్నటిస్టా?'.

జనసేన, టీడీపీ, బీజేపీ పొత్తు ఖాయం

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని పార్టీలు కలిసి ప్రకటిస్తాం. ప్రస్తుతం జనసేన పార్టీకి కృష్ణాజిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు సరాసరిన 25 శాతం ఓట్ల బలం ఉంది. అయితే, ఇది ఎన్నికల్లో పోటీచేయడానికి పనికొచ్చే బలమేగానీ, జనసేన సొంతంగా ప్రభుత్వాన్ని స్థాపించే బలం కాదు. మళ్లీ ఇంకోసారి ఓడిపోవడానికి నేను బలికావడానికి సిద్ధంగాలేను. మీకు నచ్చినా నచ్చకపోయినా త్రిముఖ పోటీలో బలికావడానికి జనసేన సిద్ధంగాలేదు. కచ్చితంగా పొత్తులే ఉంటాయి. పొత్తులో ముఖ్యమంత్రి ఎవరు కావాలన్నది ఎన్నికలు అయిపోయాక మాట్లాడదాం. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని దించడమే జనసేన ప్రథమ ఆలోచన. ఇంకోసారి ఈ వ్యక్తి సీఎం అయితే, ఆంధ్రప్రదేశ్ జీవితంలో కోలుకోదు. అలాగే, టీడీపీ నేతలను సీఎంను చేయడానికి జనసేన లేదు. అది మనం బలంగా చెప్పాలి. ముఖ్యమంత్రి చేస్తారని బేషజాలు పెట్టుకోవద్దని ఇప్పుడు మాట్లాడే కొంతమంది కాపు నాయకులకు చెబుతున్నా. చంద్రబాబు మోసం చేయడానికి నేనేమన్నా చిన్నపిల్లోడినా..?

వారు రూపాయి అయినా పెట్టుబడి పెట్టారా?

పవన్‌కళ్యాణ్‌కే సీఎం పదవి ఉండాలని సలహాలిచ్చే నేతలు పార్టీ కోసం రూపాయి ఏమన్నా పెట్టుబడి పెట్టారా? మన పార్టీలోనే కొంతమంది పెద్దలు ఉంటారు.. నాకు సీఎం పదవి గురించి మాట్లాడుతున్నారు. నేను భీమవరంలో పోటీచేస్తే ఈ మాట్లాడే వాళ్లు ఒక్కరు తిరగలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన 40 ఎమ్మెల్యేల స్థానాల్లో గెలిస్తే ముఖ్యమంత్రి పదవికి అవకాశం ఉండేదేమో. రాష్ట్రంలో మార్పు రావాల్సింది నాయకుల్లో కాదు, ప్రజల్లోనే.


నేనెప్పుడూ అలా ఆశించలేదు..

ఒక వ్యక్తికి పాపులారిటీ ఉన్నంత మాత్రాన రాత్రికి రాత్రి అధికారం వచ్చేయడం కలే. అది ఎన్టీఆర్ విషయంలో జరిగిందేమోగానీ, తనకు కూడా జరుగుతుందని ఎప్పుడూ ఆశించలేదు. నేనెక్కడికి వెళ్లినా సీఎం సీఎం అని అరుస్తారు. నినాదాలతో సీఎం కాలేం. ఓట్లు వేస్తేనే సీఎం అవుతాం. ఇంత జనాదరణ ఉండి కూడా పట్టుమని పది సీట్లు కూడా మనం నిలబెట్టుకోలేకపోతే ఏం చేయగలం? ఆలూలేదు చూలులేదు, కొడుకు పేరు సోమలింగం అన్నట్లు.. ఓట్లే లేవు, ఎమ్మెల్యేలు ఇవ్వలేదు, ముఖ్యమంత్రి పదవి అంటే ఎందుకు ఇస్తారు? రాజకీయాల్లో వ్యూహం చాలా కీలకం. వాటిని పార్టీలోని బాధ్యతగల వ్యక్తులకు వదిలేయండి. నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీకి వెన్నెముక లాంటి వారు. ఎవరైనా ఆయన్ను టార్గెట్ చేస్తే క్రమశిక్షణా చర్యలుంటాయి. సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడం. నాకు అండగా ఉండే వ్యక్తులను తూలనాడే వారిని వైఎస్సార్‌సీపీ కోవర్టులని నేను అంటా.

బాబును మోయలేం.. బయటకు పోతాం

- పవన్ పొత్తు వ్యాఖ్యలపై గోదావరి జిల్లాల్లో జనసేన కేడర్ గరంగరం
- కాపు నేతలు, పవన్ అభిమానుల నిరసన
- ఎవరినో సీఎంను చేయడానికి మేము సిద్ధంగా లేమని స్పష్టీకరణ
- కాపులను అణగదొక్కిన బాబు పల్లకీ మోయమంటావా?
- కాపులపై బాబు దమనకాండ, అక్రమ కేసులను మర్చిపోయావా?
- సోషల్ మీడియాలో హోరెత్తుతున్న పవన్ వ్యతిరేక పోస్టులు
- ప్రత్యామ్నాయాలపై ముఖ్య నేతల ఆలోచన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేనాని పవన్‌కళ్యాణ్ పొత్తుల వాఖ్యలు గోదావరి జిల్లాల్లో ఆ పార్టీ శ్రేణుల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి. పవన్‌ని నమ్ముకొని పదేళ్లుగా పార్టీనే అంటిపెట్టుకుని ఉన్న ఆశావహులు మొదలు ద్వితీయ శ్రేణి నేతలు సైతం పవన్ తీరుతో రగిలిపోతున్నారు. ఇన్నేళ్లుగా వెంట ఉన్నది చంద్రబాబు పల్లకీ మోయడానికా అంటూ అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. రాజకీయ భవిష్యత్‌పై తాము పెట్టుకున్న ఆశలపై నీళ్ల చల్లేశారని మండిపడుతున్నారు. పవన్ పొత్తులు, సీఎంపై ఆశలు లేవు వంటి వ్యాఖ్యలపై ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని జనసేన నేతలు, కార్యకర్తలతోపాటు పవన్ సామాజికవర్గ యువత సామాజిక మాధ్యమాల్లో దుమ్మెత్తిపోస్తున్నారు. పదేళ్లుగా పార్టీని బలోపేతం చేయకుండా ఇంకా బలహీనంగానే ఉన్నామని చెప్పడం, వచ్చే ఎన్నికల్లో బీజేపీ, టీడీపీలతో కలిసే వెళదామనడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసి అన్ని రకాలుగా నష్టపోయిన నేతలు ఇప్పుడు పొత్తులు తప్పవని పవన్ చేసిన ప్రకటనతో ఒక్కసారిగా కుదేలైపోయారు. పార్టీలో కొనసాగడమా లేక ప్రత్యామ్నాయం ఆలోచించాలా అని జనసేన ముఖ్య నేతలు తర్జనభర్జన పడుతున్నారు.



గోదావరి జిల్లాల్లో సామాజికమాధ్యమాల్లో వైరల్ అవుతోన్న జనసేన అభిమానుల పోస్టింగ్‌లు



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న జనసేన అభిమానుల పోస్టింగ్‌లు

ఉన్నది ఉభయ గోదావరి జిల్లాల్లోనే

జనసేన పార్టీకి కొద్దోగొప్పో ఆదరణ ఉన్నది ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే. ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలే బాహాటంగా చెబుతుంటారు. పవన్ పొత్తులు తట్టుకోలేమంటూ ఈ జిల్లాల్లోని జనసేన అభిమానులు గురు, శుక్రవారాల్లో పెడుతున్న పోస్టింగ్‌లు ఆ పార్టీలో కాకపుట్టిస్తున్నాయి. చంద్రబాబుని నమ్మొద్దని వాటిలో నేరుగా కోరుతున్నారు. 'మనల్ని ఎవడ్రా ఆపేది.. మనల్ని ఎవడ్రా ఆపేది అంటుంటే ఏమో అనుకున్నాం. అన్నయ్యా, మమ్మల్ని నువ్వే ఆపేది అని అర్థమైంది', 'ఎవరినో సీఎంను చేయడానికి మేము సిద్ధంగా లేం. పది సంవత్సరాలుగా జనసేన జెండా మోస్తున్నాం. కొత్తగా మరో జెండా మోయడం మావల్ల కాదు' అంటూ పలు రకాలుగా జనసేన కార్యకర్తలు, పవన్ సామాజికవర్గ నేతలు, యువత నిప్పులు చెరుగుతున్నారు. ఆరేళ్ల కిందట కాపులపై చంద్రబాబు జరిపిన దమనకాండ మరిచిపోమ్మంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

చేగొండి సహా అనేకమంది మండిపాటు

గోదావరి జిల్లాల్లో ఆ సామాజికవర్గానికి చెందిన వృద్ధతరం నేత చేగొండి హరిరామజోగయ్య సామాజిక మాధ్యమాలలో ఇదే అంశాన్ని ప్రస్తావించడం గమనార్హం. 'పవన్‌కళ్యాణ్ కాపులకు నాయకుడిగా ఉంటాడని ఆశించాను. కానీ ఆయన మరొక్కసారి వేరే వారి పల్లకీ మోస్తాననడం సమంజసం కాదు. 'నా అనుభవం రీత్యా చెబుతున్నాను. మరొక్కసారి ఇతర పార్టీల జెండా, అజెండాలను మోసే స్థాయిలో కాపు సామాజికవర్గం లేదు. పవన్ సీఎం అవుతానంటేనే ఇంతకు ముందు సమర్థించాను' అని జోగయ్య ప్రతిస్పందించారు. ఆయనతోపాటు కాపు సామాజికవర్గంలో పలువురు ఇదే విధంగా వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయాలతో సంబంధం లేని పవన్ సినీ అభిమానులు సైతం పవన్ వ్యాఖ్యలపై మండిపడుతున్నారు.

ఈ దమనకాండ బాబు చేసిందే

బీసీ రిజర్వేషన్ల కోసం కాపు సామాజికవర్గం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమం గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున జరిగింది. ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, కుటుంబ సభ్యుల పైన, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆ సామాజికవర్గంపైన అధికారం ఉందనే ధీమాతో చంద్రబాబు కక్షకట్టి ఉక్కుపాదం మోపి ఉద్యమాన్ని అణగదొక్కేసిన విషయం, అక్రమంగా పెట్టిన కేసులు గుర్తులేదా అని పవన్‌ను ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు, పవన్ సామాజికవర్గాల మధ్య వైరం ఈనాటిది కాదు. కాపు ఉద్యమం సందర్భంగా కోనసీమ సహా పలు ప్రాంతాల్లో ఆ సామాజికవర్గీయులలో మహిళలపైన కూడా చంద్రబాబు అండ్ కో కేసులు పెట్టించి వేధించింది. అవన్నీ మరిచిపోయి ఇప్పుడు తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుంటామంటే ఎందుకు ఆయన వెంట నిలబడాలని ఆ సామాజికవర్గ నేతలు నిలదీస్తున్నారు.

ఇక మచిలీపట్నం పోర్టుకు పూర్వవైభవం

- అన్ని అనుమతులతో పోర్టు నిర్మాణ పనులకు ప్రభుత్వం శ్రీకారం
- మొత్తం రూ.11,464 కోట్ల వ్యయం.. 116 మిలియన్ టన్నుల సామర్థ్యం
- తొలి దశలో రూ.5,156 కోట్ల పెట్టుబడి.. నాలుగు బెర్తుల నిర్మాణం
- పోర్టు నిర్మాణ పనులకు ఈ నెల 22న సీఎం జగన్ శంకుస్థాపన
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మందికి ఉపాధి



సాక్షి, అమరావతి: మచిలీపట్నంవాసుల చిరకాల వాంఛ కార్యరూపం దాల్చుతోంది. సుమారు రూ.11,464 కోట్ల భారీ పెట్టుబడితో పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. మొత్తం 16 బెర్తులతో.. 115.97 మిలియన్ టన్నుల సామర్థ్యంతో దీన్ని నిర్మించనుంది. ఇందులో భాగంగా తొలి దశలో రూ.5,156 కోట్లతో నాలుగు బెర్తుల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 22న శంకుస్థాపన చేయనున్నారు. తొలి దశలో 35 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో పోర్టును నిర్మిస్తారు. ఇందుకు సంబంధించి రూ.3,668.83 కోట్ల విలువైన పనుల కాంట్రాక్టును రివర్స్ టెండరింగ్ విధానంలో మేఘా ఇంజనీరింగ్ లిమిటెడ్ దక్కించుకుంది. తొలి దశలో నిర్మించే నాలుగు బెర్తుల్లో రెండు సాధారణ బెర్తులు కాగా ఒకటి కోల్, మరొకటి మల్టీపర్పస్ బెర్తు. ఈ పోర్టు నిర్మాణం ద్వారా తెలంగాణతో పాటు మన రాష్ట్రంలోని కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు ప్రయోజనం పొందనున్నారు. ఎరువులు, బొగ్గు, వంట నూనెలు, కంటైనర్ల దిగుమతులకు ఈ పోర్టు అనువుగా ఉంటుందని అంచనా. అలాగే వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంట్, సిమెంట్ క్లింకర్, గ్రానైట్ బ్లాక్స్, ముడి ఇనుము ఎగుమతికి ప్రయోజనకరంగా ఉంటుందని అంచనా వేశారు. ఈ పోర్టు అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా 25 వేల మందికి ఉపాధి లభిస్తుంది.

దక్షిణాసియాకు ముఖద్వారంగా..

దేశ తూర్పుతీరంలో దక్షిణాసియా దేశాలకు అత్యంత దగ్గరగా మచిలీపట్నం పోర్టు ఉండటంతో పూర్వ కాలంలో మసూలీపటా ఓడరేవు పేరుతో ఇక్కడి నుంచి పర్షియన్ (గల్ఫ్) దేశాలకు ఎగుమతులు, దిగుమతులు జరిగేవి. మచిలీపట్నం ప్రాంతపు చేనేత, కలంకారీ, అద్దకం దుస్తులకు పర్షియా దేశాల్లో మంచి డిమాండ్ ఉండేది. దీంతో ఆంగ్లేయులతో పాటు, డచ్, పోర్చుగీసు వారు మచిలీపట్నంలో వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. 1970 వరకు కార్యకలాపాలు కొనసాగించిన బందరు పోర్టు కాలక్రమంలో కనుమరుగైపోయింది.

అన్ని అనుమతులతో ముందుకు..

స్థానిక ప్రజల చిరకాల కోరిక అయిన మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008, ఏప్రిల్ 23న శంకుస్థాపన చేశారు. అయితే వైఎస్ అకాల మరణానంతరం నిర్మాణ పనులు అటకెక్కాయి. 2014లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టు గురించి అసలు పట్టించుకోలేదు. 2019లో ఎన్నికలకు నెలన్నర ముందు పబ్లిసిటీ స్టంట్‌లో భాగంగా పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన అంటూ ఒక కొబ్బరికాయ కొట్టి మమ అనిపించారు. అయితే దీనికి భిన్నంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు సమకూర్చడం దగ్గర నుంచి అన్ని అనుమతులు వచ్చాకే నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే 2020 ఫిబ్రవరి 4న మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారు. రూ.5,156 కోట్లతో పోర్టు నిర్మాణానికి పరిపాలన అనుమతులను మంజూరు చేయడమే కాకుండా నిధులను కూడా సమకూర్చారు. ఆ తర్వాత రూ.3,668.83 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించడానికి టెండరు దక్కించుకున్న మేఘా ఇంజనీరింగ్ లిమిటెడ్‌తో ఈ ఏడాది ఫిబ్రవరి 26న ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే పోర్టు నిర్మాణానికి అవసరమైన కీలకమైన పర్యావరణ అనుమతులు ఫిబ్రవరి 28న వచ్చాయి. పోర్టును జాతీయరహదారితో అనుసంధానిస్తూ 6.5 కి.మీ నాలుగు లైన్ల రహదారి, ఏడు కి.మీ రైల్వే లైన్ నిర్మాణాలకు కూడా అనుమతులు సాధించారు.

తీర ప్రాంతంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో 974 కి.మీ. సుదీర్ఘ తీరప్రాంతాన్ని వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామికంగా, వాణిజ్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నది సీఎం వైఎస్ జగన్ దృఢసంకల్పం. ఇందులో భాగంగా ఏపీ మారిటైమ్ బోర్డును ఏర్పాటు చేయడమే కాకుండా ఏకకాలంలో నాలుగు పోర్టుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు నాన్ మేజర్ పోర్టుల వార్షిక సామర్థ్యం 320 మిలియన్ టన్నులుగా ఉంది. 2022-23లో 175 మిలియన్ టన్నుల ఎగుమతులు, దిగుమతులు జరిగాయి. 2025-26 నాటికి ఈ మొత్తానికి అదనంగా మరో 110 మిలియన్ టన్నులు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా రూ.16 వేల కోట్లతో రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం పోర్టులతో పాటు పీపీపీ విధానంలో కాకినాడ వద్ద గేట్‌వే పోర్టు నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ నాలుగు పోర్టుల నిర్మాణం ద్వారా రాష్ట్రంలో అదనంగా 75 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

– ప్రవీణ్ కుమార్, సీఈవో, ఏపీ మారిటైమ్ బోర్డు, వీసీ అండ్ ఎండీ ఏపీఐఐసీ

'మైనార్టీ గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న మైనార్టీ కేటగిరి ఖాళీలతోపాటు మూడు మైనార్టీ గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులైన మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలసంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా లేదంటే ఆయా కాలేజీలు, పాఠశాలల్లో ఉచితంగా దరఖాస్తు పొంది అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జతచేసి ప్రవేశం కోరుకునే విద్యాసంస్థ ప్రధానాచార్యులకు ఇవ్వాలని సూచించారు. ఖాళీలు, అర్హతలు, ఇతర మార్గదర్శకాలను వెబ్‌పోర్టల్ ద్వారా లేదా ఆయా విద్యాసంస్థల నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

జూన్ 13 కల్లా అమ్మఒడి అర్హుల జాబితా

సచివాలయాలశాఖ డైరెక్టర్ లక్ష్మీశ

సాక్షి, అమరావతి: జగనన్న అమ్మఒడి కార్యక్రమానికి ఈ ఏడాది అర్హుల జాబితాలు జూన్ 13 కల్లా సిద్ధం చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ చెప్పారు. ఆయన శుక్రవారం రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అమ్మఒడి అర్హుల గుర్తింపులో ఈ నెల 25కల్లా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేయాలని చెప్పారు. వైఎస్సార్ బీమా 2023-24కు గాను లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

నిన్‌హైడ్రిన్ పరీక్షకు అనుమతించండి

- వివేకా లేఖపై ప్రత్యేక న్యాయస్థానానికి సీబీఐ విజ్ఞప్తి
- జూన్ 2న విచారణ జరపనున్న కోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకా హత్యకేసు దర్యాప్తులో లభించిన ఆయన రాసిన లేఖను నిన్‌హైడ్రిన్ పరీక్షకు పంపాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నిర్ణయించింది. ఈ పరీక్షలో లేఖపై ఉన్న వేలిముద్రలు స్పష్టంగా గుర్తించవచ్చని భావిస్తోంది. ఈ పరీక్ష చేస్తే కంటికి కనిపించని, సాధారణ పరీక్షల్లో బయటపడని వేలిముద్రలు కూడా గుర్తించొచ్చు. దీంతో ఈ పరీక్షకు అనుమతించాలని కోరుతూ ప్రత్యేక న్యాయస్థానంలో సీబీఐ తాజాగా పిటిషన్ దాఖలు చేసింది. అయితే, లేఖలో అక్షరాలు ఇంక్‌తో రాసినందున నిన్‌హైడ్రిన్ పరీక్ష కారణంగా అవి దెబ్బతినే అవకాశం ఉంది. లేఖలోని అక్షరాలు చెరిగిపోతే విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ లేఖ స్థానంలో కలర్ జిరాక్స్‌ను అనుమతించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌ను సీబీఐ కోర్టు విచారణకు తీసుకొని, నిందితులకు నోటీసులు జారీ చేసింది. విచారణను జూన్ 2కి వాయిదా వేసింది.

ఆస్తుల విభజనకు కమిటీని నియమించండి

- సుప్రీం కోర్టుకు ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి
- తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు నోటీసులు
- విచారణ జూలై చివరి వారానికి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజనకు విశ్రాంత న్యాయమూర్తితో కమిటీ వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేసింది. కేంద్రం అభిప్రాయం తెలుసుకున్న సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొంది. రూ.1.42 లక్షల కోట్ల విలువైన ఆస్తుల విభజనపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. గత విచారణ సందర్భంగా నోటీసులు ఇచ్చి ఐదు నెలలు గడిచినా తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించగలదా అని అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నటరాజన్‌ను ధర్మాసనం అడిగింది. కౌంటరు ఎందుకు దాఖలు చేయలేదని తెలంగాణ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. నాలుగు వారాలు గడువు ఇవ్వాలని తెలంగాణ న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. ఆస్తుల విభజన రాష్ట్ర విభజన చట్టంలోని అంశమని, రూ.1.42 లక్షల కోట్ల ఆస్తులను విభజించకపోవడం సరికాదని ఏపీ న్యాయవాది సింఘ్వి చెప్పారు. ఉద్యోగుల విభజనపై జస్టిస్ ధర్మాధికారి కమిటీ నియమించినట్లు ఈ వ్యవహారంపైనా విశ్రాంత న్యాయమూర్తితో కమిటీని నియమించాలని కోరారు. ఆ విధంగా చేయొచ్చా అని నటరాజన్‌ను ధర్మాసనం ప్రశ్నించగా.. చేసే అవకాశం ఉందని ఆయన సమాధానమిచ్చారు. వాదనల అనంతరం నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ జూలై చివరి వారానికి వాయిదా వేసింది.

ఉద్యోగులకు 204 రకాల ప్రొసీజర్స్‌లో
మెడికల్ రీయింబర్స్‌మెంట్

సాక్షి, అమరావతి: ఈహెచ్ఎస్‌కు అర్హత ఉన్న ఉద్యోగులకు 204 ప్రొసీజర్స్ (వ్యాధి రకాలు)లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో ఈ 204 ప్రొసీజర్స్‌ను రీయింబర్స్‌మెంట్ జాబితా నుంచి తొలగించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ పరిస్థితిని మారుస్తూ.. రూ.2 లక్షల పైబడిన 25 ప్రొసీజర్స్‌లో కూడా మెడికల్ రీయింబర్స్‌మెంట్ చేసుకునేలా అవకాశం కల్పించారు. మరోవైపు నాలుగు డెంటల్ ప్రొసీజర్ ధరలను పెంచారు. ఈహెచ్ఎస్ లబ్ధిదారులకు కన్సల్టేషన్, మెడికేషన్, డయాగ్నోస్టిక్స్, రెఫరల్ సేవల కోసం ఆయా ఏరియా ఆస్పత్రుల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మార్చి 14న ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ప్రతినిధుల కోరిక మేరకు ఈ ఉత్తర్వులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఉత్తర్వుల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ సీఈఓను ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నిందాస్తుతులను తుల్యంగా ఎంచేవాడు, మౌనంగా ఉండేవాడు, ఉన్నదానితో సంతృప్తి పడేవాడు స్థిరమైన బుద్ధి కల భక్తుడు నాకు ప్రియుడు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 13 మే 2023

కేజ్రీవాల్‌దే పైచేయి

ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి ఉండాల్సిన అధికారాలపై ఎనిమిదేళ్లుగా సాగిస్తున్న పోరులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎట్టకేలకు విజయం సాధించారు. మహారాష్ట్ర రాజకీయ సంక్షోభంలో అక్కడి గవర్నర్ వ్యవహారశైలిని తప్పుబడుతూ తీర్పునిచ్చిన గురువారం రోజే ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్‌కీ(ఎల్‌జీ), అక్కడి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వానికీ మధ్య సాగుతున్న వివాదంపై కూడా నిర్ణయాత్మక తీర్పు వెలువడింది. ఈ రెండు తీర్పులూ రెండు వేర్వేరు రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చినా... ప్రాతినిధ్య ప్రజాస్వామ్య ప్రాధాన్యతనూ, ఎన్నికైన ప్రభుత్వాల విషయంలో వ్యవహరించాల్సిన తీరుతెన్నులనూ ఆ తీర్పులు నిర్దేశించాయి. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వానికెదురైన సమస్య ప్రత్యేకమైనది. అధికారుల బదిలీకి కూడా ప్రభుత్వానికి అధికారం లేదన్నట్టు అక్కడి ఎల్‌జీ వీకే సక్సేనా ప్రవర్తించారు. ఆ వివాదం పైనే ప్రస్తుత తీర్పు వెలువడింది. పోలీసు వ్యవస్థ, శాంతిభద్రతలు, భూసంబంధ అంశాల్లో మినహా ఇతర అధికారాల విషయంలో ఎల్‌జీకి అజమాయిషీ ఉండదనీ, ఢిల్లీ ప్రభుత్వ కేబినెట్ సలహాలకు ఆయన లోబడి ఉండాల్సిందేననీ ఈ ఏకగ్రీవ తీర్పు స్పష్టం చేసింది. ఆ వెంటనే కేజ్రీవాల్ సర్వీసు వ్యవహారాల కార్యదర్శిని బదిలీ చేశారు. రాగల రోజుల్లో మరిన్ని బదిలీలు ఉంటాయని ఆయన సంకేతాలిచ్చారు. వాస్తవానికి 2018లో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన మెజారిటీ తీర్పు ఇలాంటి సమస్యలకు ముగింపు పలికిందని అందరూ భావించారు. కానీ ఆ తర్వాత ఆప్ ప్రభుత్వం కొంతమంది అధికారులకు ఇచ్చిన బదిలీ ఉత్తర్వుల అమలు సాధ్యపడదని సర్వీసు వ్యవహారాల కార్యదర్శి చెప్పటంతో సమస్య మొదటికొచ్చింది. దానిపై ఆప్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేయటం, సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులిద్దరూ భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేయటంతో రాజ్యాంగ ధర్మాసనం ముందుకు ఈ కేసు వెళ్లింది. ఈలోగా 2021లో కేంద్రం 1991నాటి ఢిల్లీ ప్రభుత్వ రాజధాని ప్రాంత చట్టానికి సవరణలు తీసుకురావటం ద్వారా పాలనాపరమైన నిర్ణయా లపై ఎల్‌జీ ఆధిపత్యాన్ని ప్రతిష్ఠించింది. 2018 నాటి సుప్రీం తీర్పును వమ్ము చేయటమే ఈ సవరణ ఆంతర్యమని ఎవరికైనా అర్థమవుతుంది. అయితే ఢిల్లీ కూడా ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల వంటి దేనన్న కేంద్రం వాదనతో 2018 లోనూ, ఇప్పుడూ కూడా సుప్రీంకోర్టు ఏకీభవించలేదు. 1991లో 69వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేరిన 239 ఏఏ అధికరణ ఇతర కేంద్ర పాలిత ప్రాంతాలకు భిన్నంగా ఢిల్లీ సర్కారుకు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిందని గుర్తుచేసింది. 2018 తీర్పులో ప్రస్తావించిన కేంద్ర పరిధిలోని మూడు అంశాల్లో సర్వీసు వ్యవహారాల గురించి ప్రత్యేకించి చెప్పకపోయినా అది కూడా అంతర్లీనంగా ఉన్నట్టేనని కేంద్రం వాదిస్తూ వస్తోంది. అయితే 239 ఏఏ అధికరణంలోని క్లాజు (3)(ఏ) ఢిల్లీ సర్కారుకు విస్తృతాధికారాలిస్తోందని తాజా తీర్పు స్పష్టం చేసింది. దేశ రాజధాని కావటం వల్ల ఢిల్లీ ప్రభుత్వానికి ఉండే అధికారాలు పరిమితమైనవే. పూర్తి ప్రతిపత్తి ఉన్న రాష్ట్రాల అధికారాలే కుంచించుకుపోతున్న వర్తమానంలో, పరిమితుల చట్రంలో ఉండే ఆప్ ప్రభుత్వం తనదైన విధానాలను అమలు చేయటం ఎంత కష్టమో ఊహించుకోవచ్చు.

ఢిల్లీ ప్రభుత్వానికి తగిన అధికారాలివ్వటంలో పార్టీలతో సంబంధం లేకుండా కేంద్రంలో ఉండే ప్రభుత్వాలు అలసత్వాన్నే ప్రదర్శిస్తూ వచ్చాయి. 1993లో ఢిల్లీలో అసెంబ్లీని పునరుద్ధరించిన నాటి నుంచీ ఈ డిమాండు వినిపిస్తూనే ఉంది. చిత్రమేమంటే కేంద్రంలో ఇతర ప్రభుత్వాలున్నప్పటి మాట అటుంచి వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డీఏ ఏలుబడిలోగానీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ఏలుబడిలోగానీ ఢిల్లీలో తమ పార్టీ సర్కార్లే నడుస్తున్నా ఏ నాయకత్వమూ ఢిల్లీ సర్కారుకు తగిన అధికారాలివ్వటానికి ముందుకు రాలేదు. ఢిల్లీలో బీజేపీ నేతలు మదన్‌లాల్ ఖురానా, సాహిబ్ సింగ్ వర్మ, సుష్మా స్వరాజ్‌లు ముఖ్యమంత్రులుగా పనిచేశారు.

కాంగ్రెస్‌కు చెందిన షీలా దీక్షిత్ దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నా తమను నామమాత్రావశిష్టం చేయటమేమిటన్నదే వీరందరి ప్రశ్న. ప్రజల ద్వారా ఎన్ని కైన ఢిల్లీ దేశ రాజధాని ప్రాంత(ఎన్‌సీటీడీ) ప్రభుత్వాన్ని ప్రజలకు జవాబుదారీగా చేయాలని, అందుకోసం దానికి తగిన అధికారాలను కట్టబెట్టాలని దేశ కార్యనిర్వాహక వ్యవస్థ భావించలేదంటే... ఆ విషయంలో అయిదేళ్ల వ్యవధిలో రెండుసార్లు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోక తప్ప లేదంటే పరిస్థితెలా ఉందో అర్థమవుతుంది.

తాజా తీర్పు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వానిదే పైచేయి తప్ప ఎల్‌జీది కాదని తేల్చింది. మూడు అంశాలు మినహా ఇతర విషయాల్లో ఢిల్లీ సర్కారుకు వేరే రాష్ట్రాలతో సమానంగా అధికారాలుంటాయని ఈ తీర్పు స్పష్టం చేసింది గనుక రెండు పక్షాలూ అనవసర వివాదాలకు స్వస్తి పలకాలి. కేజ్రీ వాల్ స్థానంలో ఒక రాజకీయ నేత సీఎంగా ఉంటే ఇంత పట్టుదలగా పోరాడే వారు కాదేమో! ఆ సంగతలావుంచి ఆప్ సర్కారు చిన్నచూపు చూస్తున్నదని అక్కడ పనిచేసే ఐఏఎస్‌లు ఆరోపిస్తుంటారు. ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు తమపై దౌర్జన్యం చేశారంటూ 2018లో సమ్మెకు కూడా దిగారు. రోజువారీ వ్యవహారాల్లో పట్టువిడుపులుండాలనీ, అధికారులతో సామరస్యంగా పోవాలనీ కేజ్రీవాల్ గుర్తించటం అవసరం. రాజకీయ నాయకత్వానికీ, పాలనా వ్యవస్థకూ మధ్య సామరస్యత ఉన్నప్పుడే ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించటం సాధ్యపడుతుందని ఆయన గ్రహించాలి. ఇకపై ఎల్‌జీ కూడా తన పరిధులకు లోబడి వ్యవహరించటం అవసరమని తెలుసుకోవాలి.

‘వరం’ పోయిందని కడుపు మంట

దోచుకో.. పంచుకో.. తినుకో పద్ధతిలో ప్రజాధనాన్ని దోచేసిన చంద్రబాబు, రామోజీ, నవయుగ

ముఖ్యమంత్రి కాగానే ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేసిన వైఎస్ జగన్

- ప్రధాన డ్యామ్ పనులకు సమాంతరంగా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసంపై దృష్టి
- పోలవరం ప్రాజెక్టు ముందస్తు ఫలాలను రైతులకు అందించే దిశగా అడుగులు
- ప్రాజెక్టును కమీషన్ల కోసం బాబు ఏటీఎంగా మార్చుకున్నారన్న ప్రధాని మోదీ
- ప్రధాన డ్యామ్‌లో రూ.2,917.78 కోట్ల విలువైన పనులను రామోజీ వియ్యంకుడికి నామినేషన్‌పై కట్టబెట్టిన చంద్రబాబు
- సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే నిపుణుల కమిటీతో పోలవరం అక్రమాలపై విచారణ.. నవయుగకు పనులు రద్దు
- వాటికి 2012లో ప్రధాన డ్యామ్ పనులకు నిర్వహించిన టెండర్ నిబంధనలతోనే రివర్స్ టెండరింగ్ నిర్వహించిన ప్రభుత్వం
- రూ.1554 కోట్లకే పనులు చేయడానికి ముందుకొచ్చిన మేఘా
- రివర్స్ టెండరింగ్‌లో రూ.223 కోట్లు ఆదా..
- రామోజీ, నవయుగ, చంద్రబాబు దోపిడీ బట్టబయలు
- ఈ కడుపుమంటతోనే ప్రభుత్వంపై పదే పదే రామోజీ దుష్ప్రచారం
- బాబు సర్కార్ తప్పిదం వల్లే పోలవరంలో విధ్వంసమని స్పష్టం చేసిన డీడీఆర్పీ
- లేదంటే 2021 నాటికే పోలవరం పూర్తి



ట్రాన్స్‌ట్రాయ్ నుంచి రూ.2,917.78 కోట్ల విలువైన పనులను 60–సీ కింద తప్పించి నవయుగకు నామినేషన్‌పై కట్టబెడితే పనుల ప్రగతి కుంటుపడుతుందని 2018 ఫిబ్రవరి నుంచి 2019 జనవరి వరకూ పలుమార్లు పీపీఏ హెచ్చరించింది. పీపీఏ సూచనలను తుంగలో తొక్కి చంద్రబాబు పనులు నవయుగకు అప్పగించేశారు. ఇది తప్పుగా అన్పించలేదా రామోజీ? ఎందుకంటే.. నవయుగ మీ కుమారుడి వియ్యంకుడికి చెందినదనేగా!

కమీషన్ల కోసం పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఆక్షేపించారు. ఆ అవినీతిని ప్రక్షాళన చేయడం కోసం నవయుగపై వేటు వేసి మిగిలిన రూ.1771.74 కోట్ల విలువైన పనులకు పీపీఏ చేసిన సూచనలకు కట్టుబడే రివర్స్ టెండరింగ్‌ను సీఎం వైఎస్ జగన్ నిర్వహించారు. రివర్స్ టెండరింగ్‌లో రూ.1,548 కోట్లకే పనులు చేయడానికి మేఘా ముందుకొచ్చింది. రూ.223 కోట్లను ఖజానాకు ఆదా చేయడం ద్వారా పోలవరంలో వియ్యంకుడు, చంద్రబాబులతో కలిసి మీరు చేసిన దోపిడీని సీఎం వైఎస్ జగన్ బట్టబయలు చేశారనేగా మీ కడుపుమంట రామోజీ?

మీరు చెప్పిన దాంట్లో ఒకటి మాత్రం నిజం రామోజీ.. పాలకులకు దీర్ఘదృష్టి, సరైన వ్యూహం, అంకితభావం లేకపోతే ప్రధాన ప్రాజెక్టును సుడిగుండంలోకి ఎలా నెట్టేయవచ్చో 2014 జూన్ 8 నుంచి 2019 మే 29 వరకు చంద్రబాబు నిరూపించారు. ప్రాజెక్టుల నిర్మాణంపై అవగాహనైనా ఉండాలి లేదా ఇంజనీరింగ్ నిపుణులు చెబితే వినాలి. ఆ రెండూ లేకుంటే ఎలాంటి సంక్షోభాలు తలెత్తుతాయో చెప్పడానికి పోలవరంలో చంద్రబాబు పాల్పడిన పాపాలే నిదర్శనం.

అన్నదీయుడు చంద్రబాబు పోలవరం ప్రాజెక్టులో చేసిన తప్పులను తన్నదీయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరిదిద్దుతూ ప్రణాళికాబద్ధంగా శరవేగంగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారనే కడుపుమంటతో.. కాంట్రాక్టర్‌గా వియ్యంకుడికి చెందిన నవయుగపై వేటు వేశారనే అక్కసుతో.. తమ డీపీటీకి అడ్డుకట్ట పడిందనే నెపంతో వైఎస్ జగన్ ప్రభుత్వంపై ‘ఈనాడు’లో పదే పదే అవాస్తవాలను అచ్చేస్తూ రామోజీరావు దుష్ప్రచారం చేస్తున్నారు. దానికి మరో తార్కాణం ‘పోలవరం.. జగమంత వైఫల్యం’ శీర్షికతో శుక్రవారం ప్రచురించిన కథనంలో రామోజీరావు కడుపుమంట తప్ప.. వీసమెత్తు నిజం లేదు.

ఏది నిజం?

విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయాన్ని భరించి.. అన్ని అనుమతులు తెచ్చి తామే పూర్తి చేస్తామని కేంద్రం విభజన చట్టం సాక్షిగా హామీ ఇచ్చింది. ఆ మేరకు ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ)ని 2014 మే 28న ఏర్పాటు చేసి.. ఆ సంస్థతో ఒప్పందం చేసుకోవాలని నాటి టీడీపీ సర్కార్‌ను కోరుతూ వచ్చింది. ఒప్పందం చేసుకోకుండా కాలయాపన చేస్తూ.. పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగించాలని నాటి సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. ఈ క్రమంలో పార్లమెంట్ ద్వారా రాష్ట్రానికి హక్కుగా సంక్రమించిన ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు చంద్రబాబు సిద్ధమవడంతో.. 2016 సెప్టెంబరు 7న అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. ఈ క్రమంలోనే బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు రుణాలతో పోలవరానికి నిధులు ఇస్తామని.. 2018 డిసెంబర్‌లోగా పూర్తి చేయకపోతే ఇచ్చిన నిధులను రుణంగా పరిగణిస్తామని కేంద్రం పెట్టిన షరతులకు అంగీకరిస్తూ 2016 డిసెంబర్ 26న సీఎంగా చంద్రబాబు సంతకం చేశారు. ఆ తర్వాత 2016 డిసెంబర్ 30న పోలవరం పనులు ప్రారంభించారు. అంటే.. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన 2014 జూన్ 8 నుంచి 2016 డిసెంబర్ 30 వరకూ 31 నెలలపాటు పోలవరంలో తట్టెడు మట్టి కూడా చంద్రబాబు ఎత్తలేదు. పోలవరం హెడ్ వర్క్స్ నాటి ప్రధాన కాంట్రాక్టర్ రాయపాటికి చెందిన ట్రాన్స్‌ట్రాయ్‌ని అడ్డుపెట్టుకుని పోలవరం పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి, తేలికగా చేయగలిగి, అధికంగా లాభాలు వచ్చే పనులకే ప్రాధాన్యం ఇచ్చారు.

కమీషన్లు వచ్చే పనులకే చంద్రబాబు ప్రాధాన్యం

- గోదావరిపై ప్రధాన(ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మించడానికి వీలుగా.. వరద ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను తొలుత పూర్తి చేయాలి. ఈ పనులు పూర్తయ్యేలోగా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. కానీ.. చంద్రబాబు మాత్రం కమీషన్ల కోసం తేలికగా చేయగలిగి, అధికంగా లాభాలు వచ్చే మట్టి తవ్వకం, స్పిల్ ఛానల్‌లో కాంక్రీట్‌ను కుప్పలా పోయడం వంటి పనులకే ప్రాధాన్యం ఇచ్చారు.
- వరద మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండానే, నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండానే ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. స్పిల్ వే పునాది స్థాయిలోనే వదిలేశారు.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక.. వాటికి ఇరు వైపులా ఖాళీలు వదిలేసి, చేతులెత్తేశారు. 2019 అక్టోబర్ 1న గోదావరికి దాదాపు 14 లక్షల క్యూసెక్కుల వరద (సీడబ్ల్యూసీ గేజ్ ప్రకారం) ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల మీదుగా ప్రవహించడం వల్ల దాదాపు 13 మీటర్/సెకను వేగంతో వరద ఉధృతి పెరగడంతో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి, స్పిల్ వే మీదుగా వరద నీటిని మళ్లించి ఉంటే.. డయాఫ్రమ్ వాల్ దెబ్బతినే పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు.
- గోదావరి వరద ఉధృతి వల్ల ప్రధాన డ్యామ్ గ్యాప్–1 నిర్మాణ ప్రాంతంలో నదీ గర్భం +23 మీటర్ల నుంచి –12.00 మీ వరకు అంటే దాదాపు 35 మీటర్ల మందంతో కోతకు గురైంది. గ్యాప్–2లో + 8 మీటర్ల నుంచి –12 మీటర్ల వరకు అంటే దాదాపు 20 మీటర్ల మందంతో, దిగువ కాఫర్ డ్యాం లో 36.5 మీటర్ల మందంతో గోదావరి గర్భం కోతకు గురైంది.
- వరద మళ్లింపు మళ్లింపు పనులు అంటే.. అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్ పూర్తి చేయకపోవడం వల్ల గోదావరి వరద ఉధృతికి స్పిల్ ఛానల్ లోని కాంక్రీటు బ్లాకులు(దిమ్మెలు) కొట్టుకుపోయాయి. ఎగువ కాఫర్ డ్యామ్ ప్రభావం వల్ల వరద ఎగదన్నడంతో ముంపు గ్రామాలను గోదావరి వరద చుట్టుముట్టింది. నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- చంద్రబాబు పాల్పడిన పాపాల వల్లే పోలవరం ప్రాజెక్టు పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. లేదంటే 2021 నాటికే సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసేవారని అధికారవర్గాలే స్పష్టం చేస్తున్నాయి.

వియ్యంకుడికి నామినేషన్‌పై ఇస్తే ఒప్పా రామోజీ?


టీడీపీ సర్కార్ హయాంలో పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్(జలాశయం) ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్ నుంచి 2018 ఫిబ్రవరి 27న రూ.1244.36 కోట్లు.. 2018 మే 28న రూ.921.87 కోట్లు.. 2019 జనవరి 11న రూ.751.55 కోట్లు వెరసి రూ.2917.78 కోట్లు విలువైన పనులను 60–సీ కింద తొలగించి రామోజీరావు కుమారుడు కిరణ్ వియ్యంకుడికి చెందిన నవయుగ సంస్థకు... సాంకేతిక అర్హతలను పట్టించుకోకుండా.. బ్యారేజ్‌లు, స్పిల్ వేలు, రాతి మట్టికట్టలు నిర్మించిన అనుభవం ఉందా లేదా చూసుకోకుండా నోటిమాటపై నామినేషన్ పద్ధతిలో చంద్రబాబు కట్టబెట్టేశారు. దేశ చరిత్రలో ఇంత భారీ ఎత్తున నామినేషన్‌పై పనులు కట్టబెట్టిన దాఖలాలు లేవు. దోచుకో.. పంచుకో.. తినుకో(డీపీటీ)లో భాగంగానే మీ వియ్యంకుడికి రూ.2917.78 కోట్ల పనులను చంద్రబాబు అప్పగించారు. ఇదో పెద్ద స్కాం. కానీ.. రామోజీకి మాత్రం అది సక్రమంగా కన్పిస్తుంది. ఎందుకంటే.. పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకుని డీపీటీ పద్ధతిలో ప్రజాధనాన్ని దోచుకున్నారు కాబట్టి.

తప్పులు సరిదిద్దుతూ ప్రణాళికాయుతంగా ముందుకు

- బాబు అక్రమాల నిర్వాకం వల్ల అస్తవ్యస్తంగా మారిన పోలవరాన్ని గాడిలో పెడుతూ.. ఆనాటి తప్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ.. ప్రణాళికాయుతంగా పోలవరాన్ని పూర్తి చేయడానికి సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే యాక్షన్ ప్లాన్ రచించి, అమలు చేస్తున్నారు. కేంద్రం రీయింబర్స్ చేయడంలో జాప్యం చేస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ఖజానా నుంచే పోలవరానికి నిధులు ఖర్చు చేస్తున్నారు.
- కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ... ఆర్థిక ఇబ్బందులను అధిగమించి.. 48 గేట్లతోసహా స్పిల్ వేను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్‌ను, అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేసి.. 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున మళ్లించి చరిత్ర సృష్టించారు. 2021 జూన్ నాటికే పోలవరం జలాశయం రూపం సంతరించుకుంది.
- చంద్రబాబు పాపాల వల్ల దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చే విధానాన్ని ఖరారు చేయడంపై డీడీఆర్పీ, సీడబ్ల్యూసీతో 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. 2022 ఏప్రిల్‌లో విధానాన్ని ఖరారు చేయడంతో.. దాని ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికి దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయిన నేపథ్యంలో ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని పంపులతో తోడివేస్తూ.. గత మార్చి 4, 5న డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు కోతకు ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చివేస్తూ.. వైబ్రోకాంపాక్షన్ చేస్తూ.. జూన్ నాటికి యథాస్థితి తెచ్చేలా పనులను వేగవంతం చేశారు. ఆ తర్వాత డయాఫ్రమ్‌వాల్‌ను సరిదిద్ది.. గోదావరి వరదల్లోనూ గ్యాప్–1, గ్యాప్–2లలో ప్రధాన డ్యామ్‌లను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించి.. ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేసి, రైతులకు ముందస్తు ఫలాలు అందించే దిశగా చర్యలు చేపట్టారు.

సాంకేతిక అర్హతలు మార్చేశారని కలగన్నారా?

టీడీపీ సర్కార్ హయాంలో ఇంజనీరింగ్ పనుల్లో జరిగిన అవినీతిపై నిపుణుల కమిటీతో విచారణ చేయించి.. ఆ కమిటీ సిఫార్సు మేరకు రివర్స్ టెండరింగ్ నిర్వహించి, ప్రజాధనాన్ని ఆదా చేస్తామని ఎన్నికల్లో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీ అమల్లో భాగంగానే పోలవరం పనుల్లో చంద్రబాబు నామినేషన్‌పై నవయుగకు కట్టబెట్టిన పనులపై నిపుణుల కమిటీ విచారణ చేసింది. నవయుగ చేయగా మిగిలిన రూ.1,771.74 కోట్ల విలువైన పనులను రద్దు చేసి.. రివర్స్ టెండరింగ్ నిర్వహించాలని ప్రభుత్వానికి నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. దాంతో రూ.1,771.74 కోట్ల విలువైన పనులను రద్దు చేసి.. దాన్నే కాంట్రాక్టు విలువగా నిర్ణయించి.. 2012లో పోలవరం హెడ్ వర్క్స్‌కు జారీ చేసిన టెండర్ షెడ్యూళ్లలో నిబంధనలను యథాతథంగా పెట్టి.. టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. రివర్స్ టెండరింగ్‌లో 12.6 శాతం తక్కువ ధరకు అంటే రూ.1,548 కోట్లకే పనులు చేయడానికి ముందుకొచ్చింది. అంటే.. ఖజానాకు రూ.223.74 కోట్లు ఆదా అయ్యింది. తద్వారా రామోజీ, వియ్యంకుడితో కలిసి చంద్రబాబు డీపీటీ విధానంలో పోలవరంలో ప్రజాధనాన్ని దోచేశారన్నది సీఎం వైఎస్ జగన్ నిరూపించారు. వియ్యంకుడిని కాంట్రాక్టర్‌గా తప్పించారనే కక్షతో.. డీపీటీకి అడ్డుకట్ట పడిందే అక్కసుతో.. ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తున్నారనే కడుపుమంటతో పోలవరంపై అవాస్తవాలను వల్లె వేస్తూ ప్రభుత్వంపై రామోజీరావు దుష్ప్రచారం చేస్తున్నారు. గత పదేళ్లలో ఒక్కటైనా 35 మీటర్ల ఎత్తుతో రాతిమట్టికట్ట, స్పిల్ వే నిర్మించిన అనుభవం ఉండాలని.. ఆ పనులు చేసిన ప్రధాన కాంట్రాక్టర్‌గా లేదా జాయింట్ వెంచర్‌లో భాగస్వామిగా ఉండాలనే నిబంధనను రివర్స్ టెండరింగ్‌లో పెట్టారు. ఆ అర్హత ఉంది కాబట్టే.. ఆర్థిక బిడ్‌కు మేఘా అర్హత సాధించింది. కానీ.. ఆ నిబంధనను తొలగించి.. సాంకేతిక అర్హతలను మార్చేసి మేఘాకు పనులు కట్టబెట్టినట్లు కలగన్నావా రామోజీ?



సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకే..

పోలవరం ప్రాజెక్టు డిజైన్లను డీడీఆర్పీ(డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్) సమీక్షించి.. ప్రతిపాదించిన వాటిని సీడబ్ల్యూసీ(కేంద్ర జలసంఘం) ఆమోదిస్తూ వస్తోంది. స్పిల్ ఛానల్ చివర్లో 1354 మీటర్ల పొడవున కటాఫ్ డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించాలని.. ప్రధాన డ్యామ్ గ్యాప్–3లో రాతిమట్టికట్ట స్థానంలో 150.5 మీటర్ల పొడవుతో కాంక్రీట్ డ్యామ్ నిర్మించాలని.. స్పిల్ వే, స్పిల్ ఛానల్ కుడి వైపున కొండవాలు రక్షణ పనులు చేపట్టాలని సీడబ్ల్యూసీ ఆదేశించింది. ఆ పనులకు అయ్యే వ్యయం రూ.683 కోట్లు అవుతుందని అంచనా వేసింది. రూ.683 కోట్లతో చేపట్టిన పనులను నామినేషన్‌పై మేఘాకు ఇవ్వడానికి అధికారులు ప్రయత్నించారని కలగన్నావా రామోజీ? చంద్రబాబు కమీషన్ల కక్కుర్తితో భ్రష్టు పట్టించిన టెండర్ల వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ ప్రక్షాళన చేస్తూ రివర్స్ టెండరింగ్ విధానాన్ని అమల్లోకి తెస్తూ జారీ చేసిన జీవో 67 మార్గదర్శకాల మేరకు రూ.683 కోట్ల పనులకు జ్యుడిషియల్ ప్రివ్యూ ఆమోదించిన షెడ్యూళ్లతో అధికారులు టెండర్లు నిర్వహించారు. ఇందులో తప్పేముంది రామోజీ?

అవసరం లేకున్నా పట్టిసీమ, పురుషోత్తపట్నం

2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకుండా.. కుడి కాలువలోకి గోదావరి జలాలను ఎత్తిపోసేలా రూ.1,300 కోట్లతో పట్టిసీమ ఎత్తిపోతల చేపట్టారు. ఈ పనులను 21.99 శాతం అధిక ధరలకు కమీషన్ల కోసం (ఏడాదిలో పూర్తి చేస్తే 16.99 శాతం నజరానా) కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీనిపై పెట్టే వ్యయాన్ని పోలవరంపై పెడితే.. ఆ ప్రాజెక్టు కొలిక్కి వస్తుందని అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ పదే పదే సూచించారు. ఈ పథకంలో రూ.600 కోట్ల మేర అవినీతి జరిగిందని పోరాటం చేశారు. తీరా అదే నిజమని కాగ్ తేల్చింది. వరద వల్ల నాలుగేళ్లుగా పట్టిసీమ ఎత్తిపోతల పంప్‌లను కూడా ఆన్ చేయలేదు. అంటే.. పట్టిసీమ ఎత్తిపోతలపై చంద్రబాబు సర్కార్ చేసిన వ్యయం రూ.1900 కోట్ల వృథా. ఇదే తరహాలో గోదావరి ఎడమ గట్టుపై పోలవరం ఎడమ కాలువలోకి గోదావరి జలాలను ఎత్తిపోతలను చేపట్టారు. ఆ పథకానికి రూ.1900 కోట్లు ఖర్చు చేసి.. కమీషన్లు వసూలు చేసుకున్నారు. ఏలేరు ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లోకి భారీగా వరద వస్తుండటంతో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పంప్‌లను కూడా నాలుగేళ్లుగా ఆన్ చేయలేదు. దీన్ని బట్టి చూస్తే ఎత్తిపోతల పేరుతో రూ.3,800 కోట్లను చంద్రబాబు వృథా చేసినట్లు స్పష్టమవుతోంది. పోలవరం ప్రాజెక్టులో 35.51 మీటర్ల కంటే దిగువన ఉన్న నీటిని జనవరి నుంచి జూన్ మధ్య కుడి కాలువలోకి ఎత్తిపోయడం ద్వారా ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రబీ పంటలను రక్షించడం, వేసవిలో తాగునీటిని అందించడం కోసం సీఎం వైఎస్ జగన్ రూ.776 కోట్లతో ఎత్తిపోతలను చేపట్టారు. ఇది అత్యంత అవసరమని నిపుణులే స్పష్టం చేస్తున్నారు.

బాబు నిర్వాకం వల్లే రూ.2,020 కోట్ల భారం

గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్ అప్రోచ్ ఛానల్ పూర్తి చేయకుండా.. ప్రధాన డ్యామ్ పునాదిని టీడీపీ సర్కార్ పూర్తి చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను మొదలు పెట్టి.. నిర్వాసితులకు పునరావాసం కల్పించలేక.. మధ్యలోనే వదిలేసింది. పోలవరం వద్ద 2400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీగా వదిలిన 800 మీటర్ల ప్రదేశానికి కుంచించుకుపోయి ప్రవహించడం వల్ల వరద ఉధృతి మరింత పెరిగి.. ప్రధాన డ్యామ్ గ్యాప్–1, గ్యాప్–2 నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 600 మీటర్ల వరకూ కోతకు గురై భారీ అగాధం ఏర్పడింది. గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. అగాధాలను ఇసుకతో పూడ్చి.. వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెచ్చి.. దెబ్బతిన్న భాగాల్లో పాత డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేసే పనులను రూ.2,020.25 కోట్లతో చేపట్టాలని సీడబ్ల్యూసీ ఆదేశించింది. అంటే.. చంద్రబాబు సృష్టించిన విధ్వంసం వల్లే అదనంగా రూ.2,020.25 కోట్లతో పనులు చేపట్టాల్సి వచ్చిందన్నది స్పష్టమవుతోంది. ఈ పనులకు రూ.1615.75 కోట్ల వ్యయంతో నిర్వహించిన రివర్స్ టెండరింగ్‌లో మేఘా, చంద్రబాబుకు సన్నిహితుడైన సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ పోటీ పోటాగా తలపడ్డాయి. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ముగిసేటప్పటికి రూ.1,599.21 కోట్లకు (1.024 శాతం తక్కువ ధర) కోట్ చేసిన మేఘా సంస్థ పనులను దక్కించుకుంది.

ముమ్మాటికీ చంద్రబాబు అసమర్థతే

2019 జూన్ నాటికి ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఉంచిన గ్యాప్‌లను సకాలంలో పూడ్చక పోవటంవల్లే ప్రాజెక్టు ప్రధాన డ్యాం నిర్మించే చోట పెద్దపెద్ద అగాధాలు పడ్డాయని, నదీ గర్భం కోతకు గురైందని, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం చెప్పిందనేది రామోజీరావు మాట. అసలు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసింది 2019 మే 30న కదా? ఆ ఏడాది జూన్ 14 నుంచే ఊహించని రీతిలో వరదలతో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఆ వైఫల్యం అధికారంలో ఉండి ఐదేళ్లు ఆ పని చేయని చంద్రబాబుదా? లేక 15 రోజుల్లో చేయలేకపోయిన వైఎస్ జగన్‌దా రామోజీ?

శరవేగంగా దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి

రాష్ట్ర ప్రభుత్వ సంప్రదింపులతో.. దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రదేశంలో జియో మెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుకను నింపి.. జెట్ గ్రౌటింగ్.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ పూడ్చాలని.. ఆ తర్వాత 30.5 మీటర్ల ఎత్తుకు పూర్తి చేసేలా విధానాన్ని 2022 ఏప్రిల్‌లో సీడబ్ల్యూసీ ఖరారు చేసింది. పెద్దగా లభ్యంగాని 2.50 లక్షల జియో మెంబ్రేన్ బ్యాగ్‌లను గుజరాత్, అసోంల నుంచి సేకరించి, ఇసుకను నింపి కోతకు గురైన ప్రదేశంలో వేసి పూడ్చి.. జెట్ గ్రౌటింగ్ చేస్తూ, వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. ఆ తర్వాత దానిపై 20 మీటర్ల ఎత్తుతో గతేడాది జూలై 9 నాటికి దిగువ కాఫర్ డ్యామ్ పనులు చేశారు. కానీ.. అదే రోజున రాత్రి భారీ వరద రావడంతో స్పిల్ వే నుంచి దిగువకు విడుదలైన వరద దిగువ కాఫర్ డ్యామ్‌ను ముంచెత్తింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికి మేఘా పనులు పూర్తి చేసింది. ఇకపై ఎంత వరద వచ్చినా ఇబ్బంది లేకుండా ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 44 మీటర్లకు, దిగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 30.5 మీటర్లతో కాకుండా 31.5 మీటర్లతో పూర్తి చేశారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.అష్టమి ఉ.8.09 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ధనిష్ఠ ప.12.59 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం: రా.7.46 నుండి 9.11 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.32 నుండి7.14 వరకు, అమృతఘడియలు: తె.4.42 నుండి 6.10 వరకు (తెల్లవారితే ఆదివారం); రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.32, సూర్యాస్తమయం: 6.19.

సీఎంను దూషిస్తే తాటతీస్తాం

- చంద్రబాబుకు బెజవాడ న్యాయవాదుల హెచ్చరిక


చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కోర్టుల వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

విజయవాడ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దూషిస్తే తాటతీస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు హెచ్చరించారు. చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు విజయవాడలోని సివిల్‌కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. సీఎంను దూషిస్తే తాటతీస్తాం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన హయాంలో రాష్ట్రానికి ఏం మేలు చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో రాష్ట్ర ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కేవలం ప్రచార అర్భాటంతోనే చంద్రబాబు పదవీకాలం పూర్తయిందన్నారు. 2019లో సీఎం పీఠం అలంకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరుగుతోందన్నారు. ఈ పురోగతిని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించడాన్ని చంద్రబాబు, ఆయన అనుయాయులు తట్టుకోలేకపోతున్నారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు అందే సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజల అభిమానంతో సీఎం పదవి అలంకరించిన జగన్ పట్ల అనుచితంగా ప్రవర్తించడం సరికాదని హితవు పలికారు. భవిష్యత్తులో ఇదే తరహాలో విమర్శిస్తే సరైన రీతిలో బుద్ధిచెబుతామని వారు చంద్రబాబును హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు పిల్లా రవి, ఒగ్గు గవాస్కర్, కోటంరాజు వెంకటేష్, నిర్మలరాజేష్, అబ్దుల్ రజాక్, సత్యనారాయణరెడ్డి, బసవరెడ్డి, కోటంరాజు శర్మ, శీలం రంగారావు, బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వీధి నాటకాలకు తెరలేపడం దుర్మార్గం

- 957వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో పేదల పట్టాల పండుగ జరగనుండడంతో కులవాదులు వీధి నాటకాలకు తెరలేపడం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 957వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం

పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో ఇళ్ల ప్లాట్ల చదును కార్యక్రమాన్ని కులవాదులు అడ్డుకుంటూ పోలీసులపైకి దురుసుగా వెళ్లడం దుర్మార్గమని, భూములు ప్రభుత్వానికి ఇచ్చేసిన తరువాత వారికి ఏం హక్కు ఉంటుందని అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వం 54 వేల మంది పేదలకు ఈ ప్రాంతంలో ఆవాసం కల్పిస్తే దానిపై వీసమెత్తు మాట్లాడకుండా బాబు అండ్ కోకు అనుకూలంగా వామపక్షాలు కూనిరాగాలు తీస్తుండడం వెనుక మతలబు ఏంటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. సీఆర్డీయే చట్టంలో పొందుపరచిన విధంగానే నిబంధనలకు అనుగుణంగా త్వరలో ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ జరుగనుందని, తమ హక్కులను అడ్డుకుని ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్న కులవాదులకు బడితె పూజ తప్పదని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మకు సర్కారు సారె

- ప్రభుత్వం తరపున సమర్పించిన కలెక్టర్ వెంకటరమణారెడ్డి


తాతయ్యగుంట గంగమ్మకు సమర్పించేందుకు సారె తీసుకెళ్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

సాక్షి, తిరుపతి/తిరుపతి కల్చరల్: శ్రీవారి చెల్లెలు, తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున శుక్రవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి సారె సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ బాలాజీ, జిల్లా స్థాయి అధికారులు కలిసి నగరంలోని గాంధీ విగ్రహం నుంచి ఊరేగింపుగా తాతయ్యగుంటకు వెళ్లి గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఈవో దంపతులు సారె సమర్పించారు. ఇంకా తిరుపతి కార్పొరేషన్ తరపున మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, పోలీసుశాఖ తరపున ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్లు అమ్మవారికి సారె సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

వచ్చే ఏడాది నుంచి టీటీడీ ఆధ్వర్యంలో గంగమ్మ జాతర వారోత్సవాలు: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ విశిష్టతను దేశవ్యాప్తంగా తెలియజేయడం కోసం టీటీడీ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది నుంచి గంగమ్మ జాతర వారోత్సవాలు నిర్వహిస్తామని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. శుక్రవారం శ్వేత భవన్‌లో శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర విశిష్టతపై ఉద్యోగులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ గంగమ్మ జాతర వారోత్సవాలను మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తామన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర ప్రసంగించారు. శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

అత్యాచారం, హత్య కేసులో జీవిత ఖైదు

నందిగామ: ప్రేమ జంటలను టార్గెట్ చేసుకుని పలు హత్యలు, అత్యాచారాలు చేసిన వ్యక్తికి జీవిత ఖైదు పడింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని జిల్లా 16 అదనపు కోర్ట్ న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు శుక్రవారం జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈశ్వర ప్రగడ రంగారావు తెలిపిన సమాచారం ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా మైలవరం ప్రాంతానికి చెందిన పొట్లూరు అంకమ్మరాజు నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా ఉన్న ప్రేమ జంటలను టార్గెట్ చేసుకుని అత్యాచారాలు, హత్యలు చేసేవాడు. ఇదే క్రమంలో 2019 జనవరిలో వీరులపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యాచారం, హత్య చేశాడు. ఆ సమయంలో నందిగామ రూరల్ సీఐగా ఉన్న సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టుకు సమర్పించిన ఆధారాల ప్రకారం న్యాయమూర్తి మొత్తం 19 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువైన నేపథ్యంలో అంకమ్మరాజుకు జీవిత కాలపు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. అత్యాచార యత్నానికి సంబంధించిన కేసులో ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

సాగర్ స్పిల్‌వే, గేట్లను పరిశీలించిన ఈఎన్‌సీ


స్పిల్‌వేను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నాగేంద్ర

విజయపురిసౌత్: దశాబ్ద కాలం తరువాత 20 కోట్ల రూపాయలతో చేపడుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్ వే మరమ్మతులను తెలంగాణ రాష్ట్ర ఈఎన్‌సీ (ఇంజినీరింగ్ ఇన్ చీఫ్) నాగేంద్ర శుక్రవారం పరిశీలించారు. గత నెలలో మొదలైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 25 గేట్ల దిగువ భాగాన జరుగుతున్న మరమ్మతు పనుల వేగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సాగర్ డ్యాం ఇంజినీర్లను ఆదేశించారు. రెండు షిఫ్టులలో పదహారు గంటలు పనిచేస్తున్నప్పటికీ అనుకున్న మేరకు పనులు జరగడం లేదని, వరదలు వచ్చే సమయానికి పనులను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు కుడి కాలువకు గేట్లు అమర్చుతున్న పనులను పరిశీలించారు. ఇప్పటికే తొమ్మిదో గేటు అమర్చే పని పూర్తికాగా మిగిలిన ఎనిమిది గేట్లను బిగిస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ ధర్మానాయక్, ఈఈ మల్లికార్జున, డీఈలు సుదర్శన్, పరమేష్, శ్రీనివాసరావు, జేఈలు సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం(తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కేర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిరిసెట్టి సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. సిమెల్, గోగుండా కొండలపై పెద్ద ఎత్తున మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో ఎస్టీఎఫ్, సీఆర్పీఎఫ్, డీఆర్జీ బలగాలు గాలింపు చేపట్టాయి. గురువారం రాత్రి భద్రతా బలగాలు కూంబింగ్ ముగించుకుని వస్తుండగా కోడెల్‌పరా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాడి చేశారు. వెంటనే భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరపగా, మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే పారిపోయారు. అనంతరం ఘటనాస్థలంలో ఓ మావోయిస్టు మృతదేహంతో పాటు ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభ్యమయ్యాయని, మరో ఐదుగురు మావోయిస్టులకు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు.

సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలెదుర్కొంటున్న ఆప్ నేత మనీశ్ సిసోడియా కస్టడీని కోర్టు మరోసారి పొడిగించింది. జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో అధికారులు శుక్రవారం సిసోడియాను రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచారు. అధికారుల వినతి మేరకు సిసోడియా కస్టడీని జూన్ 2వ తేదీ వరకు పొడిగిస్తూ జడ్జి ఆదేశాలిచ్చారు. ఈ కేసులో ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయన్న కోర్టు మార్చి 31న సిసోడియా పెట్టుకున్న బెయిల్ దరఖాస్తును కొట్టివేసిన విషయం తెలిసిందే.

ఆ ఎమ్మెల్యేల అనర్హతపై తొందరగా తేల్చాలి: ఉద్ధవ్

ముంబై: శివసేనపై తిరుగుబాటు చేసిన 16 మంది ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ తొందరగా నిర్ణయం తీసుకోవాలని శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు. మహారాష్ట్ర రాజకీయ సంక్షోభంపై గురువారం సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శుక్రవారం ఉద్ధవ్ ఠాక్రే తాజా డిమాండ్ చేశారు. ఇదే అంశంపై స్పీకర్‌కు లేఖ రాస్తామని చెప్పారు. సుప్రీంకోర్టు కాలపరిమితి విధించినందున 16 మంది ఎమ్మెల్యేల రాజకీయ భవితవ్యాన్ని స్పీకర్‌సాధ్యమైనంత త్వరితంగా తేల్చాల్సి ఉందన్నారు. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు వ్యాఖ్యలను బట్టి అర్థం చేసుకోవచ్చని చెప్పారు. చేతనైతే ఎన్నికలు పెట్టి ప్రజల తీర్పును కోరేందుకు సిద్ధం కావాలంటూ ఉద్ధవ్ బీజేపీకి కూడా సవాల్ విసిరారు.

ముమ్ముందు వైద్యమంతా.. ఏఐమయమే!



మనిషి మెదడు, కృత్రిమ మేధ రెండింట్లో ఏది గొప్ప అన్న చర్చ ఇప్పటిది కాదు. ఏఐ చాట్‌బాట్ల రాకతో ఇది మరింత ఊపందుకుంది. ఏఐ వల్ల ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావనేది ఒక వాదన. దీనివల ఉద్యోగావకాశాలు తగ్గిపోవడమే గాక తప్పుడు సమాచారం మొదలుకుని ప్రాణహాని దాకా ఎన్నో సమస్యలు తలెత్తవచ్చనే వాదన మరొకటి. వెనకాముందూ చూసుకోని పక్షంలో అంతిమంగా కృత్రిమ మేధ మానవాళిని

కృత్రిమ మేధతో ఉపయోగాలెన్నో..
అలాగని సమస్యలూ లేకపోలేదు
విచక్షణతో వాడుకోవడమే కీలకం

పూర్తిగా తన గుప్పెట్లో పెట్టుకుంటుందని భయపడేవాళ్లూ ఉన్నారు. ఈ చర్చోపచర్చలతో నిమిత్తం లేకుండా ఏఐ ఇప్పటికే మన జీవితాల్లోకి పూర్తిగా చొచ్చుకొస్తోంది. కీలకమైన ఆరోగ్య రంగంలోనూ కృత్రిమ మేధ వాడకం నానాటికీ పెరిగిపోతోంది. ముమ్ముందు దీని పరిణామాలెలా ఉంటాయన్నది ఆసక్తికరం...

ఏఐ కంప్యూటరో, మరోటో తనకిచ్చిన సమాచారాన్ని అర్థం చేసుకొని, పూర్తిగా విశ్లేషించి అచ్చం మనిషి మాదిరిగా ప్రతిస్పందించగలగడమే కృత్రిమ మేధ అని చెప్పుకోవచ్చు. అలా చూస్తే ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ వాడకం ఈనాటిది కాదు. గుండె పరీక్షల్లో మొదటిదైన ఈసీజీ మొదలుకుని అల్ట్రా సౌండ్, ఎకో కార్డియోగ్రఫీ, సీటీ స్కాన్, ఎమ్మారై వంటి పరికరాల్లో ఏఐ వాడకం ఏళ్లుగా ఉన్నదే. వీటిల్లో మొత్తం ప్రక్రియను పర్యవేక్షించి రిపోర్టు జనరేట్ చేసేది ఏఐ సాయంతోనే. కంటిలోని రెటీనా ఫొటోలను చూసి సమస్యను పసిగట్టడంలో ఏఐ ఇప్పటికే కంటి డాక్టర్లతో పోటీపడుతోంది. రొమ్ము క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించడంలోనూ కీలకపాత్ర

ఇప్పటికే వినియోగంలో...

పోషిస్తోంది. యాంజియోగ్రాం తదితర అతి సంక్లిష్టమైన వైద్య వీడియోలను కూడా సమగ్రంగా చక్కని చికిత్స మార్గాలను సూచించే దిశగా దూసుకుపోతోంది ఏఐ! మెదడులోని న్యూరాన్ల ఆధారంగా కనిపెట్టిన డీప్ లెర్నింగ్ కాన్సెప్టు ఏఐలో అత్యంత కీలకం. ఇచ్చిన సమాచారాన్ని అర్థం చేసుకోవడంతో సరిపెట్టకుండా తన దగ్గర అప్పటికే ఉన్న సమాచారంతో క్రోడీకరించి, విశ్లేషించి, మరింత మెరుగైన, సమగ్రమైన ఫలితాలు వెల్లడించడం దీని ప్రత్యేకత.

ఎన్నో ఉపయోగాలు...

వైద్యులు–రోగి సంభాషణను, పరీక్ష ఫలితాలను బట్టి కచ్చితమైన రోగ నిర్ధారణ చాట్ జీపీటీ ఫోర్ వంటి చాట్‌బాట్లతో ఇప్పటికే సాధ్యపడుతోంది.

డిశ్చార్జ్ సమయంలో ఇచ్చే ట్రీట్మెంట్ చార్ట్‌లోని మందులను గుర్తించి, వాటి సైడ్ ఎఫెక్టులు తదితరాలను రోగికి స్పష్టంగా చెబుతుంది. డ్రగ్స్ తాలూకు నెగెటివ్ ఇంటరాక్షన్‌పై అలర్ట్ చేయగలుగుతుంది.

ఇన్సూరెన్స్ పేపర్లను సరిగా విశ్లేషించి క్లెయిం సులువుగా, త్వరగా జరిగేలా చూస్తుంది. మెడికల్ డిసీజ్ కోడింగ్‌లోనూ బాగా ఉపయోగపడుతుంది.

మెడికల్ రికార్డుల నిర్వహణలో ఏఐ బాగా ఉపయోగపడనుంది. తద్వారా డాక్టర్లకు ఎంతో సమయం ఆదా చేయడమేగాక రోగి సమాచారాన్నంతా లోతుగా విశ్లేషించి సమగ్రమైన డిశ్చార్జ్ సమ్మరీని అలవోకగా అందిస్తుంది.

వైద్య విద్యలోనైతే ఏఐ విప్లవాన్నే తేనుంది! సంక్లిష్టమైన అంశాలను బొమ్మలు, టేబుల్స్‌లా, చార్టుల రూపంలో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా చెప్పటంలో, మెడికల్ రీసర్చ్‌లో కీలక పాత్ర పోషించనుంది.

రోబోటిక్ పరికరాలతో మమేకమై సంక్లిష్టమైన ఆపరేషన్లలో వైద్యులకు సహకరించనుంది.

కోవిడ్ వంటి మహమ్మారులను ముందుగానే గుర్తించడంలోనూ ఏఐ ఉపయోగపడొచ్చు.

టెలీ మెడిసిన్‌నూ ఏఐ కొత్త పుంతలు తొక్కించగలదు. రోగి ఆస్పత్రికి వచ్చే పని లేకుండానే సమస్య గుర్తింపు, వైద్యం, పర్యవేక్షణ జరిగిపోతాయి.

కొత్త మందులను కనిపెట్టడం మొదలుకుని జన్యు అధ్యయనం ద్వారా ప్రతి వ్యక్తికీ పర్సనలైజ్డ్ మెడిసిన్ సూచించగలదు.

సమస్యలూ తక్కువేమీ కాదు...

ఆరోగ్య సమాచారం తాలూకు గోప్యత చాలా కీలకం. ఏఐతో దీనికి చాలా ముప్పుంటుంది.

ఏఐ సలహాలు అన్నివేళలా కరెక్టుగా కాకపోవచ్చు. కొన్ని రకాల వైద్య సలహాలివ్వడంలో చాట్‌జీపీటీ వంటివి చిత్త భ్రాంతికి గురైనట్టు ఇప్పటికే తేలింది. అలాగని వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి వస్తే వైద్యులకు అదో అదనపు బరువుగా మారొచ్చు.

డ్యూటీ డాక్టర్ల పనులను ఏఐ ఇప్పటికే చేసేస్తోంది. కనుక మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్ వంటి హెచ్చు నైపుణ్యం అక్కర్లేని ఉపాధి అవకాశాలకైతే ఏఐ సమీప భవిష్యత్తులోనే పూర్తిగా గండి కొట్టవచ్చు.

ప్రజారోగ్యానికి సంబంధించిన విధాన నిర్ణయాలను ఏఐ ప్రభావితం చేస్తే వాటిలో వ్యక్తి స్వేచ్ఛ వంటివాటికి ప్రాధాన్యం లేకుండా పోవచ్చు.

చివరగా...


ఆరోగ్య రంగంపై ఏఐ ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు ప్రఖ్యాత న్యూ ఇంగ్లండ్ జనరల్ ఆఫ్ మెడిసిన్ ఓ కొత్త జర్నల్‌నే ప్రారంభించనుంది. ఇరువైపులా పదునున్న కత్తి వంటి ఏఐని విచక్షణతో వాడుకోవాల్సిన బాధ్యత మాత్రం అంతిమంగా మనదే.



ఇన్‌పుట్స్- డాక్టర్ ఎం.ఎస్.ఎస్.ముఖర్జీ, సీనియర్ కార్డియాలజిస్ట్

ఆయనో జంటిల్మన్ జడ్జి

జస్టిస్ మహేశ్వరి వీడ్కోలు కార్యక్రమంలో సీజేఐ





జస్టిస్ మహేశ్వరి వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్

న్యూఢిల్లీ: జస్టిస్ దినేశ్ మహేశ్వరిని 'జెంటిల్‌మ్యాన్ జడ్జి'అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ అభివర్ణించారు. 2019లో సుప్రీంకోర్టులో నియమితులై నాలుగేళ్ల కుపైగా సేవలందించిన జస్టిస్ మహేశ్వరి ఈ నెల 14న పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటైన జస్టిస్ మహేశ్వరి వీడ్కోలు కార్యక్రమానికి జస్టిస్ డీవై చంద్రచూడ్ అధ్యక్షత వహించారు. 'అలహాబాద్ హైకోర్టులో ఉన్నప్పటి నుంచి జస్టిస్ మహేశ్వరితో నాకు పరిచయం ఉంది. ఇద్దరం అలహాబాద్, లక్నో బెంచ్‌ల్లో ఉండేవాళ్లం. లక్నోలో ఆయన నా సీనియర్. జస్టిస్ మహేశ్వరి జెంటిల్‌మ్యాన్ జడ్జి, ఫ్రెండ్లీ జడ్జి'అని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు.'విధుల్లో ఉండగా చివరిసారిగా నిగ్రహాన్ని ఎప్పుడు కోల్పోయారనే విషయం ఆయనకు కూడా గుర్తులేదని కచ్చితంగా చెప్పగలను. టెంపర్ అనేది జస్టిస్ మహేశ్వరి డిక్షనరీలోనే లేదు. ఆయన అంతటి సహనం, ప్రశాంతతలతో ఉంటారు'అని కొనియాడారు. అనంతరం జస్టిస్ మహేశ్వరి ప్రసంగించారు. 'ఇతరుల సహకారం లేకుండా ఏ వ్యక్తి ఈ విధులను నిర్వహించలేడు. మనమంతా కలిసి పనిచేశాం'అంటూ ఉద్విగ్నభరితమయ్యారు. సుప్రీంకోర్టులో మోస్ట్ సీనియర్ జడ్జిల్లో జస్టిస్ మహేశ్వరి ఆరోవారు. ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్న సుప్రీంకోర్టులో జస్టిస్ మహేశ్వరి రిటైర్‌మెంట్‌తో జడ్జీల సంఖ్య 33కు తగ్గనుంది.

'ఈ-ఫైలింగ్ 2.0' ప్రారంభం

సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఈ-ఫైలింగ్ 2.0 సదుపాయాన్ని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ శుక్రవారం ప్రారంభించారు. దీనిద్వారా న్యాయవాదులు ఏ సమయంలోనైనా కేసులు ఆన్‌లైన్ ద్వారా ఫైల్ చేయొచ్చన్నారు. దీన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ-ఫైలింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా కేసులు ఫైల్ చేయడంతో పాటు తర్వాత వాటి స్థితిగతులను ఇతర కోర్టులు, ట్రిబ్యునళ్లలో ఉన్న కేసుల స్టేటస్‌ను సైతం తెలుసుకోవచ్చని వెల్లడించారు.

ఇమ్రాన్‌కు రెండు వారాలు బెయిల్



ఇస్లామాబాద్: అల్-ఖదీర్ ట్రస్టుకు భూమి బదలాయింపు కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట లభించింది. ఇస్లామాబాద్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఆయనకు రెండు వారాలపాటు బెయిల్ మంజూరు చేసింది. దేశంలో నమోదైన ఇతర ఏ కేసుల్లోనూ ఆయనను సోమవారం వరకు అరెస్టు చేయొద్దని ఆదేశించింది. అలాగే ఈ నెల 9వ తేదీ తర్వాత ఇమ్రాన్‌పై నమోదైన అన్ని కేసుల్లో ఈ నెల 17 బెయిల్ మంజూరు చేసింది. జిలే షా హత్య కేసులో మరో ధర్మాసనం ఇమ్రాన్‌కు ఈ నెల 22 దాకా బెయిల్ ఇచ్చింది. ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని పాకిస్తాన్ సుప్రీంకోర్టు తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు సూచన మేరకు ఆయన ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం ఇమ్రాన్‌ను అధికారులు పటిష్టమైన భద్రత మధ్య శుక్రవారం హైకోర్టులో హాజరుపర్చారు. ఆయనకు రెండు వారాలపాటు బెయిల్ మంజూరు చేస్తూ డివిజన్ బెంచ్ ఉత్తర్వు జారీ చేసింది.


పీటీఐ నేతల అరెస్టు

ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ నేతలపై షహబాజ్ సర్కారు గురిపెట్టింది. ఇద్దరు పీటీఐ కీలక నేతలను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇమ్రాన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన షిరీన్ మజారీని, ఆమె కుమార్తె, లాయర్ ఇమాన్ హజీర్-మజారీని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరూ పీటీఐలో కీలకంగా పనిచేస్తున్నారు. పలువురు ఇతర నేతలను ఇప్పటికే అరెస్టు చేశారు.

నేడే కర్ణాటక తీర్పు

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం

మధ్యాహ్నం కల్లా తుది ఫలితాలపై స్పష్టత	తేలనున్న 2,615 మంది అభ్యర్థుల భవితవ్యం	హంగ్ వస్తే ఏం చేయాలన్న దానిపై పార్టీల సమాలోచనలు	ఎమ్మెల్యేలను రిసార్టులకు తరలించేందుకు ఏర్పాట్లు



సాక్షి, బెంగళూరు: ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది. మొత్తం 2,615 మంది అభ్యర్థుల తలరాత ఏమిటో తేలిపోనుంది. రాజకీయ పార్టీలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 8 గంటలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) తెరపై ఎన్నికల ఫలితం కనిపించడం ప్రారంభం కానుంది. కౌంటింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాలు ఏర్పాటు చేశారు. తుది ఫలితాలపై మధ్యాహ్నం కల్లా ఒక స్పష్టమైన చిత్రం ఆవిష్కృతం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 73.19 శాతం పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే.

ప్రధాన పార్టీల నడుమ హోరాహోరీ

ఈ ఎన్నికల్లో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కొన్ని సర్వేలు బీజేపీ మళ్లీ గెలుస్తుందని తెలియజేశాయి. స్వల్ప మెజార్టీతో కాంగ్రెస్ నెగ్గే అవకాశం ఉన్నట్లు మరికొన్ని సర్వేల్లో వెల్లడయ్యింది. జేడీ(ఎస్) కింగ్‌మేకర్ మారే అవకాశాలు కొట్టిపారేయలేమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కర్ణాటకలో గత 38 ఏళ్లుగా అధికార పార్టీ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవు. ఆ ఆనవాయితీని బద్దలు కొట్టాలన్న లక్ష్యంతో అధికార బీజేపీ శ్రమించింది. మరోవైపు ఈ ఎన్నికలపై కాంగ్రెస్‌కు భారీ ఆశలే ఉన్నాయి. వీటిలో గెలిస్తే పార్టీల్లో కొత్త ఉత్సాహం వస్తుందని, వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో తామే అతిపెద్ద పార్టీగా అవతరిస్తామని కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. తీర్పు ఎవరికి అనుకూలంగా ఉండనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వం మాదే: బొమ్మై

ఎన్నికల్లో తమకే సంపూర్ణ మెజార్టీ లభిస్తుందని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ధీమా వ్యక్తం చేశారు.సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయ్యే ప్రసక్తే లేదన్నారు. పార్టీ సహచర నాయకులతో కలిసి మాజీ సీఎం బీఎస్ యడియూరప్పను శుక్రవారం ఆయన నివాసంలో కలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ సొంతంగా పోలింగ్ బూత్ స్థాయిలో ఓటింగ్ సరళిని పరిశీలించిందని మేజిక్ ఫిగర్ దాటుతామన్న విశ్వాసం తమకి ఉందన్నారు. హంగ్ అసెంబ్లీ వస్తే బీజేపీ వైఖరి ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఊహాగానాలను తాను విశ్వసించనని చెప్పారు. తమకి మెజార్టీ ఖాయమని స్పష్టం చేశారు. ఈ సారి ఎన్నికల్లో అత్యధికంగా 73.19% పోలింగ్ నమోదైంది. ఎగ్జిట్ పోల్స్‌లో అత్యధిక సంస్థలు కాంగ్రెస్‌కే స్వల్ప మొగ్గ వస్తుందని వెల్లడించాయి.

సంప్రదింపులు.. బేరసారాలు

కర్ణాటకలో అధికారం చేజిక్కించుకునేందుకు ఇప్పటికే పార్టీలు తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. నేతలు వరుసగా సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. గెలుపోటముల లెక్కలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 224 సీట్లను గాను 113 సీట్లు సాధించాలి. కనీసం సాధారణ మెజార్టీ సాధిస్తామని బీజేపీ, కాంగ్రెస్ ధీమాగా చెబుతున్నాయి. మ్యాజిక్ ఫిగర్‌కు చేరువగా వచ్చి ఆగిపోతే హంగ్ పరిస్థితులు రానున్నాయి. అందుకే కచ్చితంగా గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థులపై పార్టీలు కన్నేశాయి. స్వతంత్ర అభ్యర్థులపైనా దృష్టి పెట్టాయి. వారితో సంప్రదింపులు, బేరసారాలు జరుపుతున్నట్లు తెలిసింది. హంగ్ ఏర్పడితే చేపట్టాల్సిన కార్యాచరణపై కాంగ్రెస్ పెద్దలు చర్చించారు. ఇక బీజేపీ నేతలు కూడా సమాలోచనాల్లో మునిగిపోయారు. శుక్రవారం ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై మాజీ సీఎం యడియూరప్ప నివాసానికి వెళ్లి మాట్లాడారు. జేడీ(ఎస్)లో ఇంకా ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అందరి చూపు ఆ పార్టీ పైనే ఉంది. జేడీ(ఎస్) నేత, మాజీ సీఎం కుమారస్వామి సింగపూర్ పర్యటనకు వెళ్లారు. రాష్ట్రంలో హంగ్ వస్తే తమ ఎమ్మెల్యేలను రిసార్టులకు తరలించేందుకు పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఎమ్మెల్యేగా నెగ్గిన వారంతా శనివారం సాయంత్రంలోగా బెంగళూరుకు చేరుకోవాలని ప్రధాన పార్టీల నుంచి ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది.

ఆర్యన్‌ఖాన్‌ను వదిలేసేందుకు రూ.25 కోట్లు!

ఎన్సీబీ మాజీ అధికారి వాంఖెడేపై సీబీఐ అభియోగాలు

న్యూఢిల్లీ: బాలీవుడ్ బాద్‌షా షారూక్‌ఖాన్ కుమారుడు ఆర్యన్‌ఖాన్‌ను మాదకద్రవ్యాల కేసులో ఇరికించకుండా ఉండడానికి రూ.25 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఎన్సీబీ మాజీ అధికారి సమీర్ వాంఖెడెపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. శుక్రవారం ముంబై, ఢిల్లీ, రాంచీ, కాన్పూర్‌లలో మొత్తం 29 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. 2021, అక్టోబర్ 2న ఒక క్రూయిజ్ షిప్‌లో డ్రగ్స్‌ని సేవించాడన్న ఆరోపణలపై ఆర్యన్‌ఖాన్‌ను ఎన్సీబీ అరెస్ట్ చేయడం, ఆ తర్వాత క్లీన్ చిట్ ఇవ్వడం తెలిసిందే. వాంఖెడే దర్యాప్తు చేసిన ఈ కేసులో తప్పులుతడకలు ఉన్నాయని సిట్ దర్యాప్తులో ఇప్పటికే తేలింది. ఆర్యన్‌ను కేసు నుంచి వదిలేయడానికి రూ.25 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టింది. వాంఖెడె అడ్వాన్స్ కింద రూ.50 లక్షలు తీసుకున్నారని తమకు సమాచారం ఉందని సీబీఐ అధికారులు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరి పోటీ: బీజేడీ

భువనేశ్వర్: ఏ పార్టీతోనూ తమకు పొత్తు లేదని, ఏ కూటమిలోనూ తాము భాగస్వామి కాదని ఒడిశాలో అధికార బిజూ జనతాదళ్(బీజేడీ) సీనియర్ నాయకుడు ఒకరు చెప్పారు. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని, దీనిపై తమ అధినేత నవీన్ పట్నాయక్ ఇప్పటికే స్పష్టత ఇచ్చారని తెలియజేశారు. అన్ని పార్టీలతో సమదూరం పాటిస్తున్నామని వివరించారు. ఒడిశా రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధే తమ ప్రధాన అజెండా అని వెల్లడించారు. నవీన్ పట్నాయక్ మిత్రుడైన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రతిపాదిస్తున్న థర్డ్ ఫ్రంట్‌కు దూరంగా ఉంటామని అన్నారు. నవీన్ పట్నాయక్ గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. థర్డ్ ఫ్రంట్‌లో తమ పాత్ర ఏమీ ఉండదని స్పష్టం చేశారు. నవీన్ పట్నాయక్ అంతకుముందు నితీశ్ కుమార్‌తో భేటీ అయ్యారు. వారు ఏం మాట్లాడుకున్నారన్నది తెలియరాలేదు.

ఎన్ఈపీతో 'ప్రాక్టికల్' బోధన

అఖిలభారత ఉపాధ్యాయుల సదస్సులో మోదీ



గాంధీనగర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం గుజరాత్ పర్యటనలో బిజీ బిజీగా ఉన్నారు. వివిధ కార్యక్రమాల్లో ఆయన పాలుపంచుకున్నారు. అఖిల భారత ఉపాధ్యాయుల సదస్సులో ప్రధాని మాట్లాడుతూ కొత్త జాతీయ విద్యా విధానంతో (ఎన్ఈపీ) బోధనలో సమూల మార్పులు వస్తాయని చెప్పారు. ఒకప్పుడు విద్యార్థులు పుస్తకాలు చూసీ బట్టీ పట్టడమే ఉండేదని కానీ ఈ కొత్త విద్యావిధానం ప్రాక్టికల్ లెర్నింగ్‌పై దృష్టి పెట్టిందని అన్నారు. దీనిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ప్రాథమిక విద్య విద్యార్థులకు వారి వారి మాతృభాషలోనే ఉండాలని అప్పుడే విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు వెలికి వస్తాయని చెప్పారు. మన దేశంలో ఆంగ్ల భాషలో బోధనకే అధిక ప్రాధాన్యం ఉందని ప్రస్తుతమున్న పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలో చదివించడానికి ఇష్టపడుతున్నారని ప్రధాని చెప్పారు. దీని వల్ల గ్రామాల్లోని ప్రతిభ ఉన్న ఉపాధ్యాయులు, నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారికి సరైన అవకాశాలు రావడం లేదన్నారు. ఎన్ఈపీతో ఈ సమస్యలన్నీ తొలగిపోతాయని ప్రధాని మోదీ వివరించారు.

ప్రభుత్వ పథకాల్లో వివక్షకు తావు లేదు

గాంధీనగర్‌లో మహాత్మా మందిర్ ప్రారంభోత్సవంతో పాటు రూ.4,400 కోట్ల విలువైన ప్రాజెక్టులకి ప్రధాని శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభు త్వ పథకాల్లో కుల, మత వివక్షకు తావు లేదని అర్హులైన అందరికీ అవి చేరుతున్నాయని చెప్పారు. నిజమైన లౌకికవాదం ఉన్న చోట వివక్ష కనిపించదని అన్నారు. అందరూ సంతోషంగా ఉండడానికి కృషి చేయడం కంటే మించిన సామాజిక న్యాయం మరోటి లేదని అభిప్రాయపడ్డారు. 70% మంది మహిళల సాధికారతకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం ఒక పనిముట్టులా నిలిచిందని ప్రభుత్వ పథకాలన్నీ నూటికి నూరు శాతం లబ్ధి దారులకు చేరేలా చర్యలు చేపట్టామన్నారు.

డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లను విచారించవచ్చు

న్యూఢిల్లీ: డిఫాల్ట్ బెయిల్ కోరుతూ దాఖలయ్యే పిటిషన్ల విచారణపై సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టతనిచ్చింది. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు అధికారులు గడువులోగా చార్జిషీట్ దాఖలు చేయకపోతే డిఫాల్ట్ బెయిల్ కోరుతూ నిందితులు దాఖలు చేసే పిటిషన్లను హైకోర్టులు, ట్రయల్ కోర్టులు విచారించవచ్చంది. 60 నుంచి 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయకుంటే నిందితులు డిఫాల్ట్ బెయిల్‌కు అర్హులు. విచారణ పూర్తవకుండానే అసంపూర్తి చార్జిషీట్‌ను దాఖలు చేసినా డిఫాల్ట్ బెయిల్ పొందవచ్చని రీతూ ఛాబ్రియా కేసులో జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 26న తీర్పు వెలువరించింది. కేవలం నిందితులకు డిఫాల్ట్ రావొద్దన్న కారణంతో చార్జిషీట్ దాఖలు చేయొద్దని సూచించింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ తీర్పును ఉపసంహరించుకోవాలని కోరింది. ఈడీ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కింది కోర్టులు రీతూ ఛాబ్రియా కేసు తీర్పుపై ఆధారపడాల్సిన అవసరం లేదని, డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లపై విచారణ కొనసాగించవచ్చని స్పష్టం చేసింది.

కేంద్రంపై సుప్రీంకు ఆప్

ఢిల్లీ ప్రభుత్వాధికారులపై పాలనపరమైన అధికారాలన్నీ రాష్ట్ర ప్రభుత్వానివేనంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఈ విషయమై కేంద్రానికి, ఆప్ సర్కారుకు మధ్య గొడవలు సద్దుమణగడం లేదు. ప్రభుత్వ సేవల శాఖ కార్యదర్శి ఆశిష్ మోరే బదిలీని కేంద్రం అడ్డుకుంటోందని కేజ్రీవాల్ ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణకు వచ్చే వారం ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని సీజేఐ పేర్కొన్నారు.

'అదానీ' విచారణకు 3 నెలలు?

అదానీ గ్రూప్ అవకతవకల ఆరోపణలపై విచారణకు సెబీకి మరో మూడు నెలలు గడువివ్వాలని యోచిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. విచారణలో సెబీ వైఫల్యముందన్న వాదనలను తిరస్కరించింది. సెబీ నివేదికను తమ నిపుణుల కమిటీ అధ్యయనం చేశాక దానిపై తేలుస్తామని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం స్పష్టం చేసింది.

కేరళ స్టోరీపై నిషేధం ఎందుకు?

ది కేరళ స్టోరీ సినిమాను ఎందుకు నిషేధించారో చెప్పాలంటూ తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సీజేఐ ధర్మాసనం నోటీసులిచ్చింది. ''ఇతర రాష్ట్రాలు ఏ సమస్యా లేకుండా సినిమాను ప్రదర్శిస్తున్నాయిగా! దానివల్ల ఏమీ జరగలేదు. మరి మీరెందుకు నిలిపివేశారు? సినిమా నచ్చకపోతే ప్రజలే తిరస్కరిస్తారు'' అని వ్యాఖ్యానించింది.



హక్కుల వీరుని యాదిలో

మూలవాసుల హక్కుల కోసం జీవితాంతం ఉద్యమించిన స్టాండింగ్ బేర్ గౌరవార్థం అమెరికా శుక్రవారం విడుదల చేసిన పోస్టల్ స్టాంప్ ఇది. నేటివ్ అమెరికన్లు కూడా మనుషులేనని, వారికీ అన్ని విషయాల్లోనూ చట్టప్రకారం అందరి మాదిరిగానే సమాన హక్కులుంటాయని వాదించి, 1879లో ఆ మేరకు చరిత్రాత్మక కోర్టు తీర్పు రావడానికి ప్రధాన కారకునిగా నిలిచారాయన.

కాచిగూడ-కాకినాడ టౌన్ మధ్య వేసవి ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): సమ్మర్ సీజన్‌లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-కాకినాడ టౌన్ (07417) రైలు ఈ నెల 13న రాత్రి 8.45 గంటలకు కాచిగూడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07418) ఈ నెల 14న రాత్రి 9.55 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. రెండు మార్గాలలో ఈ రైలు కాజీపేట, వరంగల్లు, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది.

హస్తినలో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సాక్షి, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని గోల్‌మార్కెట్ సమీపంలో టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం రాత్రి ధ్వజావరోహణం ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు.

ఉద్యాన పంటలకు హబ్‌గా ఏపీ

312.34 లక్షల టన్నుల ఉత్పత్తితో దేశంలో రెండోస్థానం

- పోషకాహార భద్రత దిశగా ఉద్యాన పంటలు పెరగాలి
- ఉద్యాన వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



స్నాతకోత్సవంలో అతిథులు, అధికారులతో గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం: ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల ఉద్యాన పంటలకు ఆంధ్రప్రదేశ్ హబ్‌గా మారిందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. మొత్తం 17.84 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 312.34 లక్షల టన్నుల ఉత్పత్తితో మన రాష్ట్రం ఉద్యానపంటల ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని వెంకట్రామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఐదో స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. చాన్సలర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ పోషకాహార భద్రత కల్పించేలా ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇప్పటికే స్థూల జాతీయోత్పత్తిలో ఉద్యాన పంటలు ఆరు శాతం ఉండటం శుభ పరిణామమని చెప్పారు. ఉద్యానవన రంగం 14శాతం ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని, అందులో 42 శాతం మహిళలకే దక్కడం గొప్ప విషయమన్నారు. సమాజం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందన్నారు. రోబోటిక్ టెక్నాలజీ, డ్రోన్‌ల వినియోగం వల్ల ఉత్పత్తి పెరగడంతోపాటు, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని, ఈ దిశగా యూనివర్సిటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలకు సాంకేతిక సహకారం అందించడంలో ఉద్యాన వర్సిటీ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. వర్సిటీ దశాబ్దంన్నర ప్రయాణంలో విద్య, పరిశోధన, విస్తరణ విభాగాల్లో అద్భుత పురోగతిని సాధించిందని, ఇక్కడ అభివృద్ధి చేసిన 18 వంగడాలను జాతీయ స్థాయిలో కేంద్రం నోటిఫై చేయడం అభినందనీయమన్నారు. నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థికవేత్త రమేష్ చంద్ మాట్లాడుతూ ఉద్యాన విద్యలో డిగ్రీలు సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రైతులకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఉద్యాన వర్సిటీ ఉప కులపతి టి.జానకీరామ్ వర్సిటీ సాధించిన ప్రగతి, లక్ష్యాల గురించి వివరించారు. అనంతరం 1,069 మందికి బీఎస్సీ హానర్స్, 97 మందికి ఎమ్మెస్సీ, 26 మందికి పీహెచ్‌డీ పట్టాలను గవర్నర్ ప్రదానం చేశారు.

'గోల్డ్ మెడల్స్' అందుకున్నవారు వీరే...

ఉత్తమ అధ్యాపకుడిగా వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ (ఎంటమాలజీ)డాక్టర్ ఎస్.ఇమ్మానుయేల్, ఉత్తమ పరిశోధనా శాస్త్రవేత్తగా కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రకుమార్, ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్తగా వెంకట్రామన్నగూడెంలోని కేవీకే శాస్త్రవేత్త (మత్స్యసంపద సైన్స్) డాక్టర్ ఎ.దేవీవరప్రసాద్ రెడ్డి బంగారు పతకాలు అందుకున్నారు. అడ్డా వెంకాయమ్మ గోల్డ్ మెడల్‌ను కొత్తకడప లక్ష్మీకళ (ప్రకాశం), డాక్టర్ టీబీ దాశరథి గోల్డ్‌మెడల్‌ను దుర్గావెంకట రవితేజ అములోతు (గుంటూరు), శంబతరు పావని(వైఎస్సార్), దేవరకొండ పుల్లయ్యశాస్త్రి గోల్డ్ మెడల్‌ను దుంపపెంచల విజయ్‌రెడ్డి (నెల్లూరు), నోరు రాజశేఖర్‌రెడ్డి (కర్నూలు), షాహిద్ లెఫ్టినెంట్ అమిత్ సింగ్ గోల్డ్ మెడల్‌ను రమావత్ తావుర్యనాయక్ (ప్రకాశం), అన్నే శిఖామణి మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను దేవిరెడ్డి మేఘన, గరికిముక్కల పరంజ్యోతి అందుకున్నారు.

- టీడీపీ మహానాడు-2023 ప్రాంగణ నిర్మాణానికి రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరి గ్రామంలో రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం భూమిపూజ చేశారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు, జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు అమ్మవారి చిత్రపటాలు అందజేస్తున్న చైర్మన్ రాంబాబు, ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, చైర్మన్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.మానవేంద్రనాథ్ రాయ్ కూడా దుర్గమ్మను దర్శించుకున్నారు.

పెట్రోలు సీసాలతో పోలీసులపైకి..

- రాజధానిలో రైతుల ముసుగులో టీడీపీ నాయకుల హల్‌చల్
- సీఐ కళ్లల్లో పెట్రోల్ పడి ఆస్పత్రికి తరలింపు
- దొండపాడు, నెక్కల్లులో ఇళ్లస్థలాల చదును పనుల్ని అడ్డుకున్న వైనం


సీఆర్డీఏ కార్యాలయంలో డీఎస్పీతో దురుసుగా మాట్లాడుతున్న రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు

తాడికొండ: రాజధానిలో రైతుల ముసుగులో శుక్రవారం టీడీపీ నాయకులు పెట్రోలు సీసాలతో హల్‌చల్ చేశారు. గుంటూరు జిల్లా దొండపాడు, నెక్కల్లు గ్రామాల్లో నేలను చదును చేసేందుకు వచ్చిన జేసీబీలను అడ్డుకున్నారు. రైతుల పేరుతో మహిళలను ముందుపెట్టి హల్‌చల్ చేసిన టీడీపీ నాయకులు పనులు ప్రారంభిస్తే పెట్రోల్ పోసుకుంటామంటూ బెదిరింపులకు దిగారు. పెట్రోల్ సీసాలను లాక్కొనేందుకు ప్రయత్నించిన సీఐ ఆనందరావు తదితరులపై పెట్రోల్ చల్లారు. ఒంటిపై, కళ్లల్లో పెట్రోలు పడటంతో సీఐని హుటాహుటిన 108 వాహనంలో కంటి వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయానికి చేరుకుని నిరసన చేయడంతోపాటు వినతిపత్రం ఇచ్చి, డీఎస్పీపై వాగ్వాదానికి దిగారు. రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించి నిరసనలు, ధర్నాలు చేస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు శనివారం ఉదయం 8 గంటలకు తుళ్లూరు దీక్షాశిబిరం నుంచి అంబేడ్కర్ స్మృతివనం వరకు మాజీ న్యాయవాది జడా శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు రాజధాని రైతులు ప్రకటించిన నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ అధికారుల ఔదార్యం

ప్రయాణికురాలికి 50 తులాల బంగారం అప్పగింత

కాశీబుగ్గ: బస్సులో ఓ ప్రయాణికురాలు మర్చిపోయిన 50 తులాల బంగారాన్ని తిరిగి ఆమె వద్దకు చేర్చి ఆర్టీసీ అధికారులు ప్రశంసలు అందుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన శోభారాణి విశాఖపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్సులో పలాస ఎక్స్‌ప్రెస్ (ఏపి 30జెడ్0070)లో బ్యాగు పెట్టి కిందికి దిగారు. అయితే డ్రైవర్ ఆమెను గమనించకపోవడంతో బస్సును తీసేశారు. ప్రయాణికురాలు తిరిగి వచ్చేసరికి అక్కడ బస్సు కనిపించకపోవడంతో ఆర్టీసీ కంట్రోల్ అధికారులను సంప్రదించి బ్యాగు వివరాలు చెప్పారు. దీంతో టెక్కలి డిపో కండక్టర్ ధనంజయకు సమాచారం అందించగా సర్వీస్ కండక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆ బ్యాగును పలాసలో భద్రపరిచారు. అనంతరం శుక్రవారం పలాస ఆర్టీసీ డిపోలో కండక్టర్ ఆర్‌వీ రావు, డ్రైవర్ ఎస్‌హెచ్ ప్రసాద్‌లు మేనేజర్ వై.శ్రీనివాసరావు చేతుల మీదుగా బ్యాగును ప్రయాణికురాలికి అందించారు. 50 తులాల బంగారం బ్యాగులో ఉందని దాని విలువ రూ.35 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

బాబు కోసమే పవన్ పార్టీ

- జనసేన పార్టీని, కాపులను గంపగుత్తగా చంద్రబాబుకు అమ్మేస్తున్నాడు
- కాపులపై బాబు కేసులు పెడితే జగన్ కేసులు ఎత్తేశారు
- పవన్ మాటలు నమ్మి మోసపోకండి
- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: చంద్రబాబు కోసమే తాను జనసేన పార్టీ పెట్టిన సంగతిని పవన్ కళ్యాణ్ మరోసారి రుజువు చేశాడని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మండిపడ్డారు. జనసేన పార్టీని, ఆయనపై ఆశలు పెట్టుకున్న కాపులను గంపగుత్తగా పవన్.. చంద్రబాబుకు అమ్మేస్తున్నాడని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో అడపా శేషు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాజ్యాధికారం కోసం పవన్‌పై ఆశలు పెట్టుకున్న కాపులను వంచించి బాబు పంచన చేరేందుకే ఆసక్తి చూపుతున్నాడని ఆరోపించారు. చంద్రబాబును సీఎంను చేసేందుకు ఆయన పల్లకీ మోస్తున్నాడని విమర్శించారు. జనసేన పార్టీకి చంద్రబాబే గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ రూపంలో కాపులపై కుట్ర జరుగుతోందన్నారు. పవన్ వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని చెప్పారు. తమ ఆశలు తీరుస్తాడని ఎంతోమంది కాపు యువకులు అనేక వ్యయప్రయాసలు పడ్డారని గుర్తు చేశారు. 2014 నుంచి పవన్ వెంట నడుస్తున్న జనసేన శ్రేణులకు, కాపులకు పవన్ ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. వంగవీటి రంగాను చంపింది టీడీపీ అని ప్రపంచానికి తెలుసన్నారు. అటువంటి టీడీపీని బతికించేందుకు పవన్ పడుతున్న తాపత్రయం చూస్తే ఆవేదన కలుగుతోందన్నారు. ఒక పథకం ప్రకారం కాపులపై చంద్రబాబు కక్ష సాధిస్తూ వస్తున్నారని అడపా శేషు గుర్తు చేశారు. తుని ఘటనలో కాపులపై ఆయన కేసులు పెట్టించారన్నారు. అప్పుడు పవన్ ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. కాపులపై పెట్టిన అక్రమ కేసులు సీఎం వైఎస్ జగన్ ఎత్తేశారని గుర్తు చేశారు. కాపులకు తొలి నుంచి సీఎం జగన్ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కాపుల్లో 30 మందిని ఎమ్మెల్యేలుగా, ఐదుగురిని మంత్రులుగా చేశారని తెలిపారు. తాజా పరిణామాలతో ముద్రగడ పద్మనాభంకు కాపులు హారతులు పడతారనే భయంతోనే పథకం ప్రకారం పవన్‌ను చంద్రబాబు రంగంలోకి దించారన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి: ఆర్.కృష్ణయ్య



పటమట(విజయవాడ తూర్పు): పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టసభలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ ఆధ్వర్యంలో గుడివాడలో మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ జరిగింది. ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే కొడాలి నాని పూలేల విగ్రహాలను ఆవిష్కరించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి, వారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని, అప్పుడే దేశంలో సమైక్యత, సమగ్రత, శాంతి నెలకొంటుందన్నారు. బీసీల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్ల పై ఉన్న క్రీమిలేయర్‌ను తొలగించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కేంద్రంలో బీసీలకు పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్స్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలని సూచించారు. కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కలలో బీసీ కులాల వారీ లెక్కలు సేకరించాలని కోరారు.

లక్ష కుటుంబాలకు ఊరట..
చిక్కులకు విముక్తి

డీబార్ దానయ్యకు కోటు తొడిగి..!

రెండు రోజుల క్రితం ఈనాడులో జీవీ రావు అనే వ్యక్తి ఇంటర్వ్యూ ప్రచురించారు. ఆ పెద్ద మనిషి ఎవరని ఆరా తీస్తే.. చార్టెడ్ అకౌంటెంట్ (సీఏ)గా ఆయనకు ప్రాక్టీసు రద్దయింది. చార్టెడ్ అకౌంటెన్సీ వారు ఆయన సర్టిఫికెట్‌ను రద్దు చేసి డీబార్ చేశారు. అలాంటి డీబార్ అయిన దానయ్యను పట్టుకుని ఓ కోటు తొడిగి ఆర్థిక నిపుణుడిగా చూపిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఉండడానికి వీల్లేదని ఆయనతో చెప్పిస్తారు. అది ఈనాడు రాస్తుంది. ఎల్లో మీడియా డిబేట్లు పెడుతుంది. జగన్ మాదిరిగా పరిపాలన చేస్తే రాష్ట్రం దివాళా తీస్తుందట.. అప్పుల పాలవుతుందని చెప్పిస్తారు. అబద్ధాలు చెప్పించడానికి వీరంతా అలా వాడుకుంటారు.

కులాల యుద్ధం కాదు.. క్లాస్‌వార్

ఈరోజు రాష్ట్రంలో జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు. క్లాస్ వార్ జరుగుతోంది. పేదవాడు ఒకవైపు, పెత్తందారీ మనస్తత్వం ఉన్నవారు మరోవైపున యుద్ధం జరుగుతోంది. పేదల ప్రతినిధిగా ఇక్కడ మీ జగన్ ఉన్నాడు. పేదరికం నుంచి ఎలా బయటకు తేవాలని మీ బిడ్డ అడుగులు వేస్తున్నాడు. అందుకే ప్రతి గ్రామంలో సచివాలయాలు కనిపిస్తున్నాయి. ప్రతి 50 ఇళ్లకు వలంటీర్ కనిపిస్తాడు. ఎక్కడా లంచాలు, వివక్ష లేని పాలన కనిపిస్తోంది. మన పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలి. నైపుణ్యం ఉన్న వ్యక్తులుగా మారాలని చదువులపై పెట్టుబడులు పెడుతున్నాం. హ్యూమన్ క్యాపిటల్ ఇండెక్స్‌లో మన రాష్ట్రం దేశానికే దిక్సూచి అవుతుంది. నైపుణ్యం ఉన్నవారు లేక జర్మనీ ఇబ్బంది పడుతోందని ఓ ఆర్టికల్ చదివా. నిపుణులైన మానవ వనరులు ఉండాలంటే ఒక విత్తనం పడి వృక్షం కావాలి. మీరంతా ఒక్కటే గుర్తు పెట్టుకోండి. మీ ఇంట్లో మంచి జరిగిందా..? లేదా..? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైన్యంగా నిలబడండి.


చుక్కల భూములకు పట్టాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

▶ మొదటి పేజీ తరువాయి

కనీసం రూ.20 వేల కోట్లు ఉంటుంది.

పుండుపై కారం చల్లిన చంద్రబాబు

దాదాపు వందేళ్ల క్రితం ఆంగ్లేయుల హయాంలో జరిగిన భూముల సర్వేలో ఒక భూమిని ప్రభుత్వ భూమా? లేక ప్రైవేట్ భూమా? అనే విషయాన్ని సరిగా నిర్ధారణ చేయలేదు. రెవెన్యూ రికార్డుల్లో అంటే రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్)లో ఆ పట్టాదారుడి గడిలో చుక్కలు పెట్టి వదిలేశారు. బ్రిటీష్ వారి కాలంలో ఇలా చుక్కలు పెట్టి లెక్కలు తేల్చకుండా వదిలేసిన భూములను రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ వస్తున్నారు. తరతరాలుగా సాగు చేస్తున్నా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు జరగని అధ్వాన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రైతన్నల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే పరిష్కారం చూపాల్సిన చంద్రబాబు ప్రభుత్వం 2016లో పుండుమీద కారం చల్లినట్లుగా రిజిస్ట్రేషన్లు జరగకుండా ఒక మెమో ద్వారా 22–ఏ నిషేధిత జాబితాలో చేర్చి అన్నదాతల జీవితాలతో ఆడుకుంది. ఇలా అన్యాయానికి గురైన రైతులు తమ పిల్లల పెళ్లిళ్లు, వైద్యం, ఇతర అవసరాలకు భూమిని విక్రయించేందుకు వీలులేని పరిస్థితి ఏర్పడింది. చుక్కల భూముల యజమానులు నిషేధిత జాబితా నుంచి డీనోటిఫై చేయించుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో పడ్డ కష్టాలను నా సుదీర్ఘ పాదయాత్రలో స్వయంగా చూశా. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 43 వేల ఎకరాలు, పక్కనే ఉన్న ప్రకాశం జిల్లాలో మరో 37 వేల ఎకరాలు, కడప, అన్నమయ్య జిల్లాల్లో 22 వేల ఎకరాల చుక్కల భూములున్నాయి. చిత్తూరు జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రదక్షిణలు, లంచాలతో పని లేకుండా...

కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఒక్క రూపాయి కూడా ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పని లేకుండా కలెక్టర్ల ద్వారా ఈ భూములన్నీ గుర్తించాం. 22–ఏ నిషేధిత జాబితా నుంచి చుక్కల భూములకు విముక్తి కల్పిస్తూ రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి 2 లక్షల ఎకరాలకు చెందిన దాదాపు లక్ష రైతు కుటుంబాలకు మంచి చేస్తూ వారికి ఈ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాగలిని బహూకరిస్తున్న నాయకులు

షరతులు గల పట్టా భూములూ పరిష్కారం

చుక్కల భూముల మాదిరిగానే సమస్యలు ఎదుర్కొంటున్న షరతులు గల పట్టా భూములు మరో 35 వేల ఎకరాలకు సంబంధించి 22 వేల మంది రైతులకు మేలు చేస్తూ ఆర్నెల్ల క్రితమే అవనిగడ్డ నియోజకవర్గంలో అందించాం. నిషేధిత జాబితా నుంచి ఆ భూములను తొలగిస్తూ ఆ ప్రాంత రైతులందరికి మంచి చేశాం. ఇది కూడా మీ బిడ్డ హయాంలోనే జరిగింది.

భూ వివాదాలు శాశ్వతంగా పరిష్కారం

ఎప్పుడో వందేళ్ల నాటి భూముల సర్వే తర్వాత రికార్డులు అప్‌డేట్ కాకపోవడంతో గ్రామాల్లో నెలకొన్న విభేదాలు, వివాదాలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో దేశంలో ఎక్కడా జరగని విధంగా మన రాష్ట్రంలో సమగ్ర సర్వే చేపట్టాం. 17,476 రెవెన్యూ గ్రామాలకి సంబంధించి ప్రతి గ్రామంలో సర్వే చేస్తూ రైతులందరికి హక్కు పత్రాలిచ్చే కార్యక్రమానికి నాంది పలికాం. ఇప్పటికే రెండు వేల రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి హక్కు పత్రాలిచ్చే కార్యక్రమం వేగంగా జరుగుతోంది. సుమారు 7 లక్షలకు పైగా భూహక్కు పత్రాలను అప్‌డేట్ చేసి రైతులకు అందించాం. సరిహద్దు రాళ్లను కూడా ఉచితంగా పాతే కార్యక్రమాన్ని రెండు వేల గ్రామాల్లో మే 20 నాటికి పూర్తి చేస్తాం. ఆ తర్వాత మే నెలాఖరు నుంచి మరో 2 వేల గ్రామాల చొప్పున మూడు నెలలకు ఒకసారి రెండు వేల గ్రామాల్లో పూర్తి చేసుకుంటూ వెళతాం. మనసున్న ప్రభుత్వంగా, రైతులకు మంచి జరగాలన్న ఆలోచనతో మనస్ఫూర్తిగా ఇవన్నీ చేస్తున్నాం.

రైతు బాంధవుల వేషం.. రావణ సైన్యం

నాలుగేళ్లుగా ప్రతి అడుగులో రైతులకు మంచి జరగాలన్న తపన, తాపత్రయంతో అడుగులు వేశాం. రైతులను చేయి పట్టుకుని నడిపించే విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం. వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పగటి పూటే 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్, సీజన్ ముగియక ముందే అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, భూరక్ష, ఈ–క్రాప్‌తోపాటు దళారులు లేకుండా ఆర్బీకేల స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నాం. పంట నష్టపోయినా ధాన్యం తడిసినా, రంగు మారినా కొనుగోలు చేస్తామని చెప్పాం. కేంద్రం ఎంఎస్పీ ఇవ్వని పంటలకు సైతం కనీస మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల్లో బోర్డులు ఏర్పాటు చేశాం. రైతన్నల కోసం మన ప్రభుత్వం ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారు. ఏటా కనీసం 300 మండలాల్లో కరువు తాండవిస్తున్నా రైతులను గాలికి వదిలేసిన చంద్రబాబు, ఆయనకు మద్దతు ఇస్తున్న దత్తపుత్రుడు ఇవాళ రైతు బాంధవుల వేషంలో రోడ్డెక్కారు. వారికి మద్దతుగా రావణ సైన్యం ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 వీళ్లంతా రామాయణంలో శూర్పణఖ మాదిరిగా రైతులపై దొంగ ప్రేమ నటిస్తున్నారు.

ప్యాకేజీలు.. పొలిటికల్ యాక్షన్

అక్షరాలా రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను తొలి సంతకంతో మాఫీ చేస్తానన్న చంద్రబాబు రైతులను నమ్మించి దగా చేశాడు. రుణమాఫీ దేవుడెరుగు.. చివరకు సున్నా వడ్డీ కూడా ఎగ్గొట్టిన ఘనుడు ఆయనే. వ్యవసాయం దండగన్న చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల భయంతో రోడ్డెక్కుతున్నారు. చంద్రబాబుకి డేట్లు ఇచ్చి ఆయన స్క్రిప్ట్ ప్రకారం డైలాగులు చెబుతూ పొలిటికల్ యాక్షన్ చేస్తూ ప్యాకేజీలు తీసుకుని నటిస్తున్న స్టార్ ఒకవైపు.. వారి డ్రామాలను రక్తి కట్టించేందుకు ఎల్లో మీడియా మరోవైపు పోటీ పడుతున్నాయి. ఎవరి డ్రామా వారు ఆడుతున్నారు.

నాలుగేళ్లుగా కొన్నదెవరు మరి?

ప్రతి రైతన్నకూ చెబుతున్నా. వీళ్ల డ్రామాలను నమ్మొద్దు. తాము వస్తేగానీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని చెబుతున్నారు. మరి నాలుగేళ్లుగా కొన్నది ఎవరు? రైతన్నలకు తోడుగా జగన్ ప్రభుత్వం కనిపిస్తున్నా వక్రీకరిస్తున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఏకంగా రూ.2.10 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాం. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. చివరికి మీ జగనన్నకు ఓటు వేయకపోయినా సరే.. అర్హత ఉంటే చాలు తోడుగా నిలిచాడు. ప్రతి పేదవాడికి తోడుగా ఉంటూ అడుగులు పడుతున్నాయి.

సంక్షేమ పథకాలు దండగట!

పేదలకు జగన్ ఉచితంగా డబ్బులు పంచిపెడుతున్నారని, ఇదంతా బాధ్యతారాహిత్యమంటూ టీడీపీ, గజదొంగల ముఠా చేస్తున్న ప్రచారాలను గమనించండి. వారి టీవీ డిబేట్లలోనూ ఇవే వార్తలు చూస్తున్నాం. గతంలో ఇదే ఈనాడు, ఎల్లో మీడియాలో సంక్షేమ పథకాలను రద్దు చేయాలని ఇద్దరు మాజీ ఐఏఎస్‌లతో చెప్పించారు. చంద్రబాబు మాటగా సంక్షేమ పథకాలు దండగని మొదటి పేజీలో అచ్చు వేసి చెప్పారు. అంటే చంద్రబాబుకు ఓటు వేయడమంటే ఇక పేదలెవరికీ పథకాలు రావనేదాని అర్థం. అందరూ దీనిపై ఆలోచన చేయండి.

కావలి కరువుతీరేలా వరాలు!

కావలి నియోజకవర్గానికి సంబంధించి టౌన్‌లో ట్యాంకు కెపాసిటీ పెంచి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేస్తే మంచి జరుగుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. అందుకు రూ.35 కోట్లు మంజూరు చేస్తున్నాం. కావలికి హైలెవల్ కెనాల్ నుంచి నీళ్లు రావడంలో ఇబ్బందులు ఉన్నందున సంగం బ్యారేజీ నుంచి లింక్ కెనాల్‌కు రూ.20 కోట్లు అడిగారు. అది కూడా మంజూరు చేస్తున్నాం. రూ.56 కోట్లతో కావలి ట్రంక్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మరో రూ.15 కోట్లు అదనంగా మంజూరు చేస్తున్నాం. కావలి మున్సిపాలిటీ 16 వార్డులో ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలకు మరో రూ.80 కోట్లు ఖర్చు చేయడానికి శ్రీకారం చుట్టబోతున్నాం.


'మా నమ్మకం నువ్వే జగన్' అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రైతులు, ప్రజలు

ఆదుకోవాలని వచ్చిన వారికి తక్షణ సాయం

సీఎం జగన్ ఆదేశాల మేరకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేత

ఆపదలో ఉన్న వారు సాయం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వద్దకు వస్తే ఆయన తక్షణమే స్పందించి చేయూతనిస్తుంటారు. గతంలో పలుచోట్ల నేరుగా బాధితుల వద్దకు వెళ్లి సాయం చేసిన సందర్భాలు కోకొల్లలు. అదేవిధంగా శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు తమ సమస్యలు చెప్పుకోగా వారికీ ఆర్థిక సాయం అందించి సీఎం మరోసారి తన గొప్ప మనస్సు చాటుకున్నారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

- నెల్లూరు (సెంట్రల్)



■ ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన మర్రిపూడి సుబ్బారావు అనే వికలాంగుడు ముఖ్యమంత్రిని కలిసి రోడ్డు ప్రమాదంలో కాలు దెబ్బతినిందని, తనకెవరూ లేరని, ఆర్థిక సాయంచేస్తే వైద్యం చేయించుకుంటానని చెప్పుకొచ్చాడు. సీఎం వెంటనే స్పందించి రూ.లక్ష ఆర్థిక సాయం అందేలా చూశారు.



■ పొదలకూరు మండలం ఊట్ల పాళెంకు చెందిన వెంకట అఖిల్ అనే వ్యక్తి తనకు వెన్నెముక ఆపరేషన్ జరిగిందని.. ఆరోగ్యం సరిగాలేదని, మరింత మెరుగైన వైద్యం చేయించుకునే స్థోమత లేదని ముఖ్యమంత్రికి విన్నవించుకున్నాడు. దీంతో సీఎం స్పందించి తక్షణ సాయం కింద రూ.లక్ష అందజేసేలా చూశారు.

■ కలిగిరికి చెందిన బత్తిన షణ్ముఖకుమార్ అనే చిన్నారిని తండ్రి శ్రీనివాసులు ముఖ్యమంత్రి వద్దకు తీసుకొచ్చారు. జన్యుపరమైన సమస్యతో ఎదుగుదలలేక ఇబ్బందులు పడుతున్నాడని, తమకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. దీంతో ముఖ్యమంత్రి స్పందించి మెరుగైన వైద్యం చేయించాలని కలెక్టర్‌కు సూచించి, తక్షణ సాయం కింద రూ.లక్ష నగదును అందేలా చేశారు.



■ సర్వేపల్లికి చెందిన దంపతులు తమ కుమార్తె నోసం అమూల్య అరుదైనవ్యాధితో బాధపడుతోందని నాలుగేళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి వారు తీసుకొచ్చారు. చలించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తక్షణ సాయంగా రూ.లక్ష అందించి, మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.





■ అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం వేల్పుచర్లవల్లపల్లి గ్రామానికి చెందిన పి. నాగరాజు అనే వికలాంగుడు ముఖ్యమంత్రికి తన వేదనను మొరపెట్టుకున్నాడు. తనకు కాలు, చెయ్యిలేదని ఆదుకోవాలని కోరాడు. ముఖ్యమంత్రి స్పందించి తక్షణమే ఆర్థిక సాయాన్ని అందిస్తూ అవసరమైన వైద్యాన్ని అందించేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు.



■ కావలికి చెందిన పోసిన వెంకట్రావు అనే వికలాంగుడు తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఆర్థిక సాయంచేయాలని ముఖ్యమంత్రికి విన్నవించుకున్నాడు. స్పందించిన వైఎస్ జగన్ తక్షణ ఆర్థిక సాయంగా రూ.లక్ష అందించేలా చేశారు.

■ కందుకూరు సమీపంలోని కళవళ్ల గ్రామానికి చెందిన దుగ్గిరాల రాధ తన ఇద్దరు చిన్నారులను తీసుకుని ముఖ్యమంత్రి వద్దకు వచ్చింది. తన భర్త దుగ్గిరాల రాఘవులుకు (గ్రామ సర్పంచ్) కిడ్నీలు చెడిపోయాయని, వైద్యం చేయించే ఆర్థిక స్థోమత తమకు లేదని, తన భర్తను ఆదుకోవాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన ముఖ్యమంత్రి.. అతనికి ఖర్చులు చూడాలని, మెరుగైన వైద్యం చేయించాలని కలెక్టర్‌కు సూచించారు. తక్షణ ఆర్థిక సాయం కింద రూ.లక్ష చెక్కును అందచేశారు. అలాగే, కిడ్నీ బాధితులకు ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేల పింఛన్ వెంటనే మంజూరు చేయాలని కూడా అధికారులను సీఎం ఆదేశించారు.



మా భవిష్యత్తు నీవే అన్నా...

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఏళ్ల తరబడి చుక్కల భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు సీఎం వైఎస్ జగన్ మేలు చేశారు. నెల్లూరు జిల్లాలో 43 వేల ఎకరాలను చుక్కల భూముల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

20 ఏళ్లుగా తిరుగుతున్నా సాధ్యం కాలేదు



రెండెకరాల భూమికి హక్కులు లేక రెవెన్యూ అధికారుల చుట్టూ 20 ఏళ్లుగా కాళ్లరిగేలా తిరిగాను. జగనన్న వచ్చాక చుక్కల భూముల చిక్కులు శాశ్వతంగా పరిష్కరించారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. నా భార్య వికలాంగురాలు. పెన్షన్ ఇవ్వమని గత ప్రభుత్వంలో అడిగితే ఖాళీ ఉంటే ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. కానీ, జగనన్న పాలనలో నా ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. నా పిల్లలకు విద్యా దీవెన, వసతి దీవెన వస్తున్నాయి. నేను రెండు ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. మీరు అధికారంలోకి వచ్చాక మూడుసార్లు నాకు పెట్టుబడి సాయం అందింది.

– మద్దెల ప్రసాద్, రైతు, ముంగమూరు, బోగోలు మండలం, నెల్లూరు జిల్లా

భూమికి హక్కులు కల్పించి లక్షాధికారిని చేశారు



మాకు మూడెకరాల పొలం ఉంది. కానీ, దానిపై హక్కులు లేవు. మీరు ఈ రోజు మాకు ఆ భూమిపై హక్కులు కల్పిస్తున్నారు. నన్ను మీరు రూ.50 లక్షల విలువైన పొలానికి వారసురాలిని చేశారు. నేనే కాదు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మఒడి పథకం వస్తుంది. దాంతో వారు చక్కగా చదువుకుంటున్నారు. పిల్లలకు గోరు ముద్ద పథకం ద్వారా మంచి భోజనం ఇస్తున్నారు. మేం తల్లిదండ్రులుగా కూడా ఆలోచించని విధంగా మీరు మేనమామగా ఆలోచించి చేస్తున్నారు. మీరే మళ్లీ సీఎం కావాలి. మేమంతా మీ వెనకే ఉంటాం.

– మమత, మహిళా రైతు, జక్కేపల్లి గూడూరు, నెల్లూరు జిల్లా

'మహాయజ్ఞం'లో ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: సనాతన ధర్మాలను గౌరవిస్తూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజలందరికీ ఆయురారోగ్య ఐశ్వర్య ప్రాప్తి కోసం రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ మహాయజ్ఞ కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఆరు రోజుల పాటు కొనసాగనున్న అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రారంభమైంది. 'సమస్త ప్రజానాం క్షేమ, స్థైర్య, విజయ, అభయ, ఆరోగ్య, ఐశ్వర్య అభివృద్ధ్యర్థం ...' అంటూ సీఎం వైఎస్ జగన్ వేద పండితుల ఉచ్చారణల మధ్య సంకల్పం చేపట్టడంతో యజ్ఞ కార్యక్రమాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి దంపతులతో పాటు వారి పిల్లల గోత్ర నామాలతో వేద పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞశాలలో ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ మహాలక్ష్మీ దేవి విగ్రహం ముందు స్వర్ణలక్ష్మీ అమ్మవారి ప్రతిమకు సీఎం జగన్ పంచామృతాలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహానికి హారతి ఇచ్చారు. ముఖ్యమంత్రికి కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి ఆశీర్వచనం అందజేశారు.

కపిల గోవుకు పూజలు

యజ్ఞ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం జగన్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వివిధ ఆగమాలకు అనుగుణంగా యజ్ఞశాల చుట్టూ కలియ తిరిగిన సీఎం జగన్ వేద పండితులు, రుత్వికులకు అభివాదం చేశారు. గోశాలలో కపిల గోవుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి వెళ్లే సమయంలో భక్తులను పలుకరించి మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు యజ్ఞ దీక్షాధారణ స్వీకరించారు. మంత్రులు తానేటి వనిత, ఉషశ్రీచరణ్, జోగి రమేష్, అంబటి రాంబాబు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ నెల 17 వరకు యజ్ఞ కార్యక్రమాలు కొనసాగుతాయి.

క్లుప్తంగా...

టెన్త్ టాపర్లకు కలెక్టర్ విందు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్

విశాఖ విద్య : విద్యారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతోనే ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అనూహ్యమైన ఫలితాలు సాధించారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షల్లో 570 ఆపైన మార్కులు సాధించిన 63 మంది విద్యార్థులను శుక్రవారం నగరంలోని వీఎంఆర్‌డీ చిల్డ్రన్స్ ఎరీనాలో సన్మానించారు. తల్లిదండ్రులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను వేదికపైకి పిలిచి, వారి సమక్షంలో విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధతో విద్యా వ్యవస్థలో మార్పు మొదలైందన్నారు. విద్యాభివృద్ధికై ఇంత చక్కటి సంక్షేమ పథకాలు తన పదకొండేళ్ల సర్వీసులో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రభుత్వ స్కూళ్లు ఎలా ఉంటాయో తనకు తెలుసని, తన విద్యాభ్యాసమంతా ప్రభుత్వ స్కూళ్లలోనే సాగిందన్నారు. అలాంటి ప్రభుత్వ స్కూళ్లు నుంచి 600కు 592 మార్కులు తెచ్చుకోవడం అంటే మాటలు కాదన్నారు. నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని, ఇదే ఫలితాలకు గొప్ప నాంది అని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలసి కలెక్టర్, ఇతర అధికారులంతా విందు భోజనం చేశారు. సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డీవీ రమణ మూర్తి, డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రభంజనం

అమరావతి: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 498 మార్కులతో శ్రీ చైతన్య స్కూల్ మరోసారి రికార్డు సృష్టించింది. 497 మార్కులతో ఇద్దరు, 497 ఆపైన ముగ్గురు, 495 ఆపైన ఐదుగురు, 490 ఆపైన 46 మంది, 480 ఆపైన 442 మంది, 470 ఆపైన 1,136 మంది శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు మార్కులు సాధించినట్లు శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. శ్రీ చైతన్యలో 89 శాతం బ్రాంచిలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2 శాతంగా పేర్కొన్నారు. సబ్జెక్టులవారీగా స్టేట్ టాప్ మార్కులతోపాటు అత్యధిక యావరేజ్, పాస్ పర్సంటేజితో ఆలిండియాలోనే కాదు.. ఆయా రాష్ట్రాల్లో తామే నంబర్ 1 గా ఉన్నట్లు తెలిపారు. ఐఐటీ, జేఈఈ, నీట్, ఒలింపియాడ్ వంటి జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లోనూ టాప్ ర్యాంకులతో నంబర్ 1గా నిలుస్తూ స్టేట్ ఎస్సెస్సీలో, సీబీఎస్‌ఈలో సంచలనాత్మక ఫలితాలతో శ్రీ చైతన్య టెక్నో స్కూల్-టెక్నో కరిక్యులమ్ పాఠశాల విద్యకి అసలైన నిర్వచనంగా నిలిచిందన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను శ్రీ చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డా. బీఎస్ రావు అభినందించారు.

గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: సీబీఎస్‌ఈ 10వ తరగతి ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కృష్ణా జిల్లా గుడివాడలోని ఆ పాఠశాల కరస్పాండెంట్ వీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం.మణిదీప్ 500 మార్కులకు 486, సీహెచ్ సిద్దార్థ 485 మార్కులు సాధించారని చెప్పారు. 480 పైబడి ఆరుగురు, 475కి పైగా 20 మంది, 470కి పైబడి 37 మంది, 460కి పైబడి 74 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు.

మరింత సమర్థంగా 'ప్రత్యక్ష నగదు బదిలీ'

అమలుకు సమన్వయ కమిటీల ఏర్పాటు

- సీఎం అధ్యక్షతన పలువురు మంత్రులతో రాష్ట్ర స్థాయి కమిటీ
- ప్రత్యక్ష నగదు బదిలీ విస్తృత విధానాలు, లక్ష్యాలు, వ్యూహాల రచన
- రాష్ట్ర కమిటీ నిర్ణయాల అమలుకు ఎగ్జిక్యూటివ్ కమిటీ
- సీఎస్ అధ్యక్షత వహించే ఎగ్జిక్యూటివ్ కమిటీలో పలువురు అధికారులు
- ఐటీ శాఖ ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: ప్రజా సంక్షేమంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. పథకాల అమలులో పారదర్శకతకు, నిష్పాక్షికతకు పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగా ప్రతి పథకాన్ని ప్రతి లబ్ధిదారుకి ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా అందిస్తోంది. దీని ద్వారా అవినీతి, ఆశ్రితపక్షపాతానికి తావు లేకుండా పథకం ఫలాలు ప్రజలకు అందుతున్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీని మరింత సమర్థంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన పలువురు మంత్రులు సభ్యులుగా రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. అలాగే రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అధ్యక్షతన పలు శాఖల అధికారులు సభ్యులుగా ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. 'ప్రత్యక్ష నగదు బదిలీకి అత్యంత సానుకూల ప్రభావం ఉన్న నేపథ్యంలో పథకాల వర్క్‌ఫ్లోను నిరంతరం క్రమబద్ధీకరించడంతో పాటు కొత్తగా వస్తున్న సాంకేతికతలను స్వీకరించడం, వివిధ విభాగాలను సమన్వయం చేయడం, లీకేజీలను తగ్గించడం బదిలీ వ్యయాన్ని తగ్గించడం ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నవరత్నాల్లోని పలు పథకాలను ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంది. వివిధ పథకాల లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా ఆర్థిక సాయం అందుతోంది. సమర్థంగా, పారదర్శకంగా, జవాబుదారీగా ఎటువంటి లీకేజీ లేకుండా ప్రత్యక్ష నగదు బదిలీ అమలవుతోంది అనడానికి లబ్ధిదారులే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నారు. అలాగే ఈ విధానం సామాజిక శ్రేయస్సుపై సానుకూల ప్రభావం చూపుతోంది. లబ్ధిదారులతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తోంది. ఇలాంటి ప్రత్యక్ష నగదు బదిలీని మరింత సమర్థంగా అమలు చేయడం కోసమే సమన్వయ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది' అని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

రాష్ట్రస్థాయి ప్రత్యక్ష నగదు బదిలీ కమిటీ

ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, ఐటీ, పరిశ్రమలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, కార్మిక, ఉపాధి, శిక్షణ, మహిళా, శిశు అభివృద్ధి శాఖల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా ఉంటారు. ఈ కమిటీకి ముఖ్యమంత్రి ఏ మంత్రినైనా లేదా నిపుణులనైనా ఆహ్వానించవచ్చు.

రాష్ట్రస్థాయి కమిటీ లక్ష్యాలు

రాష్ట్రస్థాయి కమిటీ ప్రత్యక్ష నగదు బదిలీకి విస్తృత దృష్టితో దిశను నిర్ధారిస్తుంది. ప్రత్యక్ష నగదు బదిలీ విస్తృత విధానాలు, లక్ష్యాలు, వ్యూహాలను రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయిస్తుంది. మరింత సమర్థత, పారదర్శకత, జవాబుదారీ పెంపొందించే లక్ష్యాలను నిర్ధారిస్తుంది.

ఎగ్జిక్యూటివ్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఆర్థిక శాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్, పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక సీఎస్, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, కార్మిక శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రణాళికా శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి సభ్య కన్వీనర్‌గా ఉంటారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ లక్ష్యాలు

ఎగ్జిక్యూటివ్ కమిటీ రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయాల అమలుకు చర్యలు తీసుకుంటుంది. రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయాలను నిరంతరం పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడానికి చర్యలు తీసుకుంటుంది.

19న అగ్రశ్రీ పురస్కారాల ప్రదానం

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, కేంద్ర మంత్రిగా, భారత రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించిన డాక్టర్ నీలం సంజీవరెడ్డి 110వ జయంతిని పురస్కరించుకుని భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ (అగ్రశ్రీ) ఆధ్వర్యంలో ఈనెల 19న డాక్టర్ నీలం సంజీవరెడ్డి రాష్ట్రస్థాయి పురస్కారాలను అందించనున్నట్లు అగ్రశ్రీ సంచాలకులు డాక్టర్ సుందరరామ్ తెలిపారు. తిరుపతిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో 19వ తేదీ సాయంత్రం ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. డాక్టర్ నీలం సంజీవరెడ్డి విశిష్ట రత్న పురస్కారానికి మాజీ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ మాజీ అధ్యక్షుడు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జి.ఎతిరాజులు (న్యాయ శిరోమణి), అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చొప్ప గంగిరెడ్డి (విద్యా శిరోమణి), సిమ్స్ యూనివర్సిటీలో ప్రముఖ కార్డియాలజిస్ట్ ఆచార్య డి.రాజశేఖర్ (వైద్య శిరోమణి), పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు (పంచాయతీరాజ్ శిరోమణి) ఎంపికయినట్లు ప్రకటించారు.

టీడీపీవి బురద రాజకీయాలు

- పచ్చ మీడియాను అడ్డంపెట్టుకుని కుయుక్తులు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ (భీమిలి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తూ అన్ని వర్గాలకు మేలు చేస్తున్నారని, అయినా ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ నేతలు మాత్రం బురద రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. మధురవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రతిభా పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను మంత్రి, ఎమ్మెల్యే సన్మానించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో ఉన్న గురుకులాల్లో ఉత్తమ సేవలు అందించిన 31 మంది హెల్త్ సూపర్ వైజర్లకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. అనంతరం మేరుగు నాగార్జున మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ పెడతామనే వంకతో ఉన్న హాస్టల్స్ తీసేసి పేదలు చదువుకోలేని పరిస్థితుల్లోకి నెట్టివేశారని చెప్పారు. ఈ సెలవుల్లో 'నాడు-నేడు' ద్వారా సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌కు మరమ్మతులు చేస్తామన్నారు.

చంద్రబాబు చర్చకు సిద్ధమా..?

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్లలో ఈ రాష్ట్రాన్ని ఎంతగా కొల్లగొట్టి గుల్ల చేశాడో ప్రజలంతా ఆలోచించాలని మంత్రి నాగార్జున కోరారు. చంద్రబాబు పచ్చ మీడియా సంస్థలను అడ్డం పెట్టుకుని బురద రాజకీయాలు చేయడమే కాకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా తలుపుతట్టి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. సాంఘిక సంక్షేమం, దళితుల అభ్యున్నతి, సంక్షేమంపై దమ్ముంటే చర్చకు రావాలని చంద్రబాబుకు మేరుగు నాగార్జున సవాల్ చేశారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విజయభేరి

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్‌ఈ బోర్డు శుక్రవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు ఆంధ్ర, తెలంగాణాల్లో విజయభేరి మోగించినట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థిని ఉమాశంకర్ తారికాశ్రీ 500 మార్కులకు గాను 492 మార్కులు సాధించి భాష్యంకు గర్వకారణంగా నిలిచిందన్నారు. 475కు పైగా 34 మంది, 450కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 105 మంది ఉన్నారని వివరించారు. విద్యార్థులను భాష్యం రామకృష్ణతో పాటు డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

'శ్రీప్రకాష్' ప్రతిభ

తుని: సీబీఎస్‌ఈ ఫలితాల్లో కాకినాడ జిల్లా తుని శ్రీప్రకాష్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తెలిపారు. సీబీఎస్‌ఈ పది, ఇంటర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు 90 శాతం విద్యార్థులు ప్రథమ శ్రేణిలో విజయకేతనం ఎగుర వేశారని చెప్పారు. పదిలో పలువురు విద్యార్థులు 98 శాతం, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 90 శాతానికి పైగా మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్‌లు అభినందించారు.

చంద్రబాబుది రాజకీయ దురుద్దేశ యాత్ర

- ధాన్యం కొనలేదని ఒక్క రైతు చెప్పలేదు
- అకాల వర్షాలను రాజకీయాలకు వాడుకుంటున్న దుర్మార్గుడు బాబు
- మంత్రి కారుమూరి ఆగ్రహం



తణుకు అర్బన్: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు చేసేది రైతు పోరుబాట యాత్ర కాదని, అది రాజకీయ దురుద్దేశ యాత్ర అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క రైతు కూడా తన ధాన్యం కొనలేదని అనకపోయినా.. కేవలం ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అకాల వర్షాలను సైతం రాజకీయానికి వాడుకుంటున్న దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తన సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని తణుకులో ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు చంద్రబాబు 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఇక్కడ యాత్రలు చేశారని దుయ్యబట్టారు. తన సామాజికవర్గానికి చెందినవారు బాగుండాలనే దురుద్దేశమే చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో శాపం కానుందని హెచ్చరించారు. రైతుల వద్ద ధాన్యాన్ని 72 గంటల్లో కొనుగోలు చేయకపోతే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఆయన అల్టిమేటం ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొటనవేలి వెంట్రుక కూడా చంద్రబాబు పీకలేడని కారుమూరి స్పష్టంచేశారు. అసలు తన ధాన్యం కొనలేదనే రైతే లేడంటే... అర్థం లేని అల్టిమేటంలు ఇవ్వడం దుర్మార్గపు రాజకీయ ఎత్తులేనని అన్నారు. బీసీ వర్గానికి చెందినవాడిని కాబట్టే తన గురించి చంద్రబాబు చులకనగా మాట్లాడారని కారుమూరి మండిపడ్డారు. ఇరగవరంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఒక కాపు యువకుడు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అతనిని బహిరంగంగా దొంగగా చిత్రీకరించడం చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణలకే చెల్లిందన్నారు. ఏ కులమని అడిగి మరీ తిట్టే చంద్రబాబు రాజకీయాలు ప్రజలందరికీ తెలుసని, గతంలో నాయీ బ్రాహ్మణులను తోకలు కట్ చేస్తానని, ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా.. అని చులకనగా మాట్లాడి కులాలపరంగా మనోభావాలు దెబ్బతినేలా చేసే నీచుడు చంద్రబాబు... అని మండిపడ్డారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చిల్లకూరు (తిరుపతి జిల్లా): 2014లో మతిస్థిమితం లేని ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి గురువారం రాత్రి నెల్లూరు పోక్సో కోర్టు జడ్జి సుమ నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. రూరల్ సీఐ దశరధరామారావు శుక్రవారం వెల్లడించిన వివరాల మేరకు 2014వ సంవత్సరం అక్టోబర్‌లో చిల్లకూరు గ్రామానికి చెందిన ఓ మతి స్థితిమితం లేని బాలిక ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన చిల్లకూరు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన ఆటోలో ఆమెను బలవంతంగా ఎక్కించుకుని గ్రామానికి కొంత దూరంలో ఉన్న ముళ్ల పొదల వద్దకు తీసుకెళ్లి రాత్రంతా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఉదయం యువతిని ఇంటికి తీసుకొచ్చి వదలివేశాడు. ఆమె తల్లిదండ్రులు జరిగిన దారుణం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పట్లో ఎస్‌ఐగా ఉన్న దశరధరామారావు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి నెల్లూరులోని పోక్సో ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు.

ట్రిపుల్ ఐటీలకు జూన్ 4 వరకు వేసవి సెలవులు

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఈ నెల 14 నుంచి జూన్ 4వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు చాన్సలర్ కార్యాలయ వర్గాలు శుక్రవారం తెలిపాయి. మరల ట్రిపుల్ ఐటీలు జూన్ 5న పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నాయి. ఈ నెల 13న క్యాంపస్‌ల నుంచే ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లువివరించాయి.

కొత్తగా 1,489 ఆర్టీసీ బస్సులు

- రూ.670 కోట్లతో కొనుగోలు
- జ్యుడీషియల్ ప్రివ్యూకు టెండర్లు

సాక్షి, అమరావతి: ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సేవలందించేందుకు ఆర్టీసీ కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ చేపట్టింది. కొత్తగా 1,489 బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దూర ప్రాంతాలు, అంతర్రాష్ట్ర సర్వీసుల కోసం ఈ బస్సులను కొనుగోలు చేయనుంది. డీలర్ల వద్ద నుంచి కాకుండా నేరుగా బస్సుల తయారీ కంపెనీల నుంచే వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక్కో బస్ ఖరీదు దాదాపు రూ.45లక్షల చొప్పున మొత్తం రూ.670కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కాగా టెండర్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు జ్యుడీషియల్ ప్రివ్యూకు ఆర్టీసీ నివేదించింది. టెండర్ డాక్యుమెంట్లను జ్యుడీషియల్ ప్రివ్యూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. టెండరు నిబంధనలు, ఇతర అంశాలపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలను ఈమెయిల్ ద్వారా తెలిపేందుకు ఈ నెల 19 సాయంత్రం 5గంటల వరకు అవకాశం ఇచ్చారు.

- టెండర్ పత్రాలు అందుబాటులో ఉంచిన జ్యుడీషియల్ ప్రివ్యూ వెబ్‌సైట్ www.judicialpreview. ap.gov.in
- టెండర్ల ప్రక్రియపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలిపేందుకు ఈమెయిల్స్ పంపాల్సిన జ్యుడీషియల్ ప్రివ్యూ ఈమెయిల్ ఐడీలు judge&jpp@ap.gov.in, apjudicialpreview@-gmail.com

రైతు భరోసాకు 18వరకు దరఖాస్తుల స్వీకరణ

▶ మొదటి పేజీ తరువాయి

ఎవరైనా అనర్హులున్నట్టుగా గుర్తించినట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకురావచ్చన్నారు. అలాగే అర్హతలు ఉండి ఇంకా దరఖాస్తు చేసుకోనివారు ఎవరైనా ఉంటే ఈ నెల 15 నుంచి 18 వరకు అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. దీన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతేడాది లబ్ధి పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదని తెలిపారు. వారికి ఈ ఏడాది కూడా యధావిధిగా రైతు భరోసా సాయం అందుతుందన్నారు. గతేడాది లబ్ధి పొంది ప్రస్తుతం మరణించినట్టైతే వారి భార్య లేదా భర్త నామినీగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. భూమికి సంబంధించిన పత్రాలు, ఆధార్ కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

వర్క్ ఇన్‌స్పెక్టర్, ఆర్‌ఐలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

సాక్షి, అమరావతి/లావేరు/ పెనమలూరు: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి లంచాలు తీసుకుంటున్న ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారు. శ్రీకాకుళం జిల్లా వల్లిపేటలో జగనన్న గృహ నిర్మాణ పథకం లబ్ధిదారునికి బిల్లులు మంజూరు చేసేందుకు గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.కన్నంనాయుడు రూ.13 వేలు లంచం డిమాండ్‌ చేశారు. దాంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆపై బాధితుడి నుంచి రూ.13 వేలు లంచం తీసుకుంటూ ఉండగా వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.కన్నం నాయుడును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అలాగే కృష్ణా జిల్లా తాడిగడపలో ఇంటికి అసెస్‌మెంట్ నంబర్ కేటాయించేందుకుగాను మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యరకరాజు వెంకటసుబ్బరాజు రూ.6 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి నుంచి ఆర్‌ఐ తరఫున రూ.నాలుగు వేలు లంచం తీసుకుంటున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కె.నాగబాబును పట్టుకున్నారు.

వంద శాతం జీఈఆర్ లక్ష్యం

- గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సేవలు వినియోగించుకోండి
- 18 నుంచి 23 సంవత్సరాల వయసు వారంతా కాలేజీల్లో చేరేలా చర్యలు
- కలెక్టర్లు, డీఈవోలకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ సూచన

సాక్షి, అమరావతి: విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో – జీఈఆర్) పెంచేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్లకు, డీఈవోలకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సూచించారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల స్థాయిలో 100 శాతం జీఈఆర్‌పై దృష్టి సారించాలని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆదేశించారు.

- గ్రామ, వార్డు సచివాలయాల మధ్య పోటీని సృష్టించి ఆయా సచివాలయాల పరిధిలో 100 శాతం జీఈఆర్ సాధించాలి. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో 1 సెప్టెంబర్ 2005 నుంచి 31 ఆగస్టు 2018 మధ్య జన్మించిన ప్రతి బిడ్డ 1 నుంచి 12వ తరగతి వరకు చదివి ఉత్తీర్ణత సాధించారా లేదా అని పరిశీలించాలి.
- పిల్లల వారీగా ట్రాకింగ్, 100 శాతం జీఈఆర్ సాధించిన సచివాలయాల సంఖ్యపై పర్యవేక్షణ ద్వారా చేరికల నిష్పత్తిని సమీక్షించాలి.
- ప్రతి సచివాలయం పరిధిలోని వలంటీర్ తమకు కేటాయించిన 50 గృహాలను సందర్శించి 1 సెప్టెంబర్ 2005 నుంచి 31 ఆగస్టు 2018 మధ్య జన్మించిన పిల్లల వివరాలు సేకరించి, 18 నుండి 23 సంవత్సరాల వయసు వారు కాలేజీలో చేరేలా చర్యలు చేపట్టాలి.
- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను కార్పొరేట్ స్థాయిలో అందించేందుకు ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు జీఈఆర్ పెంచేందుకు కృషిచేయాలి. వందశాతం అక్షరాస్యత, వంద శాతం జీఈఆర్ పెంపు లక్ష్యం దిశగా అధికారులు అడుగులు వేయాలి.


జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ


- 30 నుంచి పాఠశాలలకు సరఫరా ప్రారంభించాలి
- సమీక్షలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్ల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. ఈ నెల 30లోగా కిట్లను మండల స్టాకు పాయింట్ నుంచి నేరుగా పాఠశాలలకు తరలించేందుకు ముందుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల స్టాకు పాయింట్ వద్ద 'జేవీకే క్వాలిటీ వాల్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాటి ప్రకారం స్కూళ్లకు సరఫరా చేసిన కిట్లలో నాణ్యత లోపించిన వస్తువులను తిరస్కరించి.. వాటి వివరాలను డెలివరీ చలానాల్లో ఎంఈవో సంతకం చేసి జగనన్న విద్యాకానుక యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నాణ్యత లోపించిన వస్తువుల స్థానంలో కొత్తవాటిని వెంటనే భర్తీ చేయాలని సూచించారు. ఇప్పటికే 1,47,238 బ్యాగులు, 26,55,075 నోట్ పుస్తకాలు, 2,18,367 జతల బూట్లు, 9,21,796 యూనిఫాం, 4,01,762 బెల్టులు, 4,62,069 డిక్షనరీలు మండల స్టాకు పాయింట్లకు చేరాయన్నారు. సెమిస్టర్-1లో భాగంగా 3.54 కోట్ల పాఠ్యపుస్తకాలకు గానూ 1.94 కోట్ల పాఠ్య పుస్తకాలు జిల్లా కేంద్రాలకు అక్కడి నుంచి 1.24 కోట్ల పాఠ్య పుస్తకాలు మండల స్టాకు పాయింట్లకు చేరగా.. ఇంకా రవాణాలో 4,94,752 బ్యాగులు, 17,57,697 నోట్ పుస్తకాలు, 6,07,129 జతల బూట్లు, 5,44,956 యూనిఫాం, 2,95,951 బెల్టులు ఉన్నాయన్నారు. సమీక్షలో సమగ్ర శిక్షా పీడీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో ఇద్దరి మృతి

రోడ్డుపై మహిళను, పంట పొలంలో రైతును తొక్కిచంపిన ఏనుగులు





ఉష, శివలింగం (ఫైల్)


కుప్పంరూరల్ (చిత్తూరు జిల్లా): తమిళనాడు ప్రాంతం నుంచి ఆంధ్ర సరిహద్దు గ్రామాలైన కుప్పం మండలం పత్తిచేను, కృష్ణాపురం గ్రామాల వైపునకు వచ్చిన రెండు ఏనుగులు ఇద్దరిని బలితీసుకున్నాయి. మహిళను, రైతును తొక్కిచంపాయి. వారం రోజులుగా ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన తమిళనాడు అటవీ ప్రాంతంలో తిష్ట వేసిన పది ఏనుగుల గుంపు అక్కడి పొలాల్లో పంటలకు కాపలాగా ఉన్న ఓ రైతును తొక్కిచంపాయి. అప్రమత్తమైన తమిళ అటవీశాఖ అధికారులు ఏనుగులను ఆంధ్రా ప్రాంతం వైపు తరిమారు. గుంపు నుంచి తప్పిపోయిన రెండు ఏనుగులు గురువారం రాత్రి కుప్పం అటవీ ప్రాంత గ్రామాలైన పత్తిచేను, కృష్ణాపురం వైపు వచ్చాయి. అక్కడ పంటలను నాశనం చేస్తూ వేకువజామున గ్రామాల సమీపానికి వచ్చాయి. ఈ క్రమంలో మల్లానూరులో రైలు ఎక్కేందుకు వేకువ జామున 5 గంటలకు పత్తిచేను గ్రామానికి చెందిన ఉష (42) వస్తుండగా బండెప్పకొట్టాలు గ్రామం వద్దకు రాగానే అక్కడే తిష్టవేసిన ఏనుగులు రోడ్డుపై అడ్డగించి ఆమెను తొక్కి చంపాయి. అక్కడి నుంచి కృష్ణాపురం వైపు మళ్లిన జంట ఏనుగులు గ్రామ సమీపంలో పంటకు కాపలా ఉన్న శివలింగం (65) పొలం వద్దకు వెళ్లాయి. ఏనుగులను చూసి భయపడిన శివలింగం కేకలు వేయడంతో అరుపులు విన్న ఏనుగులు అతన్ని తొక్కి పంట పొలంలోనే చంపాయి. ఇద్దరి మృతదేహాలకు శుక్రవారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఏనుగుల దాడిలో చేతికొచ్చిన పంటలు నాశనమయ్యాయి. నాయకనేరి కొట్టాలు గ్రామంలో ఎకరా వరి పొలంతో పాటు 20 మామిడి చెట్లు ధ్వంసమయ్యాయి. అక్కడక్కడా అరటి, టమాటా పంటలకు నష్టం చేకూర్చాయి. రెవెన్యూ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలసాయం

జంట ఏనుగుల దాడిలో మృతి చెందిన ఉష, శివలింగం కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. ఘటన జరిగిన వెంటనే ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున ప్రభుత్వం తరఫున ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ భరత్ ప్రకటించారు. ఘటన వివరాలను అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోగా.. మంత్రి ఉదారంగా స్పందించి మరో ఐదు లక్షల చొప్పున మృతుల కుటుంబాలకు ప్రకటించారు. దీంతో ఒక్కొక్కరికి ప్రభుత్వం తరఫున పది లక్షల రూపాయల సాయం అందనుంది.

విద్యుదాఘాతంతో నాలుగు గజరాజుల మృతి

- పార్వతీపురం మన్యం జిల్లాలో ఘటన
- నీటికోసం వచ్చి బలైన ఏనుగులు



ఘటనా స్థలంలో ఏనుగుల కళేబరాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: తాగునీటి కోసం పొలాల్లోకి వచ్చిన నాలుగు ఏనుగులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం పక్కుడుభద్ర గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. ఒక గున్న ఏనుగు, ఐదు పెద్ద ఏనుగుల గుంపు గత ఫిబ్రవరిలో ఒడిశా సరిహద్దులోని అడవుల్లోంచి భామిని మండలంలోకి వచ్చింది. మూడు నెలలుగా ఇక్కడి అడవుల్లో ఉంటూ ఆహారం, తాగునీటి కోసం సమీప పొలాల్లోకి వస్తుండేవి. ఎవరికీ హాని చేయకపోవడంతో వాటిని చూసేందుకు పార్వతీపురం మన్యం జిల్లావాసులే కాకుండా ఒడిశా నుంచి కూడా వస్తుండేవారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి పక్కుడుభద్ర గ్రామ సమీపంలోని పొలాల్లోకి వచ్చాయి. బొమ్మిక మిన్నారావుకు చెందిన బోరుబావి వద్దకు వెళ్లేందుకు యత్నించాయి. ఆ పక్కనే ఉన్న త్రీఫేజ్ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను గున్న ఏనుగు తన తొండంతో లాగింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై విలవిలలాడుతున్న గున్న ఏనుగును రక్షించేందుకు మరో మూడు పెద్ద ఏనుగులు ప్రయత్నించాయి. దీంతో నాలుగూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. వాటిని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు వేలాది సంఖ్యలో పోటెత్తారు. నాలుగు ఏనుగుల కళేబరాలకు విశాఖ జూ వైద్యాధికారి శ్రీనివాసరావు బృందం పోస్టుమార్టం నిర్వహించింది. ఘటన స్థలంలోనే వాటిని ఖననం చేసేందుకు రైతు మిన్నారావు అంగీకరించడంతో జేసీబీలతో పెద్ద గోతులు తీయించి కళేబరాలను ప్రొటోకాల్ ప్రకారం ఖననం చేశారు. విశాఖ రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకంతనాథరెడ్డి, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.

గ్రూప్‌-4 అభ్యర్థుల మార్కుల జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రెవెన్యూ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌ కమ్‌ కంప్యూటర్‌ అసిస్టెంట్‌ (గ్రూప్‌-4) ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో అభ్యర్థుల మార్కుల జాబితాను విడుదల చేసి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆంధ్రప్రదేశ్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. తదుపరి నియామక ప్రక్రియను ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా నిర్వహిస్తామని పేర్కొంది.

222 మంది ఎస్‌పీఎఫ్‌ సిబ్బందికి వైద్య పరీక్షలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న స్పెషల్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ (ఎస్‌పీఎఫ్‌) సిబ్బందికి శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్‌పీఎఫ్‌ కార్యాలయ ఆవరణలో సుమారు 222 మందికి కంటి, దంత వైద్య పరీక్షలు చేశారు. తొలుత మ్యాక్స్‌విజన్‌ కంటి ఆస్పత్రి, ప్రసాద్‌ దంత వైద్యశాలకు చెందిన వైద్యులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నిత్యం విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి మంచి ఆరోగ్యం ఉండాలనే ఉద్దేశంతో హోంశాఖ కార్యదర్శి హరీష్‌కుమార్‌ గుప్తా, ఎస్‌పీఎఫ్‌ డీజీ బీవీ రామిరెడ్డి సూచనలతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కమాండెంట్‌ కేఏన్‌ రావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చీఫ్‌ సెక్యూరిటీ అధికారి కె.కృష్ణ మూర్తి, ఇన్‌స్పెక్టర్‌ వీఎస్‌ నారాయణ పర్యవేక్షించారు.

మద్రాసు ఐఐటీలో పీఎస్‌ మెడికల్‌ సైన్స్‌ అండ్‌ ఇంజినీరింగ్‌ కోర్సు

సాక్షి, చెన్నై: మద్రాసు ఐఐటీలో పీఎస్‌ మెడికల్‌ సైన్స్‌ అండ్‌ ఇంజినీరింగ్‌ కోర్సును శుక్రవారం ప్రవేశపెట్టారు. దేశంలోనే తొలిసారిగా ఇక్కడ ఈ కోర్సును ప్రారంభించినట్లు ఐఐటీ డైరెక్టర్‌ కామకోటి తెలిపారు. వైద్య విజ్ఞాన, సాంకేతిక అంశాలతో ఈ కోర్సు ఉంటుందన్నారు.

‘రీ సర్వే’ను మోడల్‌గా తీసుకున్న ఉత్తరాఖండ్‌

అక్కడి అధికారులకు శిక్షణ ఇచ్చిన ఏపీ సర్వే అకాడమీ వైస్‌ ప్రిన్సిపాల్‌


డెహ్రాడూన్‌లో జరిగిన వర్క్‌షాప్‌

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వే ప్రాజెక్టును ఉత్తరాఖండ్‌ ప్రభుత్వం మోడల్‌గా తీసుకుంది. ఆ రాష్ట్రంలో నిర్వహిస్తున్న భూ రికార్డుల ఆధునికీకరణ నేపథ్యంలో ఏపీలో రీ సర్వే జరుగుతున్న తీరును పూర్తిగా అధ్యయనం చేసింది. ఉత్తరాఖండ్‌ అధికారులకు సైతం ఏపీ అధికారులతో ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించింది. ఇందులో భాగంగా శుక్రవారం డెహ్రాడూన్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో ఏపీ సర్వే అకాడమీ వైస్‌ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌వీఎస్‌ఎన్‌ కుమార్‌ రీ సర్వే ప్రాజెక్టుపై ప్రజెంటేషన్‌ ఇచ్చారు. ముస్సోరిలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన లాల్‌ బహదూర్‌ శాస్త్రి నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ అడ్మినిస్ట్రేషన్‌ పరిధిలోని బీఎన్‌ యుగంధర్‌ సెంటర్‌ ఫర్‌ రూరల్‌ స్టడీస్‌ ఈ వర్క్‌షాప్‌ నిర్వహించింది. హైబ్రీడ్‌ టెక్నాలజీ ద్వారా ఆధునిక భూముల సర్వే నిర్వహణలో ఏపీకి అపారమైన అనుభవం ఉన్న దృష్ట్యా తాము నిర్వహించే వర్క్‌షాప్‌లో ఉత్తరాఖండ్‌ రెవెన్యూ అధికారులకు దీనిపై శిక్షణ ఇవ్వాలని ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో సీహెచ్‌వీఎస్‌ఎన్‌ కుమార్‌ను భూపరిపాలన శాఖ అధికారులు అక్కడికి పంపడంతో ఆయన రీసర్వే ప్రాజెక్టుపై ప్రజెంటేషన్‌తోపాటు వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. డ్రోన్లు, విమానాల ద్వారా సర్వే నిర్వహిస్తున్న తీరు, గ్రౌండ్‌ ట్రూతింగ్‌, వివాదాల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మొబైల్‌ మెజిస్ట్రేట్లు, భూ హక్కు పత్రాల పంపిణీ వంటి పలు అంశాల గురించి వివరించారు.

చట్టప్రకారం జీఓ-1పై మార్గదర్శకాలు రూపొందించుకోవచ్చు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ ఏడాది జనవరి 2న జారీచేసిన జీఓ-1ని హైకోర్టు రద్దుచేసింది. ఈ జీఓ చట్ట విరుద్ధమని తెలిపింది. అయితే, ఈ వ్యవహారంపై భవిష్యత్తులో చట్టానికి అనుగుణంగా తగిన మార్గదర్శకాలు రూపొందించుకోవచ్చునంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ప్రశాంత్‌కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజుల ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. జీఓ-1ని సవాలు చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాకా రామకృష్ణ సంక్రాంతి సెలవుల్లో పిల్‌ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, టీడీపీ నేతలు కొల్లు రవీంద్ర, కన్నా లక్ష్మీనారాయణ మరికొందరు కూడా హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఇదే సమయంలో రోడ్‌షోల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించడంలేదని, రాజకీయ సభలు, రోడ్‌షోలకు అనుమతినివ్వకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు బాలగంగాధర్‌ తిలక్‌ మరో పిల్‌ దాఖలు చేశారు. వీటిపై సుదీర్ఘ విచారణ జరిపిన ధర్మాసనం శుక్రవారం తన తీర్పు వెలువరించింది.

వాక్‌ స్వాతంత్ర్యపు హక్కే ఉత్కృష్టమైంది..

‘అన్ని స్వేచ్ఛల్లోకెల్లా వాక్‌ స్వాతంత్ర్యపు హక్కు ఉత్కృష్టమైంది. నిర్వాహకులు తలపెట్టిన సమావేశం, ధర్నాలు, ఊరేగింపుల వల్ల శాంతికి విఘాతం కలుగుతుందని సంబంధిత అధికారి భావిస్తే, ఆ సమావేశాలు, ఊరేగింపుల నిర్వహణకు లైసెన్స్‌ తీసుకోవాలని, తాము విధించే షరతులకు లోబడి ఉండాలని నిర్వాహకులకు స్పష్టం చేయవచ్చు. పబ్లిక్‌ రోడ్లు, వీధులపై ఆటంకాలు సృష్టిస్తే, వాటిని అడ్డుకునే అధికారం సంబంధిత అధికారికి ఉంది. కానీ, బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ఈ చట్టం ద్వారా పూర్తిగా నియంత్రించలేరు. జాతీయ, మున్సిపల్‌, పంచాయతీ రహదారులపై సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తే వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఈ జీఓ జారీచేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి ప్రభుత్వానిది మంచి ఉద్దేశమే. కానీ, వాస్తవం ఏమిటంటే, రోడ్లపై శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కులను ఉన్నత న్యాయస్థానాలు దశాబ్దాల క్రితమే గుర్తించాయి. ఓ ప్రమాదం లేదా ఘటనను సమావేశం లేదా ఊరేగింపు హక్కును హరించేందుకు కారణంగా చూపడానికి వీల్లేదు. ఈ సమావేశాలు, ఊరేగింపులకు మన రాజకీయ జీవితంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది’.. అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

విశాఖ సిగలో మరో మణిహారం

రూ.197 కోట్లతో రేర్‌ ఎర్త్‌ పర్మినెంట్‌ మాగ్నెట్‌ ప్లాంట్‌ ప్రారంభం

- ఇందులో అరుదైన భూ అయస్కాంతాల ఉత్పత్తి
- టెలీకమ్యూనికేషన్స్‌, ఈవీలు, మైక్రో ఎలక్ట్రానిక్స్‌, విండ్‌ టర్బైన్‌లు, యుద్ధ విమానాల్లో వీటి వినియోగం
- 3,000 కిలోల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ ఏర్పాటు
- వర్చువల్‌ విధానంలో ఆర్‌ఈపీఎంని జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ


నిర్మాణం పూర్తయిన రేర్‌ ఎర్త్‌ పర్మినెంట్‌ మాగ్నెట్‌ ప్లాంట్‌

సాక్షి, విశాఖపట్నం: భారతదేశ కీలక రక్షణ కేంద్రంగా ఇప్పటికే వెలుగొందుతున్న విశాఖపట్నం సిగలో మరో కీలక ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. యుద్ధ విమానాలు, ఆయుధాల్లో వినియోగించే అరుదైన అయస్కాంతాల తయారీ కేంద్రమైన రేర్‌ ఎర్త్‌ పర్మినెంట్‌ మాగ్నెట్‌ ప్లాంట్‌ (ఆర్‌ఈపీఎం) సేవలకు శ్రీకారం చుట్టారు. రూ.197 కోట్లతో ఇండియన్‌ రేర్‌ ఎర్త్‌ లిమిటెడ్‌ (ఐఆర్‌ఈఎల్‌) ఈ ప్లాంట్‌ని బాబా ఆటమిక్‌ రీసెర్చ్‌ సెంటర్‌ (బార్క్‌) ప్రాంగణంలో పూర్తిచేసింది. ఏడాదికి 3 వేల కిలోల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మితమైన ఈ ప్లాంట్‌ను నేషనల్‌ టెక్నాలజీ డే సందర్భంగా ప్రధాని మోదీ గురువారం జాతికి అంకితం చేశారు. అచ్యుతాపురంలోని ‘బార్క్‌’ కేంద్రం సమీపంలో 2.92 ఎకరాల విస్తీర్ణంలో ఆర్‌ఈపీఎం నిర్మాణ పనులు 2021లో ప్రారంభం కాగా.. ఈ ఏడాది మార్చిలో పూర్తయ్యాయి. ఈ ప్లాంట్‌ను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఐఆర్‌ఈఎల్‌ దీనిని ఆత్మనిర్భర్‌ భారత్‌లో భాగంగా నిర్మించింది. ఏడాదికి 3 వేల కిలోల అరుదైన అయస్కాంతాల ఉత్పత్తి సామర్థ్యంలో ప్లాంట్‌ సేవలు మొదలయ్యాయి.

యుద్ధ విమానాల్లో వినియోగించేలా..

ఈ ప్లాంట్‌లో సమారియం, కోబాల్ట్‌, నియోడైమియం, ఐరన్‌, బోరాన్‌ వంటి అరుదైన అయస్కాంతాలను ఉత్పత్తి చేయనున్నారు. వీటిని టెలీకమ్యూనికేషన్స్‌, ఎలక్ట్రిక్‌ వాహనాలు, మైక్రో ఎలక్ట్రానిక్స్‌, విండ్‌ టర్బైన్ల నిర్మాణంలో వినియోగిస్తారు. ముఖ్యంగా యుద్ధ విమానాలు, మిస్సైల్స్‌ వంటి అత్యాధునిక ఆయుధాల తయారీలోనూ ఈ తరహా అరుదైన మాగ్నెట్స్‌ని ఉపయోగిస్తుంటారు. అంతేకాక.. ఇటీవల తయారవుతున్న హైటెక్నాలజీ ఉత్పత్తుల్లో రేర్‌ మాగ్నెట్స్‌ కీలకంగా మారనున్నాయి. ఇన్నాళ్లూ వీటిని వివిధ దేశాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకునేవాళ్లు. దీనివల్ల అణుశక్తి, క్షిపణులు, రక్షణ విభాగంలో పరికరాల తయారీ.. అంతరిక్షం, ఇతర వ్యూహాత్మక రక్షణ వ్యవస్థల్లో అభివృద్ధికి కొంచెం అవరోధంగా ఉండేది. దీంతో ఆత్మనిర్భర్‌ భారత్‌లో భాగంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో వీటి తయారీకి శ్రీకారం చుట్టారు. ఇక ఈ రేర్‌ మాగ్నెట్స్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌ ఉండటంతో ఎగుమతుల విషయంలోనూ భారత్‌ తనదైన ముద్ర వేసుకోనుంది.

అత్యంత తీవ్ర తుపానుగా ‘మోచా’!

- రోజురోజుకు మరింత బలపడుతున్న తుపాను
- పోర్టు బ్లెయిర్‌కు 550 కి.మీల దూరంలో కేంద్రీకృతం
- రేపు బంగ్లాదేశ్‌-మయన్మార్‌ల మధ్య తీరం దాటే అవకాశం
- రాష్ట్రంలో పెరగనున్న వడగాడ్పుల ఉధృతి

సాక్షి, విశాఖపట్నం: మధ్య బంగాళాఖాతంలో ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని కొనసాగుతున్న మోచా తుపాను రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. శుక్రవారం నాటికి ఇది తీవ్ర తుపాను నుంచి అతి తీవ్ర తుపానుగా బలపడింది. శుక్రవారం రాత్రికి ఈ తుపాను పోర్టు బ్లెయిర్‌కు పశ్చిమ వాయవ్య దిశగా 550 కి.మీలు, బంగ్లాదేశ్‌లోని కాక్స్‌బజార్‌కు దక్షిణ నైరుతి దిశలో 730 కి.మీల దూరంలోనూ కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం అర్ధరాత్రి దాటాక అత్యంత తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మోచా తుపాను బంగ్లాదేశ్‌లోని కాక్స్‌బజార్‌, మయన్మార్‌లోని క్యాక్‌ప్యూల మధ్య సిట్‌వేకు సమీపంలో ఈనెల 14 మధ్యాహ్నం అతి తీవ్ర తుపానుగా తీరాన్ని దాటుతుందని తెలిపింది. ఆ సమయంలో గంటకు 150–160, గరిష్ఠంగా 175 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని పేర్కొంది. మరోవైపు శనివారం నుంచి రాష్ట్రంలో వడగాడ్పుల ప్రభావం పెరగనుంది. ఆదివారం నుంచి మరింత ఉధృతంగా మారి తీవ్ర వడగాడ్పులకు ఆస్కారం ఉందని ఐఎండీ తెలిపింది. శనివారం 125 మండలాల్లోను, ఆదివారం 161 మండలాల్లోనూ వడగాడ్పుల తీవ్రత ఉంటుందని వివరించింది. ఈ నెల 16 వరకు వడగాడ్పులు ప్రభావం కొనసాగుతుందని తెలిపింది. కాగా శుక్రవారం రాష్ట్రంలో పల్నాడు జిల్లా నరవలపాడులో 43.31 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది.

సకాలంలోనే నైరుతి రుతుపవనాలు

- జూన్‌ మొదటి వారంలోనే కేరళలోకి ప్రవేశించే అవకాశం

సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాలు ఈ సంవత్సరం కూడా సకాలంలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను ప్రభావం రుతుపవనాలపై ఉంటుందనే వార్తలు వినిపిస్తున్నా అందుకు అవకాశం లేదని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అకాల వర్షాల ప్రభావం రుతుపవనాలపై ఉండే అవకాశం ఏమాత్రం లేదని అమరావతి వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త కరుణసాగర్‌ తెలిపారు. అరేబియా సముద్రంలో తుపాను వస్తే దాని ప్రభావం రుతుపవనాలపై కొంత ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. బంగాళాఖాతంలో వచ్చే తుపానుల ప్రభావం రుతుపవనాలపై ఉండదన్నారు. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్‌ 1న కేరళలో ప్రవేశిస్తాయి. ఈసారి కూడా అదే సమయానికి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి రుతుపవనాలు మే నెలలో అండమాన్‌ నికోబార్‌లో ప్రారంభమవుతాయి. ఇప్పుడు బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను వల్ల వీచే బలమైన గాలులతో అవి ఇంకా ముందే కదిలే అవకాశం కూడా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే రుతుపవనాలు 4, 5 రోజులు ముందుగానే కేరళలో ప్రవేశించే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

మంత్రాలయంలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత

మే నెలాఖరు వరకు తీవ్ర ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కర్నూలు జిల్లా మంత్రాలయంలో శుక్రవారం అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా పచ్చవలో 43.3, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కసుమూరులో 43.1, చినఅరికట్లలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కంబోడియాలో భారత నావికాదళ నౌకలు


కంబోడియాలోని సిహనౌక్విల్లే సందర్శనలో ఉన్న భారతనావికాదళ నౌకలు ఐఎన్‌ఎస్‌ ఢిల్లీ , సత్పురా

సింధియా (విశాఖ పశ్చిమ): ఆసియాన్‌ దేశాలకు భారత నావికాదళ విస్తరణలో భాగంగా భారత నావికాదళ నౌకలు ఐఎన్‌ఎస్‌ ఢిల్లీ, ఐఎన్‌ఎస్‌ సత్పురా గురువారం నుంచి 14వ తేదీ వరకు కంబోడియాలోని సిహనౌక్విల్లే వద్ద పోర్ట్‌ కాల్‌ చేస్తున్నాయి. ఈ నౌకలు రియర్‌ అడ్మిరల్‌ గురుచరణ్‌సింగ్‌, ఫ్లాగ్‌ ఆఫీసర్‌ కమాండింగ్‌ ఈస్టర్న్‌ ఫ్లీట్‌ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్శనతో పోర్ట్‌కాల్‌ కంబోడియా రాజ్యంతో భారతదేశం సత్సంబంధాలను మెరుగుపరుస్తుంది. పోర్ట్‌కాల్‌ సమయంలో రెండు నావికాదళాల సిబ్బంది వృత్తిపరమైన చర్యలు, డెక్‌ సందర్శనలు, స్పోర్ట్స్‌ ఎక్స్ఛేంజ్‌లలో పాల్గొంటారు.

జిల్లా వార్తలు

అభయాంజనేయునికి విశేష పూజలు

- స్వర్ణ, రజత పుష్పాలతో స్వామికి అర్చన
- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ ప్రత్యేక పూజలు
- ఆధ్యాత్మిక వేదికపై హనుమాన్‌ చాలీసా పారాయణం


అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: కృష్ణాజిల్లా హనుమాన్‌ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నాల్గో రోజైన శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన జరిగాయి. దేవస్థానాన్ని, అభయాంజనేయ స్వామిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం వెంకట శేషారామాచార్యులు అంజనీపుత్రునికి 1008 లిల్లీ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేదికపై సీతారామాంజనేయ భజన సమాజం (రేమల్లె) ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్‌ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం హనుమంతునికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి.

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ అభయాంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్‌ అప్పన కనకదుర్గాప్రసాద్‌, ఆలయ పాలకమండలి చైర్మన్‌ నెరుసు భూషణం, కార్యనిర్వహణాధికారి కూడిపూడి శ్రీనివాస్‌, అర్చకులు ఆయనకు దేవస్థానం వద్ద సాదర స్వాగతం పలికారు. ఎంపీ శ్రీధర్‌ అంజనీపుత్రునికి తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆయనను స్వామి వారి శేషావస్త్రాలతో ఆలయ చైర్మన్‌ ఎన్‌. భూషణం సత్కరించారు.

వైభవోపేతం.. మహా కుంభాభిషేకం


ఆలయ మాడవీధుల వెంట ఉత్సవమూర్తుల ఊరేగింపు


ఆలయ శిఖరానికి మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్న అష్టాక్షరీ స్వామిజీ

కోడూరు: వేదఘోష ఉల్లిపాలెం మర్మోగింది.. గ్రామం భక్తజన సంద్రంగా మారింది. కృష్ణాజిల్లా కోడూరు మండలంలోని ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్‌ స్వామిజీ పర్యవేక్షణలో నిర్వహించిన మహాకుంభాభిషేక మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. యాగశాలలో రుత్వికుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక హోమాలు, యంత్ర పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

శ్రీమన్నారాయణుడి 11 అడుగుల మూలమూర్తికి వజ్రవైడుర్యాలు పొదిగిన ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరు, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఈ వేడుక తిలకించేందుకు వేలాదిగా తరలి వచ్చారు.


శైవాగమ యాగశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు


పండితులకు నమస్కరిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌, చిత్రంలో మంత్రి సత్యనారాయణ, కలెక్టర్‌ ఢిల్లీరావు

నమస్తేస్తు మహాదేవి

నమో భగవతీశ్వరి

ఎన్టీఆర్‌ జిల్లా విజయవాడలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్‌ స్టేడియంలో శుక్రవారం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి యాగ సంకల్పం తీసుకున్న తర్వాత రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీమహాయజ్ఞం వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని, ప్రజా హితాన్ని కాంక్షిస్తూ ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూజలు, అఖండ దీపారాధన చేశారు. స్టేడియం ఆవరణలోని యాగశాల సమీపంలో ఏర్పాటు చేసిన భేతాళ నృత్యాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయవాడ


వేద పండితుల ఆశీస్సులందుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి


కల్యాణ వేదిక వద్ద నృత్యరూపకం


సందడిగా.. భేతాళనృత్యం


కేరళ కళాకారుల ప్రదర్శనలు


ప్రవచనం చెప్పున్న చాగంటి కోటేశ్వరరావు

ముగిసిన అన్నమయ్య జయంతి ఉత్సవాలు


అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న గౌరీనాథ్‌

విజయవాడ కల్చరల్‌: శ్రీ అన్నమాచార్య సంకీర్తనా అకాడమీ, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న పద కవితాపితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య 615 జయంతి ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సంగీతోత్సవ కార్యక్రమాలు 12 గంటలపాటు కొనసాగాయి. యువ సంగీత కళాకారులు సాత్విక, భువన శృతి, మల్లాది నాగలక్ష్మి, సింధూ రాగేశ్వరి, సీనియర్‌ గాయనీ మణులు రామలలిత, సీతారత్నం, గుడిపాటి హరికృష్ణ, విద్యాసాగర్‌, అన్నమాచార్య సంకీర్తనా ప్రచారబృందం సభ్యులు సీతారమణ, శ్రీ సద్గురు సంగీత సభ వ్యవస్థాపకుడు పోపూరి గౌరీనాథ్‌ అన్నమాచార్యులు రచించిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. వందేహం జగద్వల్లభం, నిగమనిగామంత, చంద్రప్రభ వాహనం, భావములోన భావ్యమునందును, నారాయణాచ్యుతానంద, రామచంద్రుడితడు కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌ పై పెరవలి నందకుమార్‌, మృదంగంపై నేతి శివశంకర్‌ సహకరించారు.

మహిళా సాధికారతకు సీఎం చిత్తశుద్ధితో కృషి

మంత్రి ఉషా శ్రీ చరణ్‌



మంగళగిరి: మహిళా సంక్షేమం, సాధికారతకు సీఎం వై.ఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషా శ్రీ చరణ్‌ పేర్కొన్నారు. ఆమె మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి కాజలోని ఎస్‌కేసీవీ ఆమోదిని నిరాశ్రయ బాలల సంరక్షణ గృహాన్ని శుక్రవారం సందర్శించారు. వసతి గదులు, భోజనశాల, స్వయం ఉపాధి శిక్షణ కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో కల్పిస్తున్న వసతులపై ఆశ్రయం పొందుతున్న మహిళల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉషా శ్రీ చరణ్‌ మాట్లాడుతూ ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జువైనెల్‌ వెల్ఫేర్‌ కరెక్షనల్‌ సర్వీసెస్‌ అఫ్‌ స్ట్రీట్‌ చిల్డ్రన్‌ డైరెక్టర్‌ ప్రసాదమూర్తి, ప్రొబేషన్‌ రీజినల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఖాసీం దొర, ఐసీడీఎస్‌ ఇన్‌చార్జి పీడీ కృష్ణవేణి, తహసీల్దార్‌ జి.వి.రామ్‌ ప్రసాద్‌, సంరక్షణ గృహం ఇన్‌చార్జి టి.లక్ష్మీప్రసన్న, చైల్డ్‌ ప్రొటక్షన్‌ జిల్లా అధికారి విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.



రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ

అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) జాతీయ అండర్-18 ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో జి.నైశిక్ రెడ్డి (తెలంగాణ)-ప్రణవ్ కొరాడె (మహారాష్ట్ర) జోడీ రన్నరప్‌గా నిలిచింది. బాంబే జింఖానా క్లబ్‌లో శుక్రవారం జరిగిన బాలుర డబుల్స్ ఫైనల్లో నైశిక్ రెడ్డి-ప్రణవ్ ద్వయం 4-6, 2-6తో శ్రీనికేత్ కన్నన్ (కర్ణాటక)-ఒమర్ సుమర్ (మహారాష్ట్ర) జంట చేతిలో ఓడిపోయింది. నైశిక్ రెడ్డి ప్రస్తుతం బెంగళూరులోని పడుకోన్-ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్‌లో అమెరికాకు చెందిన కోచ్ సీజర్ మొరాలెస్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు.

కీలకపోరుకు సన్‌రైజర్స్ సిద్ధం



ఐపీఎల్‌లో ప్లే ఆఫ్ దశకు అర్హత సాధించే అవకాశాలను సజీవంగా నిలబెట్టుకునేందుకు ఉప్పల్ స్టేడియంలో నేడు జరిగే కీలక మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. మార్క్‌రమ్ సారథ్యంలోని సన్‌రైజర్స్ ఈ సీజన్‌లో నిలకడలేని ఆటతీరుతో అభిమానులను నిరాశపరిచింది. ఉప్పల్ స్టేడియంలో ఐదు మ్యాచ్‌లు ఆడిన సన్‌రైజర్స్ కేవలం ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది.

‘శత’క్కొట్టిన సూర్య...


సూర్యకుమార్

- 49 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 103 నాటౌట్
- గుజరాత్‌పై ముంబై విజయం
- రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన వృథా

ముంబై: సొంత మైదానంలో ముంబై ఇండియన్స్ మరోసారి గర్జించింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ 200 పైచిలుకు పరుగులు నమోదు చేసింది. దాంతో ఐపీఎల్ డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 27 పరుగులతో నెగ్గి ప్లే ఆఫ్ దశకు చేరువైంది.

ముందుగా ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (20 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ శర్మ (18 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సూర్యకుమార్ యాదవ్ (49 బంతుల్లో 103 నాటౌట్; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) గుజరాత్ బౌలర్ల భరతం పట్టి అజేయ సెంచరీతో మెరిశాడు. చివర్లో విష్ణు వినోద్ (20 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. గుజరాత్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 30 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసి ఓడిపోయింది. 103 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన గుజరాత్ విజయంపై ఆశలు వదులుకుంది. ఈ దశలో రషీద్ ఖాన్ (32 బంతుల్లో 79 నాటౌట్; 3 ఫోర్లు, 10 సిక్స్‌లు) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు.

టాస్ గెలిచిన గుజరాత్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఎంచుకోగా... ముంబై ఓపెనర్లు ఇషాన్ కిషన్, రోహిత్ దూకుడుగా ఆడారు. పవర్‌ప్లే ముగిసే సరికి ముంబై 61/0తో ఉంది. పవర్‌ప్లే తర్వాత రషీద్ ఖాన్ తన తొలి ఓవర్ తొలి బంతికి రోహిత్‌ను, ఐదో బంతికి ఇషాన్ కిషన్‌ను అవుట్ చేశాడు. దాంతో ముంబై తడబడింది. అనంతరం రషీద్ తన రెండో ఓవర్లో చివరి బంతికి వధేరా (7 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్)ను బౌల్డ్ చేశాడు. ఈ దశలో సూర్యకుమార్, విష్ణు వినోద్ ముంబై ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. సూర్య నెమ్మదిగా జోరు పెంచి 32 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. విష్ణు, డేవిడ్ (5) వెంటవెంటనే అవుటైనా మరోవైపు సూర్య హడలెత్తించాడు. మోహిత్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్లో సూర్య 4,4,6,2,4తో 20 పరుగులు... షమీ వేసిన 19వ ఓవర్లో 6,4,4తో సూర్య సెంచరీకి చేరువయ్యాడు. జోసెఫ్ వేసిన చివరి ఓవర్ చివరి బంతిని సిక్స్‌గా మలిచి సూర్య సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	12	8	4	0	16	0.761
చెన్నై	12	7	4	1	15	0.493
ముంబై	12	7	5	0	14	-0.117
రాజస్తాన్	12	6	6	0	12	0.633
లక్నో	11	5	5	1	11	0.294
బెంగళూరు	11	5	6	0	10	-0.345
కోల్‌కతా	12	5	7	0	10	-0.357
పంజాబ్	11	5	6	0	10	-0.441
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	11	4	7	0	8	-0.605

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ఢిల్లీ x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ 31; రోహిత్ (సి) తెవాటియా (బి) రషీద్ 29; సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 103; వధేరా (బి) రషీద్ 15; విష్ణు వినోద్ (సి) మనోహర్ (బి) మోహిత్ 30; టిమ్ డేవిడ్ (సి అండ్ బి) రషీద్ 5; గ్రీన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 218. వికెట్ల పతనం:** 1-61, 2-66, 3-88, 4-153, 5-164. **బౌలింగ్:** షమీ 4-0-53-0, మోహిత్ శర్మ 4-0-43-1, రషీద్ ఖాన్ 4-0-30-4, నూర్ అహ్మద్ 4-0-38-0, అల్జారి జోసెఫ్ 4-0- 52-0. **గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్:** సాహా (ఎల్బీడబ్ల్యూ) (బి) మధ్వాల్ 2; గిల్ (బి) మధ్వాల్ 6; హార్దిక్ పాండ్యా (సి) ఇషాన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 4; విజయ్ శంకర్ (బి) చావ్లా 29; మిల్లర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మధ్వాల్ 41; మనోహర్ (బి) కార్తికేయ 2; తెవాటియా (సి) గ్రీన్ (బి) చావ్లా 14; రషీద్ ఖాన్ (నాటౌట్) 79; నూర్ అహ్మద్ (బి) కార్తికేయ 1; అల్జారి జోసెఫ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1-7, 2-12, 3-26, 4-48, 5-55, 6-100, 7-100, 8-103. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 4-0-37-1, ఆకాశ్ మధ్వాల్ 4-0-31-3, క్రిస్ జోర్డాన్ 4-0-34-0, పీయూష్ చావ్లా 4-0-36-2, కుమార్ కార్తికేయ 3-0-37-2, గ్రీన్ 1-0-13-0.

కాంస్యాలతో ముగించారు...

- సెమీస్‌లో పోరాడి ఓడిన దీపక్, నిశాంత్ దేవ్
- గాయంతో ప్రత్యర్థికి ‘వాకోవర్’ ఇచ్చిన హుసాముద్దీన్


దీపక్


హుసాముద్దీన్


నిశాంత్ దేవ్

తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను భారత్ మూడు కాంస్య పతకాలతో ముగించింది. ఈ టోర్నీ చరిత్రలో భారత్‌కిదే అత్యుత్తమ ప్రదర్శన. శుక్రవారం జరిగిన మూడు సెమీఫైనల్స్‌లో భారత్‌కు నిరాశే ఎదురైంది. హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) తమ శక్తినంతా ధారపోసి పోరాడినా ఫలితం లేకపోగా... మోకాలి గాయం కారణంగా తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57 కేజీలు) జట్టు వైద్య బృందం సలహా మేరకు రింగ్‌లోకి దిగకుండానే ప్రత్యర్థికి ‘వాకోవర్’ ఇచ్చాడు. గతంలో రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు నెగ్గిన ఫ్రాన్స్ బాక్సర్ బిలాల్ బెనామాతో జరిగిన సెమీఫైనల్లో దీపక్ 3-4తో ఓడిపోయాడు. మూడు రౌండ్లలో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. దీపక్ పంచ్‌ల ధాటికి ఒకసారి రిఫరీ బెనామాకు కౌంట్‌బ్యాక్ ఇచ్చారు. ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోరాడటంతో నిర్ణీత మూడు రౌండ్ల తర్వాత రిఫరీలు బౌట్‌ను సమీక్షించి చివరకు బెనామా పైచేయి సాధించినట్లు తేల్చారు. ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షిమ్‌బెర్జెనోవ్ (కజకిస్తాన్)తో జరిగిన సెమీఫైనల్లో నిశాంత్ దేవ్ 2-5తో ఓటమి చవిచూశాడు. అస్లాన్‌బెక్‌పై నిశాంత్ లెఫ్ట్, రైట్ క్రాస్ పంచ్‌లతో విరుచుకుపడినా వీటిలో కచ్చితత్వం లేకపోవడంతో చివరకు కజకిస్తాన్ బాక్సర్‌దే పైచేయి అయింది. సైడెల్ హోర్టా (క్యూబా)తో తలపడాల్సిన నిజామాబాద్ బాక్సర్ హుసాముద్దీన్ మోకాలి గాయం కారణంగా బరిలోకి దిగలేకపోయాడు. దియాజ్ ఇబనెజ్ (బల్గేరియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో హుసాముద్దీన్ మోకాలికి గాయమైంది. త్వరలోనే ఆసియా క్రీడలు ఉండటం... ఈ క్రీడలు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పోటీగా కూడా ఉండటంతో భారత బాక్సింగ్ వైద్య బృందం హుసాముద్దీన్ గాయం తీవ్రత పెరగకూడదనే ఉద్దేశంతో బరిలో దిగవద్దని సలహా ఇచ్చింది. దాంతో హుసాముద్దీన్ రింగ్‌లోకి దిగలేదు.

10 ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ గెలిచిన మొత్తం పతకాల సంఖ్య. అమిత్ పంఘాల్ (2019) రజతం సాధించాడు. విజేందర్ (2009), వికాస్ కృషన్ (2011), శివ థాపా (2015), గౌరవ్ బిధూరి (2017), మనీశ్ కౌశిక్ (2019), ఆకాశ్ కుమార్ (2021), హుసాముద్దీన్, దీపక్, నిశాంత్ దేవ్ (2023) కాంస్య పతకాలు గెలిచారు.

బ్రిజ్‌భూషణ్‌ను విచారించిన పోలీసులు

- మూడు గంటలపాటు ప్రశ్నించిన ఢిల్లీ పోలీసుల ప్రత్యేక బృందం
- కేసును ఈనెల 27కు వాయిదా వేసిన ఢిల్లీ కోర్టు



న్యూఢిల్లీ: పలువురు మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్ పోలీసుల విచారణకు హాజరయ్యాడు. కేసు తీవ్రత దృష్ట్యా ఢిల్లీ పోలీసులు పది మందితో ప్రత్యేక పరిశోధన బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ బృందంలో నలుగురు మహిళా పోలీసు అధికారిణులు కూడా ఉన్నారు. గత నెలలో బ్రిజ్‌భూషణ్‌పై రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. విచారణకు హాజరుకావాలని ఇటీవల బ్రిజ్‌భూషణ్‌కు నోటీసులు జారీ చేయగా... గురువారం ఆయన హాజరయ్యారని... ‘సిట్’ మూడు గంటలపాటు ఆయనను ప్రశ్నించిందని ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ సందర్భంగా తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని, ఉద్దేశపూర్వకంగా తనను ఇరికిస్తున్నారని బ్రిజ్‌భూషణ్ సమాధానం ఇచ్చినట్లు ఆ పోలీసు అధికారి తెలిపారు. ఇప్పటికే 30 మంది సాక్షుల నుంచి వాంగ్మూలాలు తీసుకున్నామని, ఈ కేసుకు సంబంధించి ముమ్ముందు కూడా బ్రిజ్‌భూషణ్‌ను విచారణ కోసం పిలుస్తామన్నారు. మరిన్ని ఆధారాలు సేకరించేందుకు ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, హరియాణా రాష్ట్రాలకు ఢిల్లీ పోలీసులు ప్రత్యేక బృందాలు వెళ్లినట్లు ఆ పోలీసు అధికారి వివరించారు. ఇప్పటికైతే మేజిస్ట్రేట్ ఎదుట మైనర్ రెజ్లర్ వాంగ్మూలాన్ని తీసుకున్నామని... త్వరలోనే మరో ఆరుగురు మహిళా రెజ్లర్ల స్టేట్‌మెంట్‌ను కూడా మేజిస్ట్రేట్ సమక్షంలో నమోదు చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ కేసు విచారణ నిమిత్తం ‘సిట్’ ఏర్పాటు చేశామని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్‌సింగ్ జస్పాల్‌కు శుక్రవారం ఢిల్లీ పోలీసులు నివేదిక సమర్పించగా.. తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేశారు.

రజతాలు నెగ్గిన హృదయ్, నాన్సీ





బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో మరో రెండు పతకాలు చేరాయి. శుక్రవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో భారత షూటర్ హృదయ్ హజారికా... మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో నాన్సీ రజత పతకాలు సాధించారు. ఫైనల్లో హృదయ్ 251.9 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. హరియాణకు చెందిన 19 ఏళ్ల నాన్సీ ఫైనల్లో నాన్సీ 253.3 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మొత్తం నాలుగు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

సినిమా

నా సినిమాల్లో దేశభక్తి అలా కుదురుతోంది!

- సంకల్ప్ రెడ్డి

‘‘ఇండియన్ ఇంటెలిజెన్సీ బ్యూరో ప్రతినిధులు పాకిస్తాన్ వెళ్లి అక్కడ ఓ స్పై ఆపరేషన్‌ను సక్సెస్‌ఫుల్‌గా ఎగ్జిక్యూట్ చేశారు. ఈ మిషన్ సక్సెస్‌ఫుల్ కావడం వల్ల వేలాదిమంది భారతీయుల ప్రాణాలు రక్షించబడ్డాయి. ఈ మిషన్ తాలూకు విషయాలను తెలుసుకోవాలంటే ‘ఐబీ 71’ సినిమా చూడాలి. ఓ చారిత్రాత్మక ఘటనతో తీసిన ఈ చిత్రంలో దేశభక్తి తాలూకు మూమెంట్స్ ఉంటాయి’’ అన్నారు దర్శకుడు సంకల్ప్‌రెడ్డి. విద్యుత్ జమాల్ హీరోగా నటించి, నిర్మించిన హిందీ థ్రిల్లర్ ‘ఐబీ 71’. అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాకు సంకల్ప్‌రెడ్డి దర్శకత్వం



వహించారు. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా సంకల్ప్‌మాట్లాడుతూ– ‘‘ఘాజీ’ ఇన్సిడెంట్‌కు ముందు కశ్మీర్‌లో జరిగిన ఓ ఘటన ఆధారంగా తీసిన చిత్రమే ‘ఐబీ 71’. ‘ఘాజీ’, ‘రాజీ’, ఇప్పుడు ఈ ‘ఐబీ 71’.. ఇవన్నీ ఇండియా–పాకిస్తాన్ (1971) యుద్ధానికి ముందు జరిగిన ఘటనల నేపథ్యంలో వచ్చిన సినిమాలు. ఈ ఘటల తాలుకూ విషయాలు అప్పట్లో న్యూస్‌పేపర్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆ సమాచారం ఆధారంగా, కొత్తమంది వ్యక్తుల ద్వారా కొన్ని కొత్త విషయాలు తెలిశాయి. ‘ఘాజీ’, ‘అంతరిక్షం’, ఇప్పుడు ‘ఐబీ 71’ కథల్లో భాగంగానే దేశభక్తి అంశం మిళితమై ఉంది. అంతేకానీ ప్రత్యేకంగా దేశభక్తి నేపథ్యాల్లో చేయాలని నేనీ సినిమాలు చేయలేదు. అలా కుదురుతోంది.. అంతే. బహుశా అంతర్లీనంగా నాలో ఉన్న దేశభక్తి ఓ కారణమేమో! హిందీలో నాకు ‘ఐబీ 71’ తొలి సినిమా. తెలుగులో నా తొలి సినిమా ‘ఘాజీ’ అండర్‌వాటర్ బ్యాక్‌డ్రాప్, రెండో సినిమా ‘అంతరిక్షం’ స్పేస్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటాయి. ‘ఐబీ 71’ బ్యాక్‌డ్రాప్ ఆకాశం. అలాగే భూమి, నిప్పుల బ్యాక్‌డ్రాప్‌లో కూడా సినిమాలు చేయాలని ఉంది’’ అని అన్నారు.

లేడీ ఇన్ లీడ్


• రష్మిక • కీర్తి సురేశ్ • నయనతార

సాధారణంగా నాయకులు కథలను నడిపిస్తారు.. ఆ కథల్లో నాయికలు ఆటాపాటలకు పరిమితం అవుతారు. కొన్నిసార్లు నాయికలే కథలను నడిపిస్తారు. ఆ కథల్లో ఆటాపాటలు కాదు.. ఫైట్లు ఎక్కువ ఉంటాయి. నాయికలు పవర్‌ఫుల్‌గా కనిపిస్తారు. ఇప్పుడు కొందరు కథానాయికలు లీడ్ రోల్స్‌లో నటిస్తున్న, లేడీ ఓరియంటెడ్ చిత్రాల గురించి తెలుసుకుందాం.

లేడీ సూపర్ స్టార్ @ 75

స్టార్ హీరోల సరసన రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూ మరోవైపు హీరోయిన్ ఓరియంటెడ్ మూవీస్‌తో లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు నయనతార. ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ సినిమాలపైనే దృష్టి సారిస్తుంటారామె. అందులో భాగంగా ప్రస్తుతం నూతన దర్శకుడు నీలేష్ కృష్ణతో ఓ మూవీ చేస్తున్నారామె. నయనతార కెరీర్‌లో ఇది 75వ చిత్రం. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సందేశం కూడా ఇవ్వనుంది. ఇప్పటివరకూ నయనతార నటించిన చిత్రాల్లోకెల్లా భారీ బడ్జెట్‌తో ఈ మూవీ రూపొందుతోంది.


• ‘నేనేనా’లో రెజీనా


• ‘రౌడీ బేబీ’లో హన్సిక

నాలుగు లీడ్ రోల్స్‌లో...

తెలుగు, తమిళ భాషల్లో అరడజనుకుపైగా సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు హన్సిక. వాటిల్లో నాలుగు చిత్రాల్లో లీడ్ రోల్స్ చేస్తున్నారీ బ్యూటీ. తెలుగులో ఆమె నటించిన ‘105 మినిట్స్’ (రాజు దుస్సా దర్శకుడు), ‘మై నేమ్ ఈజ్ శృతి’ (శ్రీనివాస్ ఓంకార్ డైరెక్టర్) సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అటు తమిళంలో జేఎం రాజా శరవణన్ దర్శకత్వంలో ‘రౌడీ బేబీ’, ఇగోర్ డైరెక్షన్‌లో ‘మాన్’ అనే సినిమాలు చేస్తున్నారు హన్సిక.

నేనేనా..

హీరోయిన్ రెజీనా పురావస్తు శాస్త్రవేత్తగా లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘నేనేనా’. కార్తీక్ రాజు దర్శకత్వంలో రాజశేఖర్ వర్మ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ (తమిళంలో ‘సూర్పనగై’) భాషల్లో విడుదల కానుంది. ఈ మిస్టరీ థ్రిల్లర్‌లో రెజీనా ఒక హత్య కేసు విచారణ చేస్తుండగా అది దాదాపు వందేళ్ల క్రితం జరిగిన ఘటన అని తెలుస్తుంది. 1920, ప్రస్తుతం.. ఇలా రెండు కాలాల్లో సాగే ఈ సినిమా రిలీజ్‌కి రెడీ అవుతోంది.

రెండు చిత్రాల్లో..

ఓ వైపు కమర్షియల్ సినిమాల్లో నటిస్తున్న కీర్తి సురేశ్ మరోవైపు ఫీమేల్ సెంట్రిక్ ఫిలిమ్స్‌కి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. ప్రస్తుతం ఆమె తమిళంలో ‘రఘు తాత’, ‘రివాల్వర్ రీటా’ అనే చిత్రాల్లో లీడ్ రోల్స్ చేస్తున్నారు. సుమన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ‘రఘు తాత’ చిత్రంతో హోంబలే ఫిలింస్ (కేజీఎఫ్, కేజీఎఫ్ 2, కాంతార) తమిళంలో అడుగు పెడుతోంది. ఈ చిత్రంలో విప్లవ భావాలున్న అమ్మాయి పాత్రలో కీర్తి నటిస్తున్నారు. అదే విధంగా కీర్తి లీడ్ రోల్ చేస్తున్న మరో చిత్రం ‘రివాల్వర్ రీటా’. కె. చంద్రు దర్శకత్వంలో కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం తెలుగులోనూ విడుదలయ్యే చాన్స్ ఉంది.

రెయిన్‌బోలో కొత్తగా...

దక్షిణాదిలోని స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళుతున్న రష్మికా మందన్న తొలిసారి ‘రెయిన్‌బో’ అనే లేడీ ఓరియంటెండ్ సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా శాంత రూబన్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ ఫ్యాంటసీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో రష్మికకు జోడీగా దేవ్ మోహన్ నటిస్తున్నారు. ఇందులో రష్మిక వినూత్న పాత్రలో కనిపిస్తారు.

మర్డర్ మిస్టరీ


• అజయ్

అజయ్, జ్ఞానేశ్వరి, వివేక్ త్రివేది, ఊర్వశి పరదేశి, ప్రజ్ఞా నయన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘చక్రవ్యూహం’. ‘ది ట్రాప్’ అనేది ఈ సినిమా ఉపశీర్షిక. చెట్కూరి మధుసూదన్ దర్శకత్వంలో సావిత్రి నిర్మించిన ఈ చిత్రం జూన్ 2 రిలీజ్ కానుంది. ‘‘మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది’’ అన్నారు మధుసూదన్. శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: భరత్ మంచిరాజు, సహనిర్మాతలు: వెంకటేశ్, అనూష, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: జాస్తి అజయ్, చిలుక మహేశ్.

ప్రేక్షకులకు ఈ సినిమా ఓ మంచి బహుమతి

- గౌతమి



‘‘సినిమా నా ఫస్ట్ లవ్. అందుకే నటిగా మాత్రమే కాకుండా సినిమాకి సంబంధించిన పలు విభాగాల్లో పని చేశాను. ఇప్పుడు ఫిల్మ్ మేకింగ్ మరింత ఆసక్తికరంగా ఉంది. నేర్చుకోవడానికి చాలా ఉంది. నటిగా షూటింగ్స్‌ని ఎంజాయ్ చేయగలుగుతున్నాను కాబట్టే ఇంకా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. ఇందుకు సంతోషంగా ఉంది. ఒక రకంగా గర్వపడుతున్నాను కూడా’’ అన్నారు గౌతమి. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘అన్నీ మంచి శకునములే’. స్వప్న సినిమాస్, మిత్ర విందా మూవీస్ పతాకాలపై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో గౌతమి మాట్లాడుతూ– ‘‘అన్నీ మంచి..’లో ఫ్యామిలీని బ్యాలెన్స్ చేసే మీనాక్షీ పాత్ర చేశాను. ఓ డ్రీమ్ మదర్, వైఫ్, ఫ్రెండ్ ఎలా ఉండాలని కోరుకుంటారో అలా ఉంటుంది మీనాక్షీ పాత్ర. నా కెరీర్ తొలినాళ్లలో నేను రాజేంద్రప్రసాద్‌గారితో యాక్ట్ చేశాను. ఇప్పుడు ఈ సినిమాలో కలిసి నటించాను. నటన పట్ల ఆయన అంకితభావం సూపర్. వీకే నరేశ్, ‘షావుకారు’ జానకి, ఊర్వశి.. ఇలా అందరూ ఓకే సినిమాలో నటించడం చాలా సంతోషంగా ఉంది. అసలు.. ఇంతమంది మంచి నటీనటులను దర్శకురాలు నందినీ, నిర్మాతలు స్వప్న, ప్రియాంకాగార్లు ఓ చోటకు చేర్చి సినిమా చేయడం అద్భుతం. ప్రేక్షకులకు ఈ సినిమా మర్చిపోలేని బహుమతి. స్వీయనియంత్రణ ఉన్న దర్శకురాలు నందిని. మంచి నిర్మాతలకు ఉండాల్సిన లక్షణాలు ప్రియాంక, స్వప్నగార్లలో ఉన్నాయి. ప్రస్తుతం బోయపాటిగారి సినిమాలో నటిస్తున్నాను. రెండు వెబ్ సిరీస్‌లు చేస్తున్నాను’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ–‘‘మా అమ్మాయి ఫిల్మ్ మేకింగ్ చదువుతోంది. తనకు కెమెరా వెనక ఉండటం ఇష్టం’’ అని చెప్పారు గౌతమి.

స్టూడెంట్ రెడీ


• బెల్లంకొండ గణేశ్

స్టూడెంట్‌గా థియేటర్స్‌కు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు బెల్లకొండ గణేశ్. రాఖీ ఉప్పలపాటి దర్శకత్వంలో బెల్లకొండ గణేశ్ హీరోగా ‘నాంది’ సతీష్ వర్మ నిర్మించిన చిత్రం ‘నేను స్టూడెంట్ సార్!’. ఇందులో అవంతిక దస్సాని హీరోయిన్‌గా నటించారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను జూన్ 2న రిలీజ్ చేస్తున్నట్లు శుక్రవారం యూనిట్ ప్రకటించింది. సముద్రఖని, సునీల్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్.

సూపర్ హీరో

అరవింద్ కృష్ణ సూపర్ హీరోగా నటిస్తోన్న చిత్రం ‘ఏ మాస్టర్ పీస్’. ‘శుక్ర, మాటరాని మౌనమిది’ వంటి వరుస హిట్స్ అందుకున్న సుకు పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకాంత్ కంద్రాగుల నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ‘‘ఏ మాస్టర్ పీస్’ టైటిల్‌కు తగ్గట్టుగానే సూపర్ హీరో సినిమా. ఇప్పటి వరకూ వచ్చిన సూపర్ హీరోస్‌కు ఏ మాత్రం తీసిపోని విధంగా మా ఫస్ట్ లుక్ ఉంది. విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకున్న అరవింద్ కృష్ణ సూపర్ హీరోగా ప్రేక్షకులను అలరిస్తారు. పెద్దలకు, పిల్లలకు నచ్చేలా ఈ సూపర్ హీరో పాత్రను డిజైన్ చేశాడు సుకు పూర్వాజ్’’ అన్నారు శ్రీకాంత్ కంద్రాగుల.


• అరవింద్ కృష్ణ

కొత్త సినిమా షురూ


• దివ్య భారతి, సుడిగాలి సుధీర్, చదలవాడ శ్రీనివాసరావు

సుడిగాలి సుధీర్ హీరోగా నాలుగో సినిమా ‘ఎస్ఎస్4’ (వర్కింగ్ టైటిల్) షురూ అయింది. ‘పాగల్’ ఫేమ్ నరేష్ కుప్పిలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దివ్య భారతి హీరోయిన్. లక్కీ మీడియా–మహా రాజా క్రియేషన్స్ బ్యానర్స్‌పై చంద్ర శేఖర్ రెడ్డి మొగుళ్ల, బెక్కం వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమానికి నిర్మాతలు డి. సురేశ్ బాబు, కేఎస్ రామారావు, సూర్యదేవర రాధాకృష్ణ, కేఎల్ దామోదర ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. తొలి సీన్‌కి నిర్మాత పి. కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు క్లాప్ కొట్టారు. ‘‘మంచి కథాంశంతో రూపొందుతున్న చిత్రం ఇది’’ అన్నారు చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల, బెక్కం వేణుగోపాల్. ‘‘ఒక గంట కథ వినగానే ఒప్పుకున్న సుధీర్‌కి థ్యాంక్స్’’ అన్నారు నరేష్ కుప్పిలి. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: బాలాజీ సుబ్రహ్మణ్యం.

ఎక్కేద్దాం ఎవరెస్ట్.. చేసేద్దాం సాహసం!



పెరుగుతున్న పర్వతారోహకులు

- ఈ నెలలో 65 దేశాలకు చెందిన 463 మందికి ఓకే చెప్పిన నేపాల్
- వీరిలో 367 మంది పురుషులు.. 96 మంది మహిళలు
- గత ఏడాది ఇదే సీజన్‌లో 204 మందికి అవకాశం
- సెప్టెంబర్–అక్టోబర్‌లో మరికొంత మందికి ఛాన్స్

సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే ఎత్తైన.. పర్వతాల్లో రారాజుగా పిలిచే ఎవరెస్ట్ శిఖరంపై జెండా ఎగరేయాలని చాలామందే అనుకుంటారు. కానీ.. కొందరికి మాత్రమే ఆ అవకాశం, అదృష్టం దక్కుతాయి. ఎందుకంటే ఈ శిఖరం కొలువైన నేపాల్ ప్రభుత్వం పర్వతారోహణకు అత్యంత తక్కువ సంఖ్యలో మాత్రమే అనుమతులు మంజూరు చేస్తుంటుంది. గతంలో ఏటా సగటున 200 మందికి మాత్రమే అవకాశం దక్కగా.. ఈ ఏడాది మే నెలలో 463 మందికి నేపాల్ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. వేసవిలో అనుమతులు పొందిన వారిలో 65 దేశాలకు చెందిన 367 మంది పురుషులు, 96 మంది మహిళలు ఉన్నట్టు నేపాల్ పర్యాటక శాఖ ప్రకటించింది. ఈ జాబితాలో చైనీయులు అగ్రస్థానంలో ఉన్నట్టు తెలిపింది.

వసంత కాలమే అనువైనది

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనుకునే వేలాది మంది ఏటా నేపాల్ టూరిజం విభాగానికి దరఖాస్తు చేసుకుంటున్నా.. అతి కొద్దిమందికి మాత్రమే అనుమతులు ఇస్తుంది. అక్కడి వాతావరణాన్ని బట్టి అధిరోహకులకు వసంత కాలం.. అంటే మార్చి మూడో వారం నుంచి మే చివరి వరకు అనువుగా ఉంటుంది. మరికొందరు సెప్టెంబర్–అక్టోబర్‌లో వచ్చే శరద్ రుతువులో ఎక్కుతుంటారు. అయితే, అత్యధిక పర్వతారోహకులు మే నెలనే ఎంచుకుంటారు. సాధారణంగా మే మధ్యలో ఉష్ణోగ్రతలు వేడిగా ఉండటం, పర్వతాల పైనుంచి జెట్ స్ట్రీమ్స్‌గా పిలిచే గాలులు తక్కువగా ఉండటంతో ఈ కాలాన్ని ఎంచుకుంటారు. కాగా, ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఒకేసారి 463 మందికి అక్కడి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీరందరినీ బేస్ క్యాంపు వరకు (17 వేల అడుగుల ఎత్తు) చేర్చేందుకు 1,500 మంది షెర్పా గైడ్స్, రెండింతల మంది సహాయకులను సిద్ధం చేశారు. ఈ ప్రయాణం దాదాపు రెండు వారాల పాటు సాగుతుంది. అక్కడి నుంచి వాతావరణాన్ని బట్టి మరో నాలుగు రోజులు ప్రయాణం సాగించి శిఖరాన్ని చేరుకుంటారు. సెప్టెంబర్–అక్టోబర్‌లో ఇదే సంఖ్యలో అనుమతులు ఇచ్చే అవకాశం ఉందని అక్కడి పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే, అత్యధిక మంది పర్వతారోహకులకు అవకాశం లభించిన సంవత్సరంగా 2023 నిలవనుంది.

శిఖరాగ్రం.. కొందరికే సాధ్యం

ఎవరెస్ట్ అధిరోహణలో శిఖరం చేరాలంటే సాహసమనే చెప్పాలి. ప్రయాణంలో తరచూ ప్రతికూల వాతావరణం సవాళ్లను విసురుతుంది. వీటన్నింటినీ తట్టుకుని, దాటుకుని చివరి మజిలీ చేయడం చాలా కష్టం. చాలామంది బేస్ క్యాంపు నుంచే వెనుదిరుగుతారు. ఏటా ఎవరెస్ట్ అధిరోహణకు వెళ్లే వారిలో కేవలం 14.1 శాతం మాత్రమే విజయవంతంగా యాత్ర పూర్తి చేయగలరు. అయితే, 1990 నుంచి విజయవంతమవుతున్న వారి సంఖ్య పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అధిరోహకుల కోసం ఏర్పాట్లు చేస్తున్న షెర్పాలపై మంచు పెళ్లలు విరిగి పడటంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్టు నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల పర్వతారోహకులు పాటించాల్సిన జాగ్రత్తలపై హెచ్చరిస్తోంది. ప్రపంచంలోని 10 ఎత్తైన పర్వతాలలో 8 నేపాల్‌లోనే ఉన్నాయి, దాంతో పర్వతారోహకులకు సహాయపడేందుకు అక్కడి ప్రభుత్వం బృందాలను సిద్ధం చేసింది.

నేటి నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం దృష్ట్యా విజయవాడలోని లయోల ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో 13, 14 తేదీల్లో హెల్త్ క్యాంప్ నిర్వహించడంతో పాటు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు సమాచార, పౌర సంబంధాల(ఐ అండ్ పీఆర్) శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. వైద్యఆరోగ్య శాఖ, ఐ అండ్ పీఆర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రా హాస్పిటల్, క్యాపిటల్, కామినేని, సెంటిని, పిన్నమనేని, అమెరికన్ ఆంకాలజీ అండ్ ఇండో బ్రిటిష్ హాస్పిటల్, ఉషా కార్డియాక్ సెంటర్, హెచ్‌సీజీ క్యూరి సిటీ క్యాన్సర్ సెంటర్ అండ్ హార్ట్ కేర్ సెంటర్, సన్ రైజ్, అను, స్వర హాస్పిటల్ వంటి 11 ఆస్పత్రుల నుంచి అనుభవజ్ఞులైన వైద్య బృందం జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్త్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు, ఆదివారం వైద్యుల కన్సల్టేషన్ ఉంటుందని తెలిపారు. వైద్య శిబిరంలో మెమోగ్రామ్, హృద్రోగ సంబంధిత టెస్టులు, ఈసీజీ, 2డీఎకో, టీఎంటీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్, సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్, థైరాయిడ్, డయాబెటిక్ టెస్ట్, ఎక్స్‌రే, కళ్లు, దంత పరీక్షలు వంటి 17 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. చిన్న పిల్లలకు అవసరమైన వైద్య సదుపాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు అక్రిడిటేషన్/సంస్థ గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు వచ్చిన జర్నలిస్టులు రూ.1,250 చెల్లించి హెల్త్ కార్డు పొందాలని సూచించారు. వైద్య శిబిరంలో కొత్తగా హెల్త్‌కార్డు పొందే సదుపాయాన్ని కల్పించే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

'వన్ స్టేషన్ - వన్ ప్రొడక్ట్' ఔట్‌లెట్స్‌కు ఆదరణ

ఆంధ్రప్రదేశ్‌లో 34 రైల్వే స్టేషన్లలో ఔట్‌లెట్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 'వోకల్ ఫర్ లోకల్'ను ప్రోత్సహించడం, స్థానిక, స్వదేశీ ఉత్పత్తులకు మార్కెట్‌ను పెంచడం, అట్టడుగు వర్గాలకు అదనపు ఆదాయాన్ని కల్పించడానికి భారతీయ రైల్వే ప్రారంభించిన 'వన్ స్టేషన్ - వన్ ప్రొడక్ట్ ' ఔట్‌లెట్స్‌కు ఆదరణ పెరుగుతోంది. ఇప్పటివరకు వీటిని దేశవ్యాప్తంగా 728 స్టేషన్లలో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 34 రైల్వే స్టేషన్లలో 'వన్ స్టేషన్- వన్ ప్రొడక్ట్' ఔట్‌లెట్స్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర రైల్వే శాఖ శుక్రవారం ప్రకటించింది. వీటిలో రాష్ట్రానికి చెందిన హస్తకళలు, చెక్క ఉత్పత్తులు, బొమ్మలు, ముద్దిరెడ్డిపల్లి చీరలు, తృణ ధాన్యాలు విక్రయిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి
విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 13 । మే । 2023



దుర్గమ్మ సేవలో ఎంపీ భరత్

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను ఎంపీ ఎం.భరత్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, వైదిక కమిటీ సభ్యుడు ఆర్. శ్రీనివాస శాస్త్రి అమ్మవారి చిత్రపటం బహూకరించారు.



నైపుణ్యంతో ఉద్యోగ భద్రత

విజయవాడలోని పీబీసిద్ధార్థ కళాశాల కంప్యూటర్స్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విభవ–2023 పేరుతో రాష్ట్ర స్థాయి సాంకేతిక, సాంస్కృతిక పోటీలు జరిగాయి. –IIలో▸



వైభవంగా మహా కుంభాభిషేకం

కోడూరు: కృష్ణాజిల్లా కోడూరు మండలంలోని ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం మహా కుంభాభిషేక మహోత్సవం జరిగింది.

న్యూస్‌రీల్

శిక్ష మార్పు కోసమే



చిలకలపూడి(మచిలీపట్నం): జైలులో శిక్ష అనుభవిస్తున్న వారు బయటకు వెళ్లే సమయానికి ప్రవర్తనలో మార్పు రావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక జిల్లా జైలులో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ శిక్ష అనుభవిస్తున్న వారు బెయిల్ పొందేందుకు అర్హత ఉందని అయితే కేసు తీవ్రతను బట్టి బెయిలు మంజూరు చేస్తారన్నారు. రెండు, మూడు రకాల నేరాలు చేసిన వారికి బెయిల్ ఇచ్చేందుకు న్యాయమూర్తి ఆలోచన చేస్తారన్నారు. శిక్ష అనుభవిస్తున్న వారికి న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేనప్పుడు తమ సంస్థకు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామన్నారు. అనంతరం ఆయన జైలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ చీలి ముసలయ్య, జైలు సూపరింటెండెంట్ పి. రమేష్ పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



మేడూరు(గంపలగూడెం): ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన గంపలగూడెం మండలం మేడూరు శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. విఘ్నేశ్వర పూజతో ఆలయ ప్రధాన అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు, అర్చక బృందంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వీరాంజనేయస్వామికి పంచామృతాలు, నవరసఫలాలతో అభిషేకం కనులవిందుగా జరిపారు. తదుపరి స్వామికి ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని అన్ని కోర్టులలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య శుక్రవారం తెలిపారు. మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ కోర్టులలో ఈ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లు అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యూపీహెచ్‌సీల్లో వరల్డ్ బ్యాంక్ బృందం



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో అద్భుతంగా రూపుదిద్దుకున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లను శుక్రవారం ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు సందర్శించారు. హెబీ కాలనీ, ప్రకాష్‌నగర్, గుణదల, ఏపీఐఐసీ కాలనీ, అయోధ్యనగర్, క్రీస్తురాజుపురం యూపీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలు, పనితీరు పరిశీలించడంతో నాటు, ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుహాసినితో ఆమె కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలను డాక్టర్ సుహాసిని వారికి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె. నరశింహనాయక్, డీపీఎంఓ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే ఫ్రైడే పరిశీలన..

నగరంలోని లబ్బీపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 87వ వార్డు సచివాలయం వెంకటేశ్వరపురంలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కొట్టు, కలెక్టర్ ఢిల్లీరావు



దుర్గా మల్లేశ్వర స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వేదనాదం.. మహాయాగం

- యజ్ఞ సంకల్పం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కనుల పండువగా సాగిన దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వేడుకగా ప్రారంభమైన శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బెజవాడ వేదఘోషతో మార్మోగింది. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. సకల జనుల క్షేమాన్ని కాంక్షిస్తూ, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో చేపట్టిన అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ సంకల్పం తీసుకున్న అనంతరం మహాయజ్ఞం ఆరంభమైంది. ముఖ్యమంత్రి గోశాల వద్ద ప్రత్యేక పూజలు చేసి, కపిల గోవుకు హారతి ఇచ్చారు. అనంతరం అఖండ దీపారాధనలో పాల్గొన్నారు. ఈ యాగం మే 17వ తేదీ బుధవారం వరకు ఆరు రోజులపాటు ఈ యజ్ఞం కొనసాగనుంది. వైఖానసం, పాంచరాత్రం, శైవం, వైదిక స్మార్తం అనే నాలుగు ఆగమాలతో ఏర్పాటు చేసిన నాలుగు ప్రధాన యాగశాలల్లో యజ్ఞాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క యాగశాలలో 27 కుండాల చొప్పున మొత్తం 108 కుండాలతో రుత్వికులు యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు యజ్ఞ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ యజ్ఞం దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో సాగుతోంది. ప్రభుత్వ అడ్వైజర్ అజేయ కల్లాం, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, ఉషాశ్రీచరణ్, అంబటి రాంబాబు, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీలు పోతుల సునీత, అరుణ్ కుమార్ రుహుల్లా, కల్పలతారెడ్డి, ఎమ్మెల్యేలు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతం రెడ్డి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



యాగశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న పండితులు



నాట్యం చేస్తున్న కళాకారులు

భక్తుల కోసం నాలుగు క్యూలైన్లు..

యజ్ఞ కార్యక్రమాలను భక్తులు వీక్షించేలా ఉమ్మడిగా యాగశాలల చుట్టూ నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకదానిని వీఐపీల కోసం కేటాయించారు. ఉదయం 9గంటలకు 1008 భక్తులతో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, రమ్యానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు. సాయంత్రం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బేతాళ నృత్యాలు ఆకట్టుకున్నాయి. దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. ప్రజలు భక్తి శ్రద్ధలతో యాగశాలలను సందర్శించి, పూజలు చేశారు. తొలిరోజు విజయవాడ దుర్గగుడి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్ర పొంగలి పంపిణీ చేశారు.

నేటి నుంచి మిర్చి యార్డుకు వేసవి సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి యార్డుకు శనివారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మిర్చి యార్డు దిగుమతి, ఎగుమతి షాపుల కార్మిక సంఘం, దిగుమతి వ్యాపారుల సంఘం సూచనలు, అభ్యర్థనల మేరకు ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవి సెలవులు ప్రకటించామన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పోర్టు పనుల ప్రారంభానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) శుక్రవారం పరిశీలించారు. స్థానిక సర్కారుతోటలోని స్విమ్మింగ్‌పూల్ పక్కన ఉన్న ఖాళీస్థలంలో ఈ నెల 22వ తేదీన జరగనున్న సభ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హెలి ప్యాడ్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే గిలకలదిండిలో జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ పనులపై ఆరా తీశారు. అక్కడి అధికారులు ఫిషింగ్ హార్బర్ పనులపై కలెక్టర్‌కు మ్యాప్‌ల ద్వారా వివరాలు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఐ. కిశోర్, తహసీల్దార్ సునీల్‌బాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎ. శ్రీనివాస్, డీఈ శ్రీనివాసరావు, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డీఎస్పీ వై. మాధవరెడ్డి, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తదితరులు పాల్గొన్నారు.

సమాజహితులే మహానుభావులు



విగ్రహాల ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణయ్య చిత్రంలో ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే కొడాలి నాని, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

- రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య
- గుడివాడలో మహాత్మ జ్యోతీరావ్ పూలే, సావిత్రీబాయ్‌పూలే కాంస్య విగ్రహాలు ఆవిష్కరణ

గుడివాడ టౌన్: సమాజం గురించి ఆలోచించే వారిని మహాత్ములంటారని రాజ్యసభ సభ్యుడు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. శుక్రవారం గుడివాడ మెయిన్‌రోడ్‌లోని కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతీరావ్ పూలే, సావిత్రీబాయ్‌పూలే కాంస్య విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. తొలుత స్థానిక నాగవరప్పాడులోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి ఊరేగింపుగా విగ్రహావిష్కరణ ప్రాంతానికి వచ్చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎక్కడో పూణే సమీపంలోని ఓ కుగ్రామంలో జన్మించిన పూలే, సావిత్రీబాయ్ పూలే విగ్రహాలను లక్షల రూపాయలు ఖర్చుచేసి గుడివాడలో ఏర్పాటు చేశారంటే పూలే సంఘ సంస్కరణలకు ఎంతగా కృషిచేశారో అర్థం అవుతుందన్నారు. చదువుకుంటేనే సామాజిక మార్పు వస్తుందని గ్రహించి శూద్రులు, దళితులు చదువుకోవాలనే విప్లవాత్మకమైన మార్పునకు తన జీవితాన్ని ఫణంగా పెట్టిన సామాజిక విప్లవ కారుడు జ్యోతీరావ్ పూలే అన్నారు. ఆ రోజుల్లో అగ్రవర్ణాల స్త్రీలు సైతం చదవకూడదనే నిబంధనను వ్యతిరేకించి తన భార్యను ఉపాధ్యాయినిగా తీర్చిదిద్ది పాఠశాలకు పంపి మహిళల విద్యకు కృషిచేశారన్నారు. తనను రాజ్యసభకు పంపిన జగన్‌మోహన్‌రెడ్డి సైతం ఒక సామాజిక మార్పునకు పునాదివేస్తున్న నాయకుడేన్నారు. తన ద్వారా బీసీ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టేలా కృషిచేస్తున్నారన్నారు. ఇప్పటికే తాను దేశంలోని అనేక రాష్ట్రాల్లో పర్యటిస్తూ బీసీ బిల్లుతో పాటు బీసీ గణన చేపట్టేలా కృషి చేస్తున్నానన్నారు.



గుడివాడలో ఏర్పాటు చేసిన పూలే దంపతుల కాంస్య విగ్రహాలు

మార్పునకు నాంది..

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ పీష్వా రాజుల కాలం అంతం అయిననాడే పూలే జన్మించడం భారతదేశంలో ఒక మార్పునకు నాంది అయ్యిందన్నారు. బ్రిటీష్‌కు చెందిన రోజ్‌లిన్ అనే పరిశోధకురాలు పూలే చరిత్రపై అధ్యయనం చేసినప్పుడు ఈ అంశం బయటకు వచ్చిందన్నారు. అంతటి మహానుభావుల విగ్రహాలను గుడివాడ పట్టణంలో ఏర్పాటు చేయడానికి కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి బీసీలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు పోతుల సునీత, చంద్రగిరి ఏసురత్నం, జయమంగళం వెంకట రమణ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మారేష్, మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహీధర్, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం. పురుషోత్తం, బీసీ సంఘం జిల్లా, నియోజకవర్గ, పట్టణ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

నర్సులు ప్రశంసనీయులు



నర్సింగ్ డే సందర్భంగా నర్సులను సత్కరిస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఫ్లారెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు సేవలందిస్తూ వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకువస్తున్న నర్సులు ప్రశంసనీయులని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ నర్సింగ్ డే సందర్భంగా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ప్రభుత్వాస్పత్రి నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసిస్తూ మరింతగా ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందన్నారు. వైద్య రంగం ద్వారా సేవలందించే వారిలో సగానికి పైగా నర్సులే ఉన్నారన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో నర్సులు పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. ప్రభుత్వ దంత వైద్యశాల, ప్రభుత్వ జనల్ ఆస్పత్రి, ఇబ్రహీంపట్నం, చందర్లపాడు, వత్సవాయి, గంపలగూడెం, కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సేవలందిస్తున్న కె. శివలీల, బి. విజయశ్రీ. కె. రత్నకుమారి, బి.కె. అంజలి, సీహెచ్‌ఐవీ కృపాసమాధానం. ఏ. వలయశ్రీ, ఎం. మేరి కుమారి, డి. మానికలను కలెక్టర్ ఢిల్లీరావు సన్మానించారు. కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌ఓ ఎం. సుహాసిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. సౌభాగ్యలక్ష్మి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ నళిని దేవి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా హార్బర్ పనులు



పోర్టు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, చిత్రంలో జేసీ అపరాజితాసింగ్

సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కృష్ణా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి ఈ నెల 22వ తేదీన బందరు పోర్టు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పోర్టు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో జరుగుతున్న హార్బర్లు, పోర్టు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గిలకలదిండి హార్బర్ పనుల పురోగతి, బందరు పోర్టు పనులు ప్రారంభానికి జరుగుతున్న ఏర్పాట్లను వివరించారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు 58.15 ఎకరాల్లో రూ. 421.17 కోట్లు అంచనా వ్యయంతో ఒకేసారి 550 ఫిషింగ్ బోట్లు నిలిపే సామర్థ్యంతో చేపట్టే పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. ఈ పనులు 54 శాతం పూర్తయ్యాయన్నారు. సముద్రముఖ ద్వారం పూడికతీత పనులు 15.28 లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తయ్యాయని వివరించారు. అనంతరం కలెక్టర్ పోర్టు అధికారులతో సీఎం కార్యక్రమంపై సమీక్ష చేశారు. పోర్టు నిర్మాణానికి సంబంధించి బ్రేక్ వాటర్ పనులు చేపట్టే ప్రాంతంలో భూమి పూజా జరిగే ప్రదేశంలో వుడ్ ఫ్లాట్‌ఫాం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ఫ్లాట్‌ఫాం పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని.. ఆ ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి వాహనంతో పాటు అధిక సంఖ్యలో వాహనాలు రానున్న నేపథ్యంలో రహదారిని పటిష్ట పరచాలన్నారు. వారంలోగా ఈ పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, పోర్టు అధికారి రాఘవేంద్ర, డీఈ ఎం శివయ్య, హార్బర్ ఎఈఈ మహేష్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామిని శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు, వివాహాల నేపథ్యంలో తెల్లవారుజామున ఆరు గంటల నుంచే భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. నవ దంపతులు పెళ్లి దుస్తులపై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున 4 గంటలకు అంతరాలయంలో అమ్మవారికి జరిగే ఖడ్గమాలార్చనకు రికార్డు స్థాయిలో 23 టికెట్లను విక్రయించారు. మరో వైపున లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

కిటకిటలాడిన క్యూలైన్లు..

అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గంతో పాటు పాత మెట్ల మార్గంలో మెట్ల పూజలు జరుపుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ. 300, రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో క్యూలైన్ మహా మండపం 5వ అంతస్తు వరకు, ఇటు ఘాట్‌రోడ్డులో టికెట్ల కౌంటర్ వరకు రద్దీగా కనిపించాయి. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు 11.40 గంటలకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అన్ని దర్శనాలు ప్రారంభం కాగా, మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు క్యూలైన్‌లో భక్తులు కనిపించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకీ సేవ, దర్బారు సేవలోనూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

రేపటి నుంచి చెస్ వేసవి శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: ది విజయవాడ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో చదరంగం వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్‌పాషా, రాజీవ్ తెలిపారు. వన్‌టౌన్‌లోని తేలప్రోలు రాజా హైస్కూల్, పటమటలోని గేట్స్ ఇన్స్టిట్యూట్, భవానీపురంలోని దేశు సుబ్బారావు వెంకటనాగరత్నమ్మ కల్యాణ మండపం, చుట్టుగుంటలోని వాసవి కల్యాణ మండపం, మైలవరంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఇబ్రహీంపట్నంలోని సెక్యూరిటీ కాలనీలో, సింగ్‌నగర్‌లోని రామకృష్ణ చెస్ అకాడమీలో, గవర్నర్‌పేటలోని అమ్మన ఎస్టేట్ ప్రాంతాల్లో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. మరిన్ని వివరాలకు 9030308811, 8523088826ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ముగిసిన టెన్నిస్ టోర్నీ



విజయవాడ స్పోర్ట్స్: ఐటా చాంపియన్‌షిప్ సిరీస్ జాతీయ అండర్–14, 16 టెన్నిస్ టోర్నీ ముగిసింది. నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమీలో వారం రోజులు పాటు జరిగిన ఈ పోటీలకు 170 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో వై.ఇషాన్ (ఆంధ్ర), ఎం.ఫజల్అలీ (తమిళనాడు), బాలికల విభాగంలో ఫృతరావ్ (కర్ణాటక), నెహల్‌మారియామాథ్యు(కేరళ) విన్నర్, రన్నర్ ట్రోఫీలు అందుకున్నారు. అండర్–16 బాలుర విభాగంలో మీర్‌ఫజల్అలీ (తమిళనాడు), వై.ఇషాన్ (ఆంధ్ర), బాలికల విభాగంలో కె.రితిక (తెలంగాణ), క్రితికరెడ్డి (తెలంగాణ) విన్నర్, రన్నర్ ట్రోఫీలను అందుకున్నారు. అండర్–16 బాలుర డబుల్స్‌లో అక్షయ్‌రామ్–యోకేష్ (తమిళనాడు) జోడీ, వి.తనిష్–ఎస్.అభిషేక్ (తమిళనాడు) జోడీ, బాలికల విభాగంలో బి.రిషిత–వి.క్రితిక (తెలంగాణ) జోడీ, జీమిమా–ఎం.నెహల్‌మారియా (కేరళ) జోడీ వరుసగా విన్నర్, రన్నర్‌లుగా నిలిచారు. విజేతలకు ఎస్.రామకృష్ణ, మధుసూదనరావు, హరిప్రసాద్, కె.గోపాలరావు, ప్రసాద్ ట్రోఫీలు అందజేశారు.

కొండెక్కిన కోడి ధరలు

- కిలో రూ.280
- అదేదారిలో కోడిగుడ్డు ధరలు

కంకిపాడు: కోడి మాంసం ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌లో కోడి మాంసం ధర పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పెరగటంతో మాంసాహార ప్రియులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరను చూసి జేబులు పట్టుకుంటున్నారు. సహజంగానే వేసవిలో కోడి మాంసం ధరలు అధికంగా ఉంటాయి. ఈ సీజన్‌లో కోళ్లకు సోకే వ్యాధులతో కోళ్లు మృతి చెందటం కారణంగా మాంసం ఉత్పత్తి తగ్గుతుంది. దీని వలన ధరలు పెరుగుతున్నాయి. అయితే ఈ దఫా అనూహ్యంగా పెరిగిన కోడి రేట్లతో నాన్ వెజిటేరియన్లు ఏమి కొంటాము.. ఏమి తింటామని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో కిలో బాయిలర్ రూ.200 నుంచి రూ.210 వరకు ధర పలికింది. ఫారమ్ కోడి రూ.150 నుంచి రూ.170 వరకు ధర ఉంది. అలాంటిది ఈ వారం బాయిలెర్ మాంసం కిలో ధర రూ.280 నుంచి రూ.285 పలుకుతుంది. ఫారం కోడి కిలో మాంసం రూ.200 దాటింది.



స్థానికంగా లభ్యత లేకనే...

ఈ సీజన్‌లో సాధ్యమైనంత వరకు కోళ్లు తక్కువగా పెంచుతారు. కోతకు సిద్ధం కాగానే విక్రయిస్తుంటారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కిలో నుంచి కిలోంపావు కోళ్లు మాత్రమే మార్కెట్‌లో అందుబాటులోకి వస్తున్నాయని దుకాణ దారులు చెబుతున్నారు. వినియోగదారులు చిన్న కోళ్లు కొనటానికి ఆసక్తి చూపక పోవంటతో అధిక బరువు ఉన్న కోళ్లను దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. ప్రధానంగా హైదరాబాద్, గుంటూరు, పశ్చిమగోదావరి, భీమవరం ప్రాంతాల నుంచి కోళ్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో కోడి మాంసం ధరలకు రెక్కలు వచ్చినట్లయింది.

గుడ్డుదీ అదే దారి...

కోడి మాంసంతో పాటు కోడి గుడ్డు ధర కూడా అదే రూట్‌లో పెరుగుతోంది. పది రోజుల క్రితం రూ.4 లోపు పలికిన గుడ్డు ధర ఈ వారం రూ.5 కు చేరింది. అట్ట కోడిగుడ్డు ధర రూ.120 పలకగా ధర ప్రస్తుతం రూ.150కు చేరింది. కోడి మాంసం, కోడి గుడ్లు ధరలు పెరగటంతో మాంసం ప్రియులు పెదవి విరుస్తున్నారు.

నిధులు దుర్వినియోగం నిజమే

- డీఎల్‌పీవో విచారణలో ధ్రువీకరణ
- రూ.38,06,383 సొమ్ము స్వాహా
- ముగ్గురు బాధ్యులుగా తేల్చిన వైనం

పెనమలూరు: పెనమలూరు గ్రామ పంచాయతీలో నిధులు గోల్‌మాల్ అయిన విషయాన్ని విచారణ అధికారులు నిగ్గు తేల్చారు. గ్రామ పంచాయతీ బిల్లు కలెక్టర్‌తో పాటు ఇద్దరు కార్యదర్శుల నిర్లక్ష్యం కారణంగానే నిధులు దుర్వినియోగం జరిగినట్లు స్పష్టం చేశారు. పెనమలూరు గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేసి ప్రస్తుతం చోడవరం బిల్లు కలెక్టర్‌గా ఉండి పరారీలో ఉన్న షేక్.షంషుద్దీన్ పెనమలూరులో పని చేసిన కాలంలో రూ.47,03,953 సొమ్ము స్వాహా చేశాడని అధికారులకు ప్రస్తుత పెనమలూరు పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు. ఇందులో ఇంటి పన్నుల కింద రూ. 41,69,053, నీటి పన్నులు రూ.5,34,900 చొప్పున ఉన్నాయి. దీని పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుడివాడ డీఎల్‌పీవో సంపత్‌కుమారి గత కొద్ది రోజులుగా విచారణ చేపట్టారు. డీఎల్‌పీవో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి రికార్డులు తనిఖీ చేశారు. దాదాపు నెలన్నర వరకు జరిగిన విచారణలో పెనమలూరు గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినట్లు విచారణ అధికారి ధ్రువీకరించారు. మొత్తం రూ.38,06,383 నగదు స్వాహా చేశారని లెక్క తేల్చారు. అయితే గతంలో వచ్చిన నిధులు దుర్వినియోగం ఆరోపణ రూ .47,03,953 ఉండగా విచారణలో సొమ్ము తగ్గటం విశేషం.



పెనమలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

ముగ్గురిపై అభియోగాలు...

పెనమలూరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై విచారణ అధికారి ముగ్గురిపై అభియోగాలు చూపారు. బిల్లు కలెక్టర్ షేక్.షంషుద్దీన్‌తో పాటు గతంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేసి ప్రస్తుత గొడవర్రు కార్యదర్శిగా పని చేస్తున్న ఎంపీయు ప్రసాద్, ప్రస్తుత పెనమలూరు కార్యదర్శి కె.రాధాకృష్ణ బాధ్యులుగా తేల్చారు. ఈ మేరకు తుది నివేదిక డీఎల్‌పీవో డీపీవోకు పంపారు.

కొత్తగా మరో ఆరోపణ..

ఇప్పటికే నిధులు దుర్వినియోగంతో ఉన్న పెనమలూరు పంచాయతీలో మరో కొత్త కుంభకోణం జరిగిందని ఫిర్యాదు అందింది.

కానూరు నుంచి పెనమలూరు గ్రామ పంచాయతీకి గత జనవరిలో నూతలపాటి కోటేశ్వరరావు అనే కార్మికుడు వచ్చి చేరాడు. ప్రతి నెలా అతను పనిచేసిన డ్యూటీ సర్టిఫికెట్ మండల పరిషత్ ద్వారా ట్రెజరీకి వెళితే 010 ఎకౌంట్‌తో జీతం పడుతుంది. అయితే అతను అనారోగ్య కారణాలతో విధులకు హాజరు కాలేదు. గత ఏప్రిల్ నెల వరకు పని చేయకపోయినా డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చి జీతం డ్రా చేశారని ఫిర్యాదు వచ్చింది. దాదాపు రూ.8 లక్షల వరకు జీతం డ్రా చేశారని సమాచారం. దీని పై అధికారులు విచారణ చేపట్టారు.

చర్యలు తీసుకుంటాం

పెనమలూరు గ్రామ పంచాయతీలో జరిగిన నిదులు దుర్వినియోగంపై విచారణ చేశాం. నిధులు స్వాహా చేశారని విచారణలో తేలింది. దీనికి ముగ్గురు ఉద్యోగులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు నివేదిక డీపీవోకు పంపాను. డీపీవో ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాను.

జి.సంపత్‌కుమారి, డీఎల్‌పీవో, గుడివాడ



లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పెడన: లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన పట్టణంలోని తోటమూల జంక్షన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... బందరు మండలం గోకవరం గ్రామానికి చెందిన పరింకాలయ నాగలక్ష్మి వెంకటేశ్వరరావు (40) బంటుమిల్లి రోడ్డులో పెడన వైపుగా ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అదే సమయంలో మచిలీపట్నం నుంచి గుడివాడ వెళ్తున్న లారీ వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ మృత్యువాత చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. వెంకటేశ్వరరావు అత్తగారి ఊరు కొంకేపూడి పంచాయతీ ఈదుమూడి గ్రామం. భార్యా పిల్లలు ఈదుమూడిలో ఉండటంతో చూసేందుకు ఉదయం గోకవరం నుంచి బయలుదేరాడు. పిల్లలను చూద్దామని వెళ్తున్న వెంకటేశ్వరావు మార్గం మధ్యలోనే చనిపోవడంతో భార్య, పిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రహదారి భద్రతా కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదాలపై వాహనదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రవాణా, పోలీస్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, నగరపాలక సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ రహదారుల అధికారులతో శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తరచూ ప్రమాదాలు సంభవించే 111 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. ఆయా ప్రదేశాల్లో ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల సంఖ్యను డిస్‌ప్లే బోర్డు ద్వారా ప్రదర్శించాలని తెలిపారు. తద్వారా వాహనదారులు అప్రమత్తంగా ఉంటారన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 115 ప్రాణాంతక ప్రమాదాలు జరగగా 120 మంది ప్రాణాలను కోల్పోయారన్నారు. జరిగిన ప్రమాదాలపై రవాణా, పోలీస్, ఆర్అండ్‌బీ , వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారులు సంయుక్తంగా విశ్లేషించి ప్రమాదానికి అసలు కారణాలపై లోతైన అధ్యయనం చేయాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పాదచారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని, దీనిని నివారించేందుకు ఫుట్ పాత్‌లపై అక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహనాల చట్టం 52ఏ ప్రకారం 15 సంవత్సరాలు నిండిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాహనాలను స్క్రాప్ చేయాలని ఆదేశించిందన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని రవాణ శాఖ అధికారులకు సూచించారు. కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీటీసీ పురేంద్ర, డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ యం.సుహాసిని, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

జర్నలిజం కోర్సులో నేడు ప్రత్యేక ప్రసంగాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీ సి.రాఘవాచారి మీడియా అకాడమీ, నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సులో భాగంగా శనివారం ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్రముఖ విశ్లేషకుడు, విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణుడు వాసిరెడ్డి అమర్‌నాథ్ ఆన్‌లైన్‌లో హాజరై మాధ్యమాలు–విశ్వసనీయత అనే అంశంపై, 9 నుంచి 10 గంటల వరకు జర్నలిజం–నైతికత అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ జి.వల్లీశ్వర్ ప్రత్యేక ఉపన్యాసం ఉంటుందని పేర్కొన్నారు. ప్రసంగాలు ఆన్‌లైన్‌లో వినవచ్చన్నారు. జూమ్ మీటింగ్ ఐడీ 81598926979, పాస్‌వర్డ్–12345తో ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగ భద్రత

ఉత్సాహంగా విభవ–2023

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగ భద్రత ఎప్పుడూ ఉంటుందని ప్రాగ్మటిక్ సిస్టమ్స్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు, సీఈవో జి.భరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పీబీ. సిద్ధార్థ కళాశాల కంప్యూటర్స్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విభవ–2023 పేరుతో రాష్ట్ర స్థాయి సాంకేతిక, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలను భరత్‌కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, సాంకేతిక, ఫార్మ, టెలికం రంగాల్లో ఎదురవుతున్న సమస్యలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కార మార్గాలను చూపవచ్చని తెలిపారు. ఒక ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో పట్టు సాధించి సమస్యలను పరిష్కరించుకునే నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంచుకోవడం ద్వారా బంగారు భవిష్యత్తును యువత సొంతం చేసుకోవచ్చని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుకుని వారిలో నైపుణ్యాలకు పదును పెట్టుకోడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ ఇలాంటి వేదికపై యువతలోని ప్రతిభ బహిర్గతం అవుతుందన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్ మాట్లాడుతూ కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి తమ కళాశాల ఆధ్వర్యంలో ఏటా ఈ విభవ–2023ను నిర్వహిస్తున్నామన్నారు. విభవ–2023 కన్వీనర్ జి.సామ్రాట్ కృష్ణతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సభ అనంతరం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్ పోటీల్లో యువత పాల్గొని తమలోని ప్రతిభను చూపారు. వీడియోగ్రఫీ, గ్రూప్ డాన్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలైన వారికి అతిథులు బహుమతులు అందచేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భరత్‌కుమార్, బాబూరావు, ఎం.రమేష్, టీఎస్ రవికిరణ్

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

రూ.2.79 లక్షలు నగదు, మొబైల్ ఫోన్లు, బైక్‌లు స్వాధీనం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు బైక్‌లు, రూ. 2.79 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐ సురేష్ కేసు వివరాలను వెల్లండించారు. ఈ నెల 6వ తేదీన విజయవాడ ఈఎస్‌టీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో పని చేస్తున్న ఉద్యోగి బొజ్జగాని వెంకట నారాయణ అనే వ్యక్తి బ్యాంకు నుంచి నగదు డ్రా చేసి యాక్టివా బైక్ డిక్కీలో పెట్టాడు. ఇంటికి వెళ్తూ బీసెంట్ రోడ్డు వద్ద ఉన్న మోడ్రన్ సూపర్ మార్కెట్ వద్ద బైక్ పార్క్ చేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్, అందులోని రూ.4 లక్షలు నగదు కనిపించలేదు. దీనిపై గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసు విచారణలో ఈ కేసులో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గుబ్బల భాస్కర్, దాయం సురేష్‌కుమారు నిందితులుగా తేలింది. గురువారం సాయంత్రం రైల్వే స్టేషన్ సౌత్ గేట్ వద్ద ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న దొంగతనం సొత్తు రూ. 2.79 లక్షలు, రెండు మొబైల్ ఫోన్లు, యాక్టివా, గ్లామర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సిబ్బందిని సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవి కిరణ్ అభినందించారు.

సీఎం కార్యక్రమాలు విజయవంతం చేయండి

కలెక్టర్ పి.రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్లో ముఖ్యమంత్రి పర్యటనపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పోర్టు ప్రాంతంలో ఆవిష్కరించే పైలాన్, పూజా కార్యక్రమం నిర్వహణ దగ్గర నుంచి స్విమ్మింగ్‌పూల్ వద్ద జరిగే బహిరంగ సభ ముగింపు వరకు పటిష్టవంతమైన బందోబస్తు నిర్వహించాలని సూచించారు. వీఐపీ, సామాన్య ప్రజానీకానికి కేటాయించిన వాహనాల పార్కింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రాకపోకల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. హెలీప్యాడ్ వద్ద స్వాగత, వీడ్కోలు సమయంలో అదే విధంగా బహిరంగ సభ స్టేజీ మీద ఉండాల్సిన వ్యక్తులను ప్రొటోకాల్ ప్రకారం పేర్లను ఖరారు చేయాలన్నారు. 21వ తేదీ సాయంత్రం నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. వీఐపీ, డ్యూటీ, మీడియా పాస్‌లను అవసరాన్ని బట్టి కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి సభ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, పోర్టుకు భూములు ఇచ్చిన రైతులతో ముఖాముఖి కార్యక్రమం, స్టాల్స్ ఏర్పాటు, సభకు వచ్చిన ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సభాస్థలి వద్ద ఎంపీడీవో, తహసీల్దార్, ఏపీఎంలకు కేటాయించిన గ్యాలరీల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం వెంకటేశ్వర్లు, డీఎస్పీ వై మాధవరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ అపరాజితసింగ్

విద్యాదాత తాతినేని మృతి

పెనమలూరు: పోరంకిలో తాతినేని గోపయ్య అకాడమీ, శ్రీకృష్ణవేణి విద్యా సంస్థల చైర్మన్, విద్యా దాత డాక్టర్ తాతినేని సత్యనారాయణ (70) శుక్రవారం మృతి చెందారు. తాతినేని అనేక విద్యా సంస్థలు నెలకొల్పి విజయవాడ పరిసర ప్రాంతాల్లో గత 40 సంవత్సరాలుగా ఎనలేని సేవలు అందించారు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పలువురు తాతినేనికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ప్యారిస్ వెళ్లనున్న వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో ఈ నెల 26వ తేదీన ప్యారిస్‌లో జరిగే ఇంటర్నేషనల్ ఫోరం టూ ఎండ్ ప్లాస్టిక్ పొల్యూషన్ ఇన్ సిటీస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్యారిస్ వెళ్లనున్నారు. 75 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు నగరాల నుంచే వస్తున్నాయని, వీటిని రీసైక్లింగ్, రీయూజ్ చేయటానికి వీఎంసీ అనుసరించే విధానాల గురించి కమిషనర్ సమావేశంలో వివరించనున్నారు.

మూడు రోజుల సెలవుపై కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వ్యక్తిగత పనులపై ముంబాయి వెళ్తున్నారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు ఆయన సెలవు పెట్టారు.

నేటితో రీకౌంటింగ్ దరఖాస్తుకు గడువు పూర్తి

కంకిపాడు: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు రీకౌంటింగ్‌కు రూ. 500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చలానా చెల్లించి శనివారం నాటికి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తాహెరాసుల్తానా తెలిపారు. దరఖాస్తు, హాల్‌టికెట్‌ను ఆయా పాఠశాల హెచ్‌ఎంలతో సంతకం చేయించి లేడియంఫ్టిల్ బాలికల పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

క్లుప్తంగా

16న నగరానికి గణపతి సచ్చిదానందస్వామి

పటమట(విజయవాడతూర్పు): ఏపీ ప్రభుత్వం చేపట్టిన రాజ శ్యామల సుదర్శన శ్రీలక్ష్మీ మహాయాగం ముగింపు ఉత్సవాలు, మహా పూర్ణాహుతికి గణపతి సచ్చిదానంద స్వామి హాజరుకానున్నారని దత్తపీఠం నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ మధ్యాహ్నం నగరానికి వచ్చి, 17న మహాయాగం ముగింపు ఉత్సవాలకు హాజరై తిరిగి బెంగళూరుకు వెళ్తారని పేర్కొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాలలో ఎడ్యూస్కిల్స్‌తో కలిసి నిర్వహించిన బ్లూ ప్రిజమ్ కోర్సును పూర్తిచేసిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్‌లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ బీఎస్సీ విద్యార్థులకు అదనపు సర్టిఫికేషన్ కోర్సులను ఎడ్యూస్కిల్స్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నటరత్న ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యాన పలు రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న పురస్కారాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షులు డాక్టర్ నారాయణ మాస్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోపు దరఖాస్తులు పంపాలని ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు భారతీయ నృత్యపదర్శురి

విజయవాడ కల్చరల్: కళావిపంచి, శారద కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో భారతీయ నృత్యపదర్శురి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డోకిపర్తి శంకరావు, బొప్పన నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండిట్ అంజిబాబు సమర్పణలో కథక్ నృత్యాన్ని అచ్యుత మానస, పేరిణి నృత్యాన్ని మాస్టర్ సాయి వేదాంత్, కూచిపూడి నృత్యాన్ని మృణాళిని చేయనున్నట్లు పేర్కొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నాణ్యతా ప్రమాణాలతో పార్కు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కృష్ణలంక జాతీయ రహదారి వెంట ఉన్న అంబేద్కర్ పార్కును, కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంటనిర్మిస్తున్న రిటైనింగ్ పార్కును వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఆయన శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.5 కి.మీ పొడవునా సుమారు రూ.7 కోట్ల వ్యయ అంచనాతో నిర్మిస్తున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కులో ట్రీ కెనాఫీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ రోడ్లు, బేస్మెంట్ పనులు పరిశీలించారు. అనంతరం ఆయన అంబేద్కర్ పార్కును పరిశీలించి గ్రానైట్ డిజైన్స్‌ను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రీనరీ పరిశీలించి పార్కులో పచ్చదనం పెంపుపై ఏడీహెచ్ మరింత దృష్టి సారించాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ పార్కు పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్

పేదలకు మెరుగైన వైద్యసేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం 7వ డివిజన్ బాబూ జగ్జీవన్‌రామ్ గ్రంథాలయంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల బుచ్చిబాబు, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణలతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం బుచ్చిబాబు మాట్లాడుతూ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నియోజకవర్గంలోని పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ 'తూర్పు' ఇన్‌చార్జి అవినాష్ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ స్వయంగా పలువురికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు జరిగాయి.

కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొరివి చైతన్య, 6వ డివిజన్ కార్పొరేటర్ అమర్నాథ్, పార్టీ నేతలు వడ్లమూడి సంపత్, యలమంచిలి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం, చిత్రంలో బుచ్చిబాబు, వెంకట సత్యనారాయణ

వాగ్గేయకార చరితం.. సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: వాగ్గేయకార సంగీత చరితం సదా స్మరణీయని గాయకుడు బాలాజీకుమార్ అన్నారు. మెలోడీ గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం కలిసి పాడుదాం పేరుతో వాగ్గేయకార భక్తి సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

బాలాజీకుమార్ మాట్లాడుతూ మనకు తరగని గని ఆధ్యాత్మిక సంగీతమని దాన్ని భావి తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. సంగీత విద్వాంసులు కామేశ్వరి మాట్లాడుతూ రామదాసు, అన్నమయ్య లాంటి వాగ్గేయకారుల సంకీర్తనలు సమాజంలో చైతన్యం కలిగించాయన్నారు. ఆమె ఆధ్వర్యంలో చిన్నారి శ్రుతి, సీతాదేవి, కామేశ్వరి, డి.పద్మజ, మీనాకుమారి, దిట్టకవి, పవన్‌కుమార్ రామదాసు, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజ స్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు ఆలపించారు. వీటితోపాటు సెమీ క్లాసికల్ గీతాలను, చిన్నారి శ్రుతి ఆలపించిన రామదాసు, విఘ్నేశ్వర కీర్తనలు ఆకట్టుకున్నాయి.



భక్తి గీతాలను ఆలపిస్తున్న శ్రుతి, పవన్‌కుమార్, మీనాకుమారి, బాలాజీకుమార్ వద్దాది సూర్యకామేశ్వరి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డీఈఈ పి.హరిబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరనగర్, శ్రీనగర్ కాలనీ, న్యూ పీఅండ్‌టీ కాలనీ, విద్యుత్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, టీచర్స్ కాలనీ, కేపీ నగర్, వాసవ్య నగర్, వర్క్‌మెన్‌పేట, భద్రయ్య నగర్, ఓల్డ్ పీఅండ్‌టీ కాలనీ, సాయి నగర్, గాయత్రీనగర్, రామచంద్రనగర్, జేపీ నగర్, వరలక్ష్మీనగర్, ప్రశాంతి నగర్, ఐటీఐ కాలేజీ రోడ్డు, ఎల్ఐసీ కాలనీ, మిథులానగర్, క్రీస్తురాజపురం, సీఈసీ కాలనీ, వెటర్నరీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- సిద్ధార్థ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు పాలీక్లినిక్ రోడ్డు, ఎంవీ కాలనీ, గాయత్రీనగర్, కాలా నగర్, ఆచార్య రంగా నగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, ఇజ్రాయెల్‌పేట, శ్యామ్ నగర్, టిక్కిల్ రోడ్డు, గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాలనీ, బందరురోడ్డులోని బెంజ్‌సర్కిల్ నుంచి డీవీమానర్ వరకు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ హరిబాబు తెలిపారు.

ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు



ప్రసంగిస్తున్న మల్లాది వెంకటరామనాథశర్మ

విజయవాడ కల్చరల్: మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడని ఆధ్యాత్మికవేత్త మల్లాది వెంకటరామనాథ శర్మ అన్నారు. అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవంలో భాగంగా సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాలలో శుక్రవారం వెంకటరామనాథ శర్మ సుందరవైభవం, శ్రీమద్రామయణాంతర్గత హనుమత్ వైభవంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రాముడు వ్యక్తికాదని ఆధ్యాత్మిక శక్తిగా అభివర్ణించారు. హనుమంతుడులేనిదే రామకథలేదన్నారు. సీతాన్వేషణ సమయంలో హనుమంతుడు లంక కుచేరి సీతాదేవిని చూసి చలించిపోయాడన్నారు. రాముడు ఇచ్చిన ఉంగరం చూపించడంతో రామదూత హనుమంతుడు వచ్చాడని భావించినట్లు తెలిపారు. సర్వకార్యాలను విజయవంతగా చేయడం హన్మత్ లక్షణమన్నారు. సుందరాకాండ పారాయణం సర్వశ్రేయోదాయకమని తెలిపారు. దీన్ని పారాయం చేస్తే కార్యాలు నెరవేరుతాయన్నారు. దేవాలయ పాలకమండలి సభ్యులు హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

నర్సులు.. మాతృమూర్తులు



నర్సులను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ప్రతినిధులు

ఏపీ ఎన్జీవోస్ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్యరంగంలో నిస్వార్థమైన సేవలు అందిస్తున్న నర్సులే నిజమైన మాతృమూర్తులని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ హాల్లో నర్సులను సన్మానించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నర్సులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. నిస్వార్థ సేవలు అందిస్తున్న నర్సులను సత్కరించుకోవడం బాధ్యత అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని నర్సులు తమ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. అనంతరం దంత వైద్యశాలకు చెందిన కె. శివలీల, వి.రాణి, పాత ప్రభుత్వాస్పత్రికి చెందిన కె. ఇందిరాదేవి, బి.విజయశ్రీ, సీహెచ్ కల్యాణి, టి.తబిత, ఝున్సీరాణి, నూతన జనరల్ ఆస్పత్రికి చెందిన ఎస్.కె. షమావల్లాబేగం, డి. కనకదుర్గలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి సతీష్ కుమార్, సహాధ్యక్షులు బీవీ రమణ, ఉపాధ్యక్షులు ఎం.రాజబాబు, నగరశాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో 'నలంద' ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): సీబీఎస్‌ఈ బోర్డు శుక్రవారం విడుదల చేసిన 10వ తరగతి, 12వ తరగతి ఫలితాల్లో నగరంలోని నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ పేర్కొన్నారు. పదో తరగతిలో తమ విద్యార్థిని భూమికా జైన్ 482/500 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు, 34 మంది 450పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. 12వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు, ఎంపీసీసీలో అట్లూరి సుమంత్ 485/500, సిమ్రాన్ జియాన్ చాందని 478 మార్కులతో టాపర్స్‌గా నిలిచినట్లు చెప్పారు.



12వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాదల పద్మజ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ ఎం.మురళీకృష్ణ చెప్పారు. వారిని గాయత్రీ నగర్‌లోని 'చైతన్య' స్కూల్ ఆవరణలో శుక్రవారం అభినందించారు. తమ విద్యాసంస్థల్లో జీఎల్.చరణ్-487 మార్కులతో మొదటి, ఎస్.శ్రీషణ్ముఖ్, వై.మనిష్-485 మార్కులతో రెండో స్థానంలో నిలిచారన్నారు. 8 మంది విద్యార్థులు 485 పైగా మార్కులను పొందారన్నారు. గాయత్రినగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ యు.రజిత, జోనల్ అకాడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, డీన్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గుణదల (విజయవాడ తూర్పు): సీబీఎస్‌ఈలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అభినందించారు. ప్రిన్సిపాల్ రామభారతి మాట్లాడుతూ తమ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. 500 మార్కులకు 489 మార్కులు సాధించి నికిత పాఠశాలలో ప్రథమ శ్రేణి సాధించిందని తెలిపారు. జి నాగ వెంకట చరిష్మా, కె నాగ వెంకట నికిత్, ఐ సంజయ్‌లు 487 మార్కులతో ద్వితీయ శ్రేణి సాధించారన్నారు.

కేబీఎన్‌లో ఎంఎస్సీ డేటా సైన్స్ కోర్సు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని కేబీఎన్ కళాశాలలో రాష్ట్రంలోనే మొదటి సారిగా ఎంఎస్సీ (డేటా సైన్స్) కోర్సును ప్రవేశ పెడుతున్నట్లు కాలేజీ కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. కళాశాల కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డీమ్డ్ యునివర్సిటీలు మినహా సాధారణ విద్యా కోర్సులను నిర్వహించే కళాశాలల్లో రాష్ట్రంలోనే మొదటి సారిగా తమ సంస్థ ఈ పీజీ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనుందన్నారు. కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీవోక్, తదితర డిగ్రీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. బీటెక్‌లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, ఈ అండ్ ఐటీ కోర్సులు పూర్తి చేసిన వారు సైతం ఈ ఎంస్సీ (డేటా సైన్స్) కోర్సు చేయటానికి అర్హులని తెలిపారు. ఈ సందర్భంగా కోర్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
13-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
123	18
62,028	18,315

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్డాక్	12,246	▽	82
డోజోన్స్	33,132	▽	176
ఎఫ్టీఎస్ఈ 100	7,754	▲	24
డాక్స్	15,914	▲	79
షాంఘై	3,272	▽	37
నికాయ్	29,388	▲	261

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)		
60,964	▽	621
బంగారం (22 క్యారట్)		
60,720	▽	619
వెండి (కిలో)		
72,040	▽	2,755

మైనర్ల పేరిట పెట్టుబడి నిబంధనల్లో మార్పులు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో మైనర్ పేరిట సంరక్షకులు చేసే పెట్టుబడులకు సంబంధించిన నిబంధనల్లో సెబీ మార్పులు చేసింది. దీని కింద మైనర్ పేరిట చేసే పెట్టుబడులకు.. వారి ఖాతా లేదా తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ఖాతాల నుంచి ఏ రూపంలో అయినా చెల్లింపులను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు అనుమతించాలి. తల్లి దండ్రి లేదా సంరక్షకులతో జాయింట్ అకౌంట్ నుంచి చెల్లింపులు చేసినా ఆమోదించాల్సి ఉంటుంది. జూన్ 15 నుంచి ఇందుకు అవకాశం కల్పించేందుకు కావాల్సిన ఏర్పాట్లను, సవరణలను చేసుకోవాలని అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు (ఏఎంసీలు) సెబీ ఆదేశాలు జారీ చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ మొత్తాన్ని మైనర్ ఖాతా లేదా తల్లిదండ్రి, సంరక్షకులతో జాయింట్ ఖాతాకు మాత్రమే జమ చేయాల్సి ఉంటుంది.

రిటైల్ ధరలు దిగొచ్చాయ్!

ఏప్రిల్‌లో 4.7 శాతానికి తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం • 18 నెలల కనిష్టం • ఆహారోత్పత్తుల రేట్లు డౌన్

న్యూఢిల్లీ: కూరగాయలు, నూనెలు తదితర ఆహారోత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్టానికి తగ్గింది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న ద్రవ్యోల్బణ పరిమితి లక్ష్యానికి కాస్త చేరువగా 4.7 శాతానికి పరిమితమైంది. చివరిసారిగా 2021 అక్టోబర్‌లో ఇది 4.48 శాతం స్థాయిలో నమోదైంది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఇలా తగ్గడం ఇది వరుసగా రెండో నెల. గతేడాది ఏప్రిల్‌లో ఇది 7.79 శాతంగా ఉండగా ఈ ఏడాది మార్చ్‌లో 5.66 శాతానికి పరిమితమైంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (రెండు శాతం అటూ ఇటుగా) కట్టడి చేయాలని రిజర్వ్ బ్యాంక్‌ను కేంద్ర ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే. తాజాగా జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) విడుదల చేసిన డేటా ప్రకారం ఏప్రిల్‌లో ఆహారోత్పత్తుల బాస్కెట్ ద్రవ్యోల్బణం 3.84 శాతంగా ఉంది. ఇది ఈ ఏడాది మార్చ్‌లో 4.79 శాతంగా, గత ఏప్రిల్‌లో 8.31 శాతంగా ఉంది. నూనెల ధరలు 12.33 శాతం, కూరగాయల రేట్లు



(6.5 శాతం), మాంసం..చేపలు (1.23 శాతం) తగ్గాయి. అటు సుగంధ ద్రవ్యాలు, పాలు.. పాల ఉత్పత్తులు మొదలైన వాటి రేట్లు పెరిగాయి. రిటైల్ ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 4.68 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 4.85 శాతంగా ఉంది. ఎంపిక చేసిన 1,114 పట్టణ మార్కెట్లు, 1,181 గ్రామాల నుంచి క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాల ఆధారంగా ఎన్‌ఎస్‌వో ఈ డేటా రూపొందించింది. మే–జూన్ మధ్యకాలంలో సీపీఐ ద్రవ్యోల్బణం 4.7–5 శాతం శ్రేణిలో తిరుగాడవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. తాజా గణాంకాలను బట్టి చూస్తే ఆర్‌బీఐ తదుపరి పాలసీ సమీక్షలో వడ్డీ రేట్ల పెంపును నిలిపే అవకాశాలు ఎక్కువే కనిపిస్తున్నాయని, అయితే రేట్ల తగ్గింపునకు మాత్రం చాలా కాలం పట్టేయవచ్చని పేర్కొంది.

సరైన దిశలోనే పరపతి విధానం: ఆర్‌బీఐ గవర్నర్



ఏప్రిల్‌లోనూ రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం 'చాలా సంతృప్తినిచ్చే' అంశమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఇది .. ద్రవ్యపరపతి విధానం సరైన దిశలోనే సాగుతోందనే నమ్మకం కలిగిస్తోందని పేర్కొన్నారు. అయితే, దీని ఆధారంగా పరపతి విధానంలో ఏవైనా మార్పులు ఉండవచ్చా అనే ప్రశ్నకు.. తదుపరి పాలసీ సమీక్ష రోజైన జూన్ 8న దీనిపై స్పష్టత వస్తుందని వ్యాఖ్యానించారు.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ4లో రూ. 5,408 కోట్లు
- షేరుకి రూ. 2 డివిడెండ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నష్టాలను వీడి రూ. 5,408 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,033 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 78,439 కోట్ల నుంచి రూ. 1,05,932 కోట్లకు ఎగసింది. ఇక ఇదే కాలంలో స్టాండెలోన్ నికర లాభం రూ. 413 కోట్ల నుంచి రూ. 2,696 కోట్లకు జంప్‌చేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం టర్న్‌అరౌండ్ సాధించింది. రూ. 2,414 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ఆర్జించింది. 2021–22లో రూ. 11,441 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,78,454 కోట్ల నుంచి రూ. 3,45,967 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 2 డివిడెండ్ ప్రకటించింది. డీవీఆర్‌కు రూ. 2.1 చెల్లించనుంది.

భారీ పెట్టుబడులు: గతేడాది క్యూ4లో బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్(జేఎల్ఆర్) ఆదాయం 49 శాతం జంప్‌చేసి 7.1 బిలియన్ డాలర్లకు చేరింది. పూర్తి ఏడాదికి 25 శాతం అధికంగా 22.8 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధించింది. క్యూ4లో 24 శాతం వృద్ధితో 94,649 జేఎల్ఆర్ వాహనాలు విక్రయమైనట్లు సంస్థ తాత్కాలిక సీఈవో ఆడ్రియన్ మార్డెల్ తెలియజేశారు. పూర్తి ఏడాదికి 9% అధికంగా 3,21,362 యూనిట్ల హోల్‌సేల్ అమ్మకాలు నమోదైనట్లు వెల్లడించారు. ఇక దేశీయంగా ప్యాసింజర్ వాహన హోల్‌సేల్ విక్రయాలు 45 శాతం ఎగసి 5.38 లక్షలను తాకినట్లు టాటా మోటార్స్ పీవీ ఎండీ శైలేష్ చంద్ర పేర్కొన్నారు. 2023–24లో రూ. 38,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలున్నట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 0.8 శాతం బలపడి రూ. 516 వద్ద ముగిసింది.

62,000 ఎగువకు సెన్సెక్స్



ముంబై: వారాంతాన తొలుత నీరసంగా ప్రారంభమైన దేశీ స్టాక్ మార్కెట్లు చివరికి కోలుకున్నాయి. స్వల్ప లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ దాదాపు ఐదు నెలల తదుపరి తిరిగి 62,000 పాయింట్ల మార్క్‌ను అధిగమించింది. 123 పాయింట్లు జమ చేసుకుని 62,028 వద్ద ముగిసింది. ఇంతక్రితం 2022 డిసెంబర్ 12న ఈ స్థాయిలో నిలిచింది. నిఫ్టీ 18 పాయింట్లు పుంజుకుని 18,315 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 61,578 వద్ద కనిష్టాన్ని, 62,111 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 18,343–18,195 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. యూఎస్, చైనా ఆర్థిక గణాంకాలు మందగమన సంకేతాలివ్వడంతో తొలుత ఇన్వెస్టర్లు నిరాశకులోనైనట్లు నిపుణులు పేర్కొన్నారు. తదుపరి తగ్గనున్న ద్రవ్యోల్బణ అంచనాలు సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు తెలియజేశారు.

బ్లూచిప్స్ డీలా: ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో రంగాలు 0.75% చొప్పున పుంజుకోగా.. మెటల్, మీడియా, ఆయిల్, ఫార్మా 1.9–0.6% మధ్య డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐషర్ 6% జంప్‌చేయగా.. ఎంఅండ్ఎం, ఇండస్‌ఇండ్, యాక్సిస్, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ 2–0.5% బలపడ్డాయి. ఇతర బ్లూచిప్స్‌లో హిందాల్కో, బీపీసీఎల్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, అదానీ పోర్ట్స్, నెస్లే, జేఎస్ డబ్ల్యూ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 3.6–1% క్షీణించాయి.

చిన్న షేర్లు వీక్

చిన్న షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈలో మిడ్ క్యాప్ 0.35 శాతం నీరసించింది. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 1,014 కోట్లు ఇన్వెస్ట్ చేయగా.. దేశీ ఫండ్స్ రూ. 922 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి. ఇక డాలరుతో మారకంలో రూపాయి స్వల్పంగా 9 పైసలు తగ్గి 82.18 వద్ద ముగిసింది.

పారిశ్రామికోత్పత్తి డౌన్

- మార్చిలో 1.1%; 5 నెలల కనిష్టం
- తయారీ, విద్యుత్.. పేలవ పనితీరు



న్యూఢిల్లీ: దేశీయంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి మార్చిలో మందగించింది. విద్యుత్, తయారీ రంగాల పేలవ పనితీరుతో అయిదు నెలల కనిష్టానికి పడిపోయి.. 1.1%గా నమోదైంది. చివరిసారిగా 2022 అక్టోబర్‌లో అత్యంత తక్కువ స్థాయి వృద్ధి నమోదైంది. అప్పట్లో ఐఐపీ 4.1% క్షీణించింది. గతేడాది మార్చిలో ఇది 2.2% కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.8%గా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) డేటా ప్రకారం ...

- విద్యుదుత్పత్తి రంగం 6.1 శాతం వృద్ధి నుండి 1.6 శాతం క్షీణత నమోదు చేసింది.
- తయారీ రంగం వృద్ధి 1.4 శాతం నుంచి 0.5 శాతానికి నెమ్మదించింది.
- మైనింగ్ రంగం ఉత్పత్తి 3.9 శాతం నుంచి 6.8 శాతానికి పెరిగింది.
- క్యాపిటల్ గూడ్స్ విభాగం వృద్ధి 2.4 శాతం నుంచి 8.1 శాతానికి ఎగిసింది.
- ప్రైమరీ గూడ్స్ వృద్ధి గత మార్చిలో 5.7% ఉండగా ప్రస్తుతం 3.3%గా నమోదైంది.
- కన్జూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి మైనస్ 3.1 శాతం నుంచి మైనస్ 8.4 శాతానికి పడిపోయింది. కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ తాజాగా మైనస్ 3.1%కి చేరింది.
- ఇన్‌ఫ్రా/ నిర్మాణ ఉత్పత్తుల వృద్ధి 5.4 శాతంగా ఉంది. గత మార్చిలో ఇది 6.7 శాతం.
- 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఐఐపీ వృద్ధి 5.1 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది 11.4%.

వేదాంతా లాభం క్షీణత

క్యూ4లో రూ. 3,132 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 57 శాతం క్షీణించి రూ. 3,132 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 7,261 కోట్లు ఆర్జించింది. అల్యూమినియం బిజినెస్ తగ్గడం, రైటాఫ్‌లు లాభాలను దెబ్బతీశాయి. అయితే త్రైమాసికవారీగా(క్యూ3) చూస్తే నికర లాభం(రూ. 3,092 కోట్లు) 1 శాతం బలపడింది. అయితే మొత్తం ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 37,225 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 39,342 కోట్ల టర్నోవర్ సాధించింది. జింక్ నుంచి ముడిఇనుము వరకూ కమోడిటీ ధరలు తగ్గడం ఫలితాలను ప్రభావితం చేసింది. వీటికితోడు చమురు, గ్యాస్ బిజినెస్ నుంచి రూ. 1,336 కోట్ల మేర అనుకోని నష్టం వాటిల్లినట్లు కంపెనీ వెల్లడించింది. ఇక గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 1,45,404 కోట్ల టర్నోవర్ అందుకుంది.

పెట్టుబడులకు సై

గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనిల్ అగర్వాల్ సోదరుడు నవీన్ అగర్వాల్, కుమార్తె ప్రియా అగర్వాల్‌లను బోర్డు ఐదేళ్లపాటు డైరెక్టర్లుగా తిరిగి నియమించినట్లు వేదాంతా పేర్కొంది. చమురు, గ్యాస్ అన్వేషణకు 29.6 కోట్ల డాలర్ల పెట్టుబడి వ్యయాలకూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలియజేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) 1.7 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 2.3 శాతం నీరసించి రూ. 275 వద్ద ముగిసింది.

లైఫ్@360

మండు వేసవి. డీహైడ్రేషన్, తలనొప్పి, చెమట, ఒళ్లు పేలడం వంటి సమస్యలు ఎన్నింటినో మోసుకొస్తుంది. అయితే శతకోటి సమస్యలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు... కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా ఆయా సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. అలాంటి వాటిలో ఆహారం ఒకటి. వేసవి కాలంలో ఆరోగ్యకరమైన కొన్ని ఆహార పదార్థాలను డైట్‌లో భాగం చేసుకుంటే అవి శరీరాన్ని చల్లబరుస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా మారుస్తాయి. అవేంటో చూద్దాం.

ఈ ఫుడ్ సమ్మర్‌కి సో గుడ్!



ఎండా కాలంలో ఎదురయ్యే సమస్యల్లోచర్మం పొడిబారడం ఒకటి. శరీరంలోని నీటి శాతం తగ్గినప్పుడు దాని ప్రభావం చర్మంపై పడుతుంది. ఫలితంగా చర్మం పొడిబారుతుంది. దీన్ని నివారించాలంటే ఆరారగా మంచినీటిని తాగడం మంచిది.

మజ్జిగ



వేసవి రకరకాల శుభకార్యాలకు కూడా సీజనే. ఆయా శుభకార్యాలకు వెళ్లినప్పుడు మసాలాలూ, వేపుళ్లూ, స్వీట్లూ, పచ్చళ్లతో కడుపునిండా తినేస్తాం. దీంతో గుండెలో మంట, అజీర్తి వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. అలాంటప్పుడు కొంచెం ఉప్పు వేసిన పల్చని మజ్జిగ తాగితే హాయిగా ఉంటుంది. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ శరీరాన్ని తేమగా ఉంచడంతోపాటు, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మజ్జిగలోని కాల్షియం, ఇతర విటమిన్ల వల్ల నాడీ వ్యవస్థ పనితీరు బాగుంటుంది.

కొబ్బరి నీళ్ళు




శరీరంలోని వేడిని తగ్గించి చల్లదనాన్ని ఇచ్చే అద్భుతమైన లక్షణం కొబ్బరి నీటిలో ఉంది. శరీరంలో సహజ లవణాల్ని కోల్పోయినప్పుడు కలిగే అలసట నుంచి కొబ్బరి నీరు కాపాడుతుంది. నీళ్ల విరేచనాలతో బాధపడే పిల్లలకు డీహైడ్రేషన్ రాకుండా కాపాడే పానీయం కొబ్బరి నీరు.

చెరుకు రసం



చెరకురసంలో ఖనిజలవణాలు అధిక పరిమాణంలో ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు చెరకు రసం తాగగానే తక్షణ శక్తి వస్తుంది. చెరకు రస లో ఉండే పొటాషియం మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, మంట వంటి సమస్యలను నివారిస్తుంది. కాల్షియం సమృద్ధిగా ఉండటం వల్ల దంతక్షయం రాదు.

సబ్జా గింజలు



సబ్జా గింజలు నానబెట్టిన నీటిని తాగడం వల్ల జీవక్రియలు చురుగ్గా జరుగుతాయి. శరీర పనితీరుకి ఉపకరించే ఫ్యాటీయాసిడ్స్‌తో పాటు అధికంగా పీచును కలిగి ఉండడం వీటి ప్రత్యేకత. మహిళలకు అవసరమైన ఫోలేట్, నియాసిన్, చర్మాన్ని అందంగా ఉంచే విటమిన్ 'ఇ' సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో పేరుకొన్న వ్యర్థాలను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తాయి.

పుచ్చకాయ




ఎండాకాలంలో పుచ్చపండు తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. వేసవి తాపాన్ని, దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా శరీరంలో ద్రవాల పరిమాణం తగ్గిపోకుండా ఉండేందుకు పుచ్చకాయ ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఇందులో విటమిన్లు, పోషకాలు పుష్కలం. వ్యాధి నిరోధక శక్తి పెంచే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ 'బి', కాల్షియం, సోడియం, మెగ్నీషియం, పొటాషియం, క్లోరిన్, బీటాకెరోటిన్లు, ఆల్కలైన్, విటమిన్–ఏ, విటమిన్ –బి 6, విటమిన్–సి, లైకోపిన్ సమృద్ధిగా ఉంటాయి. తాజా ఆకుకూరలు, కూరగాయలు, కీరదోస, క్యారెట్ తీసుకోవడం వల్ల వేసవి లో వచ్చే ఎలర్జీలు, వాపు, ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవచ్చు. మండు వేసవిలోనూ ఆరోగ్యాన్ని పండించుకోవచ్చు.

వాల్ నట్స్



గింజల రాజుగా పిలవబడే వాల్‌నట్లలో ఫైబర్, ఒమెగా కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు, నిద్రని రప్పించే ట్రిప్టోఫాన్ మూలకం ఉంటుంది.

అంజీర (అత్తి పండ్లు)



పోషకాలతో పోల్చితే ఆపిల్, ఎండుద్రాక్షల కన్న అంజీరా చాలా మిన్న. పీచు పదార్థం ఎక్కువగా ఉన్న ఈ పండ్ల వల్ల మలబద్ధకం దూరమవుతుంది. చర్మ సమస్యలు రావు. అంతేకాదు, బరువు తగ్గాలనుకునేవారు వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.

మామిడి



అధిక శాతం సి విటమిన్, ఏ విటమిన్ కలిగి ఉన్న మామిడిలో పీచు పదార్థాలు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే పొటాషియం చెడు కొవ్వును తగ్గించి రక్తప్రసరణ వేగాన్ని మెరుగుపరుస్తుంది. దాని వల్ల గుండె సంబంధిత ఇబ్బందులు రావు.

నిమ్మ, బత్తాయి, కమలా




సిట్రిక్ జాతి పండ్లయిన నిమ్మ, బత్తాయి, కమలా వంటి వాటిలో విటమిన్ సి, ఐరన్ ఉంటుంది. ఎండాకాలంలో శరీరానికి కావల్సిన శక్తినిచ్చేవి ఇవి ఎండకు, వేడికి శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో బయటికి పోతుంది.

కొత్తిమీర, పుదీనా



కొత్తిమీర, పుదీనాలు రసం చేసుకొని తాగొచ్చు, బయట పనుల నిమిత్తం ఎండల్లో తిరిగేవారికి కూరల్లో కొత్తిమీర, పుదీనాలు ఎక్కువ మోతాదులో వేస్తే ఇవి శరీరాన్ని వడదెబ్బ నుండి కాపాడుతాయి.

ముంజెలు




వేసవిలో తాటి ముంజెల ప్రత్యేకత చెప్పనక్కర్లేదు. ప్రత్యేకంగా వేసవిలోనే లభించే ఈ ముంజలు రుచిలోనే కాదు పోషకాల్లోనూ ముందే ఉంటాయి.

అరటి, సపోటా, దానిమ్మ, ద్రాక్ష



ఎండాకాలం అయితే తక్షణశక్తి కోసం అరటిని ఆశ్రయించాల్సిందే. వేసవి కాలంలో దాహం ఎక్కువగా ఉంటుంది. దాహార్తిని తీర్చేందుకు సపోటా మంచి ఫలం. పోషకాలతో పాటు జీర్ణక్రియ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. వడదెబ్బ నుంచి రక్షిస్తూ, అందాన్ని కాపాడే పండు దానిమ్మ. ఇందులో పీచు పదార్థాలు కూడా ఎక్కువే.

హై బీపీని అదుపులో ఉంచే యోగం



అధిక రక్తపోటు ఉన్న రోగులకు గుండె జబ్బులు, స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎక్కువ పవర్ ఉన్న మందులను వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. అయితే వాటివల్ల కొన్ని సైడ్ ఎఫెక్టులు తప్పవు. అలా కాకుండా కొన్ని రకాల యోగాసనాలను వేయడం ద్వారా అధిక రక్తపోటు అదుపులోకి వస్తుందని యోగనిపుణులు చెబుతున్నారు. అవేమిటో చూద్దాం.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం , క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా అనేది ఫిట్‌గా ఉండటానికి ఒక పురాతన మార్గం. యోగా అధిక రక్తపోటును నియంత్రించడంతోపాటు ఒత్తిడిని దూరం చేస్తుంది. ఏ యోగాసనాలు అధిక రక్తపోటును నియంత్రించగలవో తెలుసుకుందాం.

1. బాలాసన... అధిక రక్తపోటు ఉన్న రోగులకు బాలాసన భంగిమ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యల నుండి మీకు ఉపశమనం కలిగిస్తుంది. ఇది అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ ఆసనం ఒత్తిడిని తగ్గిస్తుంది ,శరీరం అంతటా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం మెడ, భుజాల నుండి ఒత్తిడిని తగ్గిస్తుంది.

2. సుఖాసనం... శ్వాసను నియంత్రించడం ఇందులో చాలా ముఖ్యమైన ప్రక్రియ. ఈ ముద్ర మీ మనస్సును ప్రశాంతపరుస్తుంది. ఒత్తిడిని తగ్గించడం ద్వారా అధిక రక్తపోటును తగ్గిస్తుంది. ప్రశాంతమైన మనస్సు మంచి ఆరోగ్యాన్నిస్తుంది.

3. శవాసనం... ఈ భంగిమ పూర్తి విశ్రాంతి కోసం. సులభమైన ఆసనాలలో ఇది ఒకటి. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. శవాసనం మనస్సును ప్రశాంతపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది, శరీరానికి విశ్రాంతినిస్తుంది, తలనొప్పి, అలసట, నిద్రలేమిని తగ్గించడం ద్వారా అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

4. భుజంగాసన... భుజంగం అంటే పాము. తలను పాము పడగలా పైకి ఎత్తి, శరీరాన్ని సాగదీయడమే భుజంగాసనం. ఇది రక్త ప్రసరణను, ఆక్సిజన్‌ను మెరుగుపరుస్తుంది. ఈ భంగిమ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. దీంతో శరీరంలో ఫ్లెక్సిబిలిటీ వస్తుంది. ఇది ఆస్తమా రోగులకు కూడా ప్రయోజనకరం.

యోగా ప్రధానంగా ఒత్తిడిని తగ్గించడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఆసనాలే కాకుండా ప్రాణాయామం కూడా చాలా ఉపయోగపడుతుంది. ఇది హైపర్ గ్లైసీమియా, అధిక రక్తపోటుకు ప్రధాన కారణాలలో ఒకటి. కపల్‌భతి ఇన్సులిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది.

తిన్న తర్వాత ఇలా చేయొద్దు!



మన అలవాట్లలో కొన్ని మన ఆరోగ్యానికి దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. ఆ అలవాట్లే మన ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తాయి. మనం తిన్న తర్వాత అలవాటుగా చేసే కొన్ని పనులు ఆరోగ్యానికి హానికరం. అందుకే భోజనం చేసిన వెంటనే చేయకూడని కొన్ని పనుల గురించి తెలుసుకుందాం.

టీ, కాఫీ: తిన్న వెంటనే టీ, కాఫీలు తాగే అలవాటు చాలా మందికి ఉంటుంది. అయితే భోజనం చేసిన తర్వాత టీ, కాఫీలు తాగడం ఆరోగ్యానికి హానికరం. ఎందుకంటే ఇది మీ ఆహారం నుండి పోషకాలను గ్రహించడాన్ని నిరోధిస్తుంది.

స్నానం: భోజనం చేసిన తర్వాత స్నానం చేయకూడదు. తిన్న తర్వాత స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత మారుతుంది. దీనితో పాటు జీర్ణక్రియ కూడా దెబ్బతింటుంది. ఇది మీ ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు.

నిద్ర: కొందరికి భోజనం చేసిన వెంటనే నిద్ర వస్తుంది. అదే సమయంలో కొంతమంది విశ్రాంతి కోసం భోజనం తర్వాత నిద్రపోతారు. అయితే, అలా చేయడం వల్ల మీ ఆరోగ్యానికి హాని కలుగుతుంది. తిన్న తర్వాత నిద్రపోవడం మీ జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఇది తీవ్రమైన గుండెల్లో మంటకు కూడా కారణం కావచ్చు.

వ్యాయామం: కొందరు తిన్న వెంటనే వ్యాయామం చేస్తుంటారు. ఈ అలవాటును వెంటనే మార్చుకోవాలి. మీరు తిన్న వెంటనే వ్యాయామం చేయడం వల్ల అజీర్ణం ఏర్పడుతుంది. ఇది వికారం , వాంతులు, కడుపు నొప్పి మొదలైన వాటికి కారణమవుతుంది.

పండ్లు: భోజనం చేయగానే పండ్లు తినడం వల్ల ఆహారం నుంచి శరీరం తనకు కావలసిన పోషకాలను గ్రహించలేదు. దీనివల్ల అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

మన అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందంటే మంచిదే కదా..!